సంపుటి : 21 సంచిక : 5

అక్టోబర్ 2025

234

# మార్క్సిస్టు

వెల రూ. 15/-

## సైద్ధాంతిక మాసపత్రిక



అక్టోబర్ ప్రత్యేక సంచిక


ఈ సంచికలో........

అక్టోబర్ స్ఫూర్తి
భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపిత దినం
పున్నప్ర-వాయలార్ అమరుల జ్ఞాపకాలలో..
బెంగాల్ రైతాంగ గర్జన 'తెభాగా పోరాటం'
వర్లీ ఆదివాసుల తిరుగుబాటు
కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ- భారత కమ్యూనిస్టు పార్టీ
ఆజాద్ హింద్ ఫౌజ్ సాహసగాథ
పెట్టుబడిదారుల లాభాల కోసమే 13 గంటల పని
భారత దేశంలో హేతువాద ఆలోచనా విధానం
చిప్ యుద్ధం నుండి అరుదైన మూలకాల యుద్ధం వరకు

**ఈ మాసం ప్రత్యేకం**

# చిప్ యుద్ధం నుండి అరుదైన మూలకాల యుద్ధం వరకు

ప్రబీర్ పుర్కాయస్థ



రచయిత ఇంజినీర్, విద్యుత్, టెలికామ్, ఐటీ రంగాల్లో నిపుణుడు, ఢిల్లీ సైన్స్ ఫోరమ్ వ్యవస్థాపక సభ్యుడు. ప్రస్తుతం న్యూస్‌క్లిక్ వెబ్‌పోర్టల్ ఎడిటర్. పలు పుస్తకాలు, అనేక వ్యాసాలు రాశారు.

ప్రపంచంలో టెక్నాలజీ యుద్ధాల స్వరూపం బాగా మారిపోయింది. ఎలక్ట్రానిక్ చిప్స్ నుండి చాలా మందికి తెలియని, తెలిసినా చాలా తక్కువగా అర్థం చేసుకోగలిగే అరుదైన మూలకాల (రేర్ ఎర్త్స్)కు యుద్ధ రంగం మారిపోయింది. రసాయన శాస్త్రం, పీరియాడిక్ టేబుల్‌తో పెద్దగా పరిచయం లేని వారు ఇదంతా అకస్మాత్తుగా ముందుకొచ్చిన మూలకాల వల్ల తంటా అనుకుంటారు. వీటి గురించి దేశాలు కొట్లాడుకుంటున్నాయని భావిస్తారు. ఈ అరుదైన మూలకాలు మనం నిత్యం ఉపయోగించే అనేక రకాల పరికరాల తయారీకి అత్యవసరమైనవే కాకుండా పునరుత్పాదక ఇంధన టెక్నాలజీకు ఇవే పునాది వంటివన్న విషయం ఇప్పుడు మనకు తెలిసి వస్తున్నది. శిలాజ ఇంధనాలు (బొగ్గు, పెట్రోలియం వగైరా) పారిశ్రామిక విప్లవానికి నాంది పలికగా పశ్చిమ దేశాలు దానికి నాయకత్వం వహించాయి, కానీ హరిత ఇంధన విప్లవానికి ఆసియా నాయకత్వం వహిస్తోంది, దీనికి ప్రపంచ నాయకునిగా చైనా ఉన్నది అని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఆడామ్ టూజ్ చెప్పారు. అరుదైన మూలకాలు పునరుత్పాదక ఇంధనాలకు ఆధారంగా ఉండటమే కాకుండా కొన్ని రకాల సాంకేతికతలు అవి లేకుండా మనలేవు. ముఖ్యంగా ఎలక్ట్రో మాగ్నెట్స్ తయారీ ఈ అరుదైన మూలకాలు లేకుండా జరగదు. ఇటువంటి ఎలక్ట్రో మాగ్నెట్లను మన మొబైల్ ఫోన్లలో, విద్యుత్ వాహనాల్లో, సైనిక సాంకేతికలు, మనం నిత్యం ఉపయోగించే అనేక రకాల పరికరాల్లో ఉపయోగిస్తారు. అందువల్ల, అమెరికా చైనా మీద సాగిస్తున్న సాంకేతిక, ఆర్థిక యుద్ధంలోకి ఇవి కూడా చేరిపోవడంలో ఆశ్చర్యం ఉండనక్కరలేదు. అత్యంత ఆధునికమైన లిథోగ్రాఫిక్ పరికరాలపై అమెరికాకు ఆధిపత్యం ఉంది గనుక దాన్ని ఉపయోగించుకుని అది చిప్ యుద్ధాలకు దిగింది. కానీ ఇంధన యుద్ధాల్లో ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనాలు, అరుదైన మూలకాల యుద్ధంలో పరిస్థితి చాలా భిన్నంగా ఉంటుంది. చిప్స్ తయారీకి డచ్ కంపెనీ ఎఎస్ఎంఎల్ ఉపయోగించే పరారుణ కాంతి కిరణాలు (అల్ట్రా వైలెట్ లైట్) పై అమెరికా పేటెంట్లు పొంది ఉంది. దాంతో అవి అమెరికా ప్రభుత్వ చట్టాల కిందకు వచ్చాయి.

ఎఎస్ఎంఎల్ కంపెనీ లిథోగ్రాఫిక్ పనిముట్ల తయారీలో తిరుగులేని నాయకత్వం వహిస్తున్నది. అత్యంత అల్ట్రా వైలెట్ (ఇయువి) లిథోగ్రాఫిక్ యంత్రాలపై దానికి గుత్తాధిపత్యం ఉంది. పశ్చిమ దేశాలు చిప్స్ యుద్ధంలో పైచేయి కలిగి ఉండగా, అరుదైన మూలకాల సరఫరా గొలుసు మొత్తంపై చైనా దాదాపు గుత్తాధిపత్యం సాధించింది. ఇందులో భాగంగా అత్యంత సామర్థ్యం గల మాగ్నెటిక్ మోటార్ల ఉత్పత్తిపైన కూడా గుత్తాధిపత్యం సాధించింది. ఈ మోటార్లను అనేక రకాలైన సాంకేతికతల్లో అంటే విద్యుత్ వాహనాల నుండి గాలి మరలు, ఏరో-ఇంజిన్లు, మొబైల్ ఫోన్ల వరకు అనేక రకాల పరికాల తయారీలో ఉపయోగిస్తారు. అమెరికా ఎలాగైతే చైనాకు చిప్స్ ఎగుమతిని నిషేధించకుండా వాటి ఎగుమతులపై నియంత్రణ విధించిందో చైనా కూడా అరుదైన మూలకాల విషయంలో అదే చేసింది. కొన్ని రకాల అరుదైన మూలకాల ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే అనేక రకాల ఎగుమతి రిజిస్ట్రేషన్ లైసెన్సులు కావాలని చైనా కోరింది. తద్వారా సాంకేతిక యుద్ధంలో మీ ఇంటికి మా ఇల్లు ఎంత దూరమో, మా ఇంటికి మీ ఇల్లూ అంతే దూరం అని పశ్చిమ దేశాలకు స్పష్టం చేసింది.

ఇప్పుడు మనం అరుదైన మూలకాలు ఏమిటి, అవి ఎందుకంత ముఖ్యమైనవి అన్న విషయంలోకి నేరుగా వెళదాం. అరుదైన మూలకాలు పీరియాడిక్ టేబుల్‌లో 17 ఉన్నాయి. వాటిలో 6 మూలకాలను చైనా నియంత్రణ జాబితాలో చేర్చింది. అమెరికా నియంత్రణలు విధించినట్లే చైనా కూడా అటువంటి 'నియంత్రిత' మూలకాలను ఎగుమతి చేయాలంటే వాటిని తక్షణం ఉపయోగిస్తున్న వారు ఎవరు, వాటిని చివరిగా ఉపయోగించేవారు అన్న సమగ్రమైన షరతులు సమర్పించాలని కోరింది. ఇందులో ముఖ్యంగా నియోడైమియం ఐరన్ బోరాన్ (ఎన్ఇ-ఎఫ్ఇ-బి) ఎలక్ట్రోమాగ్నెట్ల విషయంలో మరింత గట్టిగా నొక్కింది. ఈ నియోడైమియం అయస్కాంతాల్లో రెండు అరుదైన మూలకాలున్నాయి. ఒకటి, డైస్ప్రోసియం, రెండోది టెర్బియం. ఈ రెండూ కూడా నియంత్రిత జాబితాలో ఉన్నాయి. ఈ రెండు మూలకాలను చైనా 100 శాతం నియంత్రిస్తోంది. నియోడైమియం అయస్కాంతాలు, డైస్ప్రోసియంతో కలిపితే మరింత ఉన్నతమైన అయస్కాంత లక్షణాలను ప్రదర్శిస్తాయి. అప్పుడవి మరింత తేలికగా, గట్టిగా తయారవుతాయి. వాటిని ఎటువంటి ఆకృతిలోకైనా, పరిమాణంలోకైనా మార్చుకోవచ్చు. అవి మరింత ఎక్కువ ఉష్ణోగ్రతను తట్టుకుంటాయి.

ఈ మూలకాలు ఎందుకంత ముఖ్యమైనవి, ఏ పరిశ్రమల్లో ఉపయోగపడతాయి?

అత్యధిక సామర్థ్యం గల ఎలక్ట్రోమాగ్నెట్ల ఉత్పత్తిలో చైనా గుత్తాధిపత్యం సాధించిందని వార్తలు తెలుపుతున్నాయి. ఈ ఎలక్ట్రోమాగ్నెట్లు పునరుత్పాదక ఇంధనాలు, మొబైల్ ఫోన్లు, సైనిక రంగంతో సహా అనేక ఉత్పత్తుల్లో కీలకంగా ఉపయోగపడతాయి. విద్యుత్ వాహనాలు (ఇవి లు), గాలి మరలు వగైరా కీలకమైన ఉత్పత్తులకు వాటి ఎలక్ట్రిక్ మోటార్ల సామర్థ్యం కీలకం. మనం వాడే సెల్‌ఫోన్లలో ఎంతసేపటి వరకు దాని ఛార్జింగ్ పనికి వస్తుంది అన్న విషయం దాని మోటారు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం
పివి రావు.........2

2. భారత దేశ అభివృద్ధిపై ప్రచారము, వాస్తవాలు
అకోశ వేణి .....4

3. కళలు ప్రజల స్వంతం
మలయశ్రీ వాష్మి ఇంటర్వ్యూ.......10

4. కొనసాగుతున్న బుల్డోజర్ రాజ్
అనుజ్ బెహల్.........14

5. ఢిల్లీ సుల్తానుల కాలం: ఖిల్జీలు, తుగ్లక్‌లు
ఎంవిఎస్ శర్మ......19

6. ప్రభుత్వభూములు ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం
ఇ ఎ ఎస్ శర్మ.........22

7. సమాఖ్య విధానానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ వాదనలు
ఎ కోటిరెడ్డి.........29

8. ప్రాచీన భారత దేశంలో వైద్య సంప్రదాయం
ఎస్ వెంకట్రావు........32



సంపాదకుడు :
ఎస్. వెంకట్రావు

సంపాదక వర్గం :
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మం), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిశోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# బెదిరింపులు చెల్లవు

భౌగోళ రాజకీయాలు బహుళ ధృవ ప్రపంచం వైపు చేస్తున్న ప్రయాణాన్ని అమెరికా ఆపగలదా! ఆపలేదని చెబుతున్నాయి ఇటీవలి పరిణామాలు. అమెరికా ఆయుధాల శక్తి, దాని డాలరు పట్టు, నాటో విస్తరణ కాంక్ష, మాటవినని దేశాలపై ఆర్థిక ఆంక్షలు, బహుళజాతి మీడియా ప్రచారం అన్నిటికీ మించి ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న రోజుకో బెదిరింపు...ఇవేవీ బహుళధృవ ప్రపంచంవైపు భౌగోళ ప్రయాణాన్ని నిలువరించలేవన్న విషయాన్ని ప్రస్తుత ప్రపంచ రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం కేవలం నాలుగు వర్ధమాన దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా)లతో ఏర్పడిన 'బ్రిక్' కూటమి తరువాత ఆఫ్రికా ఖండ ప్రతినిధిగా దక్షిణాఫ్రికాను కలుపుకుని 'బ్రిక్స్'గా ఏర్పడింది. మొదలు అమెరికా సామ్రాజ్యవాద నాయకత్వంలోని ఏకధృవ ప్రపంచ వ్యవస్థను ఎదిరిస్తూ, ప్రతిఘటిస్తూ ముందుకు పయనిస్తూనే ఉంది. ఈ రోజున ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యుఎఇ, ఇండోనేషియాలను కలుపుకుని 11 దేశాలకు విస్తరించింది. వీటితోపాటు బెలారస్, బొలీవియా, కజకస్థాన్, క్యూబా, మలేసియా, నైజర్, థాయిలాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్ బ్రిక్స్ భాగస్వామ్య దేశాలుగా చేరాయి. అదేవిధంగా ఆర్థిక సహకారంతోబాటు పరస్పర భద్రతా వ్యవహారాలను చర్చించేందుకు మూడు దశాబ్దాల క్రితం అయిదు దేశాలతో ఏర్పడిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) ఈనాడు 10 సభ్య, రెండు పరిశీలక దేశాలతోపాటు 14 చర్చల భాగస్వాములు, 4 అతిథి దేశాలతో కలుపుకుని 30 దేశాలకు విస్తరించింది. సామ్రాజ్యవాద జి7 కూటమి నయా-ఉదారవాద ప్రపంచాన్ని నడపడంలో విఫలమవుతోంది, దాని కనుసన్నల్లో ఏర్పడిన జి20 విఫలమైంది, కానీ వాటికి ప్రత్యామ్నాయ ప్రపంచ సంబంధాల కోసం ప్రయత్నిస్తున్న బ్రిక్స్, ఎస్‌సిఒలకు మాత్రం ఆదరణ పెరుగుతోంది.

బ్రిక్స్, ఎస్‌సిఒల బలం కేవలం వాటి సభ్యదేశాల సంఖ్యలో మాత్రమే లేదు. నేడు బ్రిక్స్ దేశాల సమిష్టి జిడిపి జి7 కూటమి జిడిపిని దాటిపోయి ప్రపంచ జిడిపిలో 44 శాతాన్ని చేరుకుంది. ఆర్థికాభివృద్ధిలో కూడా ఇది జి7ను మించిపోయింది. అందువల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో డాలరు ఆధిపత్యాన్ని ఛేదించడానికీ, తమ మధ్య ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, రక్షణ రంగాల్లో సహకారం పెంపొందించుకోడానికీ ఈ దేశాలు ఇటీవలి కాలంలో చేస్తున్న ప్రయత్నాలు అమెరికాకు గంగవెర్రులెత్తిస్తుండగా ఇతర పేద దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆఫ్రికా ఖండంలో ముఖ్యంగా వాయువ్య ఆఫ్రికాలోని 14 దేశాలు ఫ్రెంచ్ సామ్రాజ్యవాదుల ఒప్పందాల చెరను వదిలించుకుని తమ వనరులపై తామే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడానికి సమిష్టిగా నడుం కట్టడం దీనికి ఒక నిదర్శనం.

కోల్పోతున్న పట్టును తిరిగి సంపాదించుకోడానికి అమెరికా రానురాను అనేక ప్రాంతాల్లో యుద్ధాలను ఎగదోస్తోంది. నాటో కూటమిని రష్యా సరిహద్దులకు విస్తరించబోమని నాడు వాగ్దానం చేసిన అమెరికా ఒప్పందాన్ని ఉల్లంఘించి ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోడానికి చేసిన ప్రయత్నాలు ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి కారణమయింది. పశ్చిమాసియాలో జారిపోతున్న పట్టును నిలుపుకోడం కోసం గాజా, సిరియా, ఇరాన్ తదితర దేశాలపైకి ఇజ్రాయిల్‌ను ఉసిగొల్పింది. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న ఏకపక్ష దాడిలో ఇప్పటి వరకు 20 వేల మంది పసిపిల్లలతో సహా 64 వేల మందికి పైగా ప్రజలు మరణించారు. క్యూబాపై అయిదు దశాబ్దాలుగా సాగిస్తున్న ఆంక్షలను మరింత తీవ్రతరం చేసింది. తన మాట విననందుకు వెనిజులాపైకి కొత్తగా కయ్యానికి కాలు దువ్వుతోంది. దీనికి తోడు ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న సుంకాల యుద్ధం, వలస ప్రజలకు వ్యతిరేకంగా అతను విడుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు ప్రపంచ వ్యాపితంగా కల్లోల పరిస్థితులు సృష్టిస్తున్నాయి. చైనాకు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న యుద్ధ సన్నాహాలు ఆసియాలో తీవ్ర ఉద్రిక్తతలను ప్రోది చేస్తున్నాయి.

ఇదే సమయంలో అమెరికా ఆయుధాలను మరింతగా కొనుగోలు చేయాలనీ, భారత దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా ఉత్పత్తులకు బార్లా తెరవాలనీ అమెరికా భారత్ మీద ఒత్తిడి తెస్తున్నది. ఈ ఒత్తిళ్లను ఎదుర్కొని మన ప్రజల, ముఖ్యంగా విస్తారమైన రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన మోడీ ప్రభుత్వం ఒకవైపు అమెరికా ముందు లొంగుబాటును ప్రదర్శిస్తూ మరోవైపు జిఎస్‌టి 'తగ్గింపు సంబరాల' పేరుతో ప్రజలను మోసగిస్తున్నది. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఆంధ్ర ప్రదేశ్ మీద కూడా పడింది. ఆక్వా ఎగుమతులు దెబ్బతిని రైతాంగం సంక్షోభంలో పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అమెరికా దుశ్చర్యలను గురించి మాట్లాడకుండా రాష్ట్ర ప్రజలు రొయ్యలు ఎక్కువగా తినాలని మోసకారి మాటలు చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా ఆంక్షల ప్రభావం నుండి ప్రజలను రక్షించే చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని.

# అక్టోబర్ స్ఫూర్తి

ఎస్ వెంకట్రావు



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

అక్టోబర్....ఈ నెల పేరు వినగానే తొలి కార్మిక రాజ్యానికి అంకురార్పణ చేసిన మహత్తర అక్టోబర్ విప్లవం గుర్తుకు వస్తుంది. ప్రపంచ గమనాన్నే మార్చేసిన చైనా విముక్తి పోరాట విజయం మదిలో మెదులుతుంది. భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కూడా అక్టోబర్ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. వందేళ్ల క్రిందట 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది అక్టోబర్ మాసంలోనే. భారత విప్లవోద్యమంలో మైలురాళ్లుగా నిలిచిపోయే కేరళలోని పున్నప్ర-వాయలార్ పోరాటం, బెంగాల్‌లో తెభాగా పోరాటం, మహారాష్ట్రలో వర్లీ ఆదివాసీల తిరుగుబాటు ప్రారంభమైంది అక్టోబర్ నెలలోనే. సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో ఆజాద్ హింద్‌ఫౌజ్ ప్రొవిన్షియల్ ప్రభుత్వాన్ని ప్రకటించింది కూడా అక్టోబర్‌లోనే. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు భాగస్వాములుగా గల కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపన కూడా ఈ నెలలోనే జరిగింది.

అందువల్ల అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ అక్టోబర్...ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన అనేక ఘట్టాలకు ఆలవాలం. కమ్యూనిస్టులకు స్ఫూర్తిదాయకం.

### మహత్తర అక్టోబర్ విప్లవం

1917 అక్టోబర్ 25న చరిత్ర గర్భాన్ని చీల్చుకుని ఒక కొత్త సామాజిక వ్యవస్థ...ఒక మనిషిని మరోమనిషి ఒక జాతిని మరోజాతి దోచుకోని, దోపిడీలేని సోషలిస్టు వ్యవస్థ మొట్ట మొదటి సారి భూమిమీద ఆవిర్భవించింది. నాటి రష్యన్ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 25, నేటి ఆధునిక క్యాలెండర్ ప్రకారం నవంబర్ 7వ తేదీన వచ్చినప్పటికీ ఆ మొదటి కార్మికవర్గ విప్లవం అక్టోబర్ విప్లవంగానే చారిత్రక గుర్తింపు పొందింది. విప్లవ నేత విఐ లెనిన్ నేతృత్వంలో కమ్యూనిస్టులు (బోల్షివిక్‌లు) సాధించిన ఈ మహత్తర విప్లవం ప్రపంచలో మొదటి కష్టజీవుల రాజ్యాన్ని నిర్మించడమే కాదు భూగోళ రాజకీయాల్లో పెనుమార్పులు తెచ్చింది.

అక్టోబర్ విప్లవం విజయవంతమైన కొద్ది కాలంలోనే తొలి శ్రామిక రాజ్యం చేసిన అనేక చట్టాలు, తీసుకున్న అనేక చర్యలు చూస్తేనే మనకు దాని విశిష్టత ఏమిటో అర్థమవుతుంది. విప్లవం జయప్రదమైన మరునాడే అక్టోబర్ 26న సోషలిస్టు ప్రభుత్వం రెండు చట్టాలు చేసింది. మొదటిది తక్షణం యుద్ధాన్ని నిలిపి వేస్తూ జారీ చేసిన శాంతి చట్టం. రెండవది భూస్వాముల భూమిపై రైతులకు హక్కులు కల్పిస్తూ జారీ చేసిన చట్టం. ఈ చట్టంతో 36 కోట్ల ఎకరాల భూమి రైతుల పరమైంది. తదుపరి చట్టాల్లో జాతుల బందిఖానాగా ఉన్న రష్యన్ సామ్రాజ్యంలో జాతులకు విడిపోయే స్వేచ్ఛతో సహా అన్ని రకాల స్వేచ్ఛ ఇవ్వబడింది. అయితే రష్యా కార్మికవర్గ రాజ్యంగా మారిన తరువాత అంతకు ముందు రష్యన్ సామ్రాజ్యం క్రింద ఉన్న అనేక జాతులు పూర్తి స్వయం పాలనాధికారాలతో ఒకే దేశంగా కలిసి ఉండడానికి అంగీకరించాయి. దాంతో రష్యా పేరు యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ (యుఎస్ఎస్ఆర్)గా మారింది. లెనిన్ దాని తొలి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాడు.

లెనిన్ నాయకత్వంలో విప్లవ రష్యా జారీ చేసిన తదుపరి చట్టాల్లో ముఖ్యమైనది కార్మికుల పని దినాన్ని 8 గంటలకు తగ్గిస్తూ చేసినది. ఏనాటి నుండో ప్రపంచ కార్మికవర్గం చేస్తున్న ఈ డిమాండు సోషలిస్టు రష్యాలో మొట్టమొదటి సారి సాకారమైంది. రష్యాలోని పిల్లలందరికీ ఉచిత, లౌకిక విద్య నందించే ఒక చట్టం, ప్రభుత్వం ఆధ్వర్యంలో అనాథ శరణాలయాలు నెలకొల్పే మరో చట్టం చేశారు. వయోజనుల్లో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు గాను దేశ వ్యాపితంగా అక్షరాస్యతా క్యాంపెయిన్ ప్రారంభించారు. 1920 నుండి 26 వరకు సాగిన ఈ అక్షరాస్యతా కార్యక్రమంలో 50 లక్షల మందికి చదువు నేర్పారు.

మహిళలకు సమానత్వాన్ని ప్రసాదించే అనేక చట్టాలను సోవియట్ రష్యా చేసింది. ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా సోషలిస్టు సోవియట్ యూనియన్ మహిళలకు ఓటు హక్కు కల్పించింది. వారికి ఆర్థిక స్వావలంబన కల్పించే అనేక చర్యలు చేపట్టింది. మహిళలు కోరుకుంటే విడాకులు తీసుకోడానికి ఉన్న అడ్డంకులను తొలగించింది. గర్భం దాల్చిన తొలి మూడు మాసాల కాలంలో మహిళ కోరుకున్నట్లయితే గర్భస్రావం చేయించుకోవడానికి అనుమతిస్తూ చట్టం చేసింది. అప్పటికి ప్రపంచంలో ఇటువంటి చట్టం చేసిన తొలి దేశం సోవియట్ యూనియన్ మాత్రమే. రష్యాను లౌకిక రాజ్యంగా ప్రకటిస్తూ ప్రభుత్వం మరో చట్టం చేసింది. రాజ్యానికీ, చర్చికీ సంబంధం లేకుండా చేసింది. పాఠశాలల్లో మతబోధనలను నిషేధించింది.

### కలోనియల్ థీసిస్ : వలస దేశాల్లో విప్లవాలు

1920లో జరిగిన రెండవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో అక్టోబర్ విప్లవ సారథి లెనిన్ ప్రవేశపెట్టిన 'వలస సిద్ధాంతం' (కాలోనియల్ థీసిస్), వలస దేశాల్లో జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాల పట్ల కమ్యూనిస్టు పార్టీలు అనుసరించాల్సిన వైఖరిని స్పష్టం చేసింది. ఈ సిద్ధాంతాన్ని ఆయుధంగా చేబూని అనేక దేశాల్లోని స్వాతంత్ర్యోద్యమాల్లో కమ్యూనిస్టులు చురుకుగా పాల్గొన్నారు. ఈ ఉద్యమాలకు కమ్యూనిస్టులు నాయకత్వ స్థానంలోకి వచ్చిన చైనా, కొరియా, వియత్నాం వంటి పలు దేశాల్లో విప్లవాలు జయప్రదం అయి సోషలిస్టు దేశాలుగా అవతరించాయి. మిగిలిన చోట్ల జాతీయ విముక్తి పోరాటాలు విజయం సాధించి వలస దోపిడీ నుండి విముక్తి చెందాయి.

వలస దేశాల్లోని విముక్తి ఉద్యమాలు ఒకవైపు సామ్రాజ్యవాదుల పునాదులు కదిలిస్తుండగా మరోవైపు పెట్టుబడిదారీ

> "అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థలు ఉన్న దేశాలలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రచారం చేశారు. చైనాలో సరుకులు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు భారతదేశానికి వస్తాయనే ప్రచారానికి ఇది ఊతం ఇచ్చింది. పెట్టుబడులు దేశం నుండి వేగంగా నిష్క్రమిస్తున్న నితిలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న "ఆర్థిక అగ్ర రాజ్యం" అంటూ చెబుతున్న కథలు ఏ విధంగా పొసగుతాయి?"



1917 అక్టోబర్ విప్లవం సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న విప్లవరథ సారథి లెనిన్

ప్రపంచం మరింత తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకున్నది. ఆ సంక్షోభంలో పుట్టిన ఫాసిజం ప్రపంచాన్ని రెండో ప్రపంచ యుద్ధ జ్వాలల్లో ముంచేసింది. లక్షలాది అమాయకులపై నరమేధం సాగించింది. జర్మనీ, ఇటలీ, జపాన్ ఫాసిస్టు రాజ్యాల కూటమి ప్రపంచాన్ని పంచుకుని, ఫాసిస్టు పాలన స్థాపించడానికి పూనుకున్నది. అలాంటి సమయంలో అక్టోబర్ విప్లవంలో జన్మించి, రష్యా అంతర్యుద్ధంలో రాటుదేలిన సోవియట్ రెడ్ ఆర్మీ, త్యాగపూరితమైన సోవియట్ ప్రజల సహకారంతో నరహంతక నాజీయిజాన్ని ఓడించింది. ఫాసిజం వెన్నువిరవడంలో కీలక పాత్ర పోషించింది. ఆ క్రమంలోనే అది అనేక తూర్పు యూరప్ దేశాలను పెట్టుబడిదారీ దోపిడీ నుండి విముక్తి చేసి ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటుకు దారిచూపించింది.

## భారత దేశంపై అక్టోబర్ విప్లవ ప్రభావం

రష్యా విప్లవమూ, రష్యాలో సోషలిజం నిర్మాణమూ భారత దేశంపై గాఢమైన ప్రభావాన్ని చూపించాయి. నిజానికి అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో **1920** అక్టోబర్ నెలలోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. ఏర్పడిన ఏడాదిలోనే అది 1921 జరిగిన అల్హాబాద్ కాంగ్రెస్ మహాసభలో మొట్టమొదటి సారి "సంపూర్ణ స్వాతంత్ర్యం" తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆ విధంగా అప్పటి వరకు బ్రిటీష్ వారినుండి కేవలం కొన్ని రాయితీలు మాత్రమే కోరుతున్న కాంగ్రెస్ నేతృత్వంలోని జాతీయోద్యమంలో సంపూర్ణ స్వాతంత్ర్య కాంక్ష రగిలించింది భారత కమ్యూనిస్టు పార్టీ.

భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ చరిత్రను చదివితే మన దేశంపై అక్టోబర్ విప్లవ ప్రభావం ఎంతగా ఉందో తెలుస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనూ, తరువాతా జర్మనీ, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్, అమెరికాలో పనిచేసిన అనేక మంది భారత స్వాతంత్ర యోధులు రష్యన్ విప్లవం, లెనిన్ రచనల ప్రభావంతో కమ్యూనిస్టులై భారత దేశం చేరుకుని కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు తోడ్పడ్డమే కాకుండా స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పాల్గొన్నారు. వీరిలో స్వామి వివేకానంద సోదరుడైన భూపేంద్రనాథ్ దత్తా, సరోజిని నాయుడు సోదరుడైన వీరేంద్ర నాథ్ ఛటోపాధ్యాయ, కాబూల్‌లోని ప్రవాస భారత ప్రభుత్వ ప్రధాని ఎం. బరకతుల్లా, మూడవ ఇంటర్నేషనల్‌లో లెనిన్‌తో కలిసి పనిచేసిన ఎం.ఎన్.రాయ్, అబనీ ముఖర్జీ తదితరులున్నారు. వీరుగాక, మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన టర్కీ సుల్తాన్ మతాధిపత్యాన్ని పునరుద్ధరించాలని ఇస్లాం మత ప్రేరణతో ఖిలాఫత్, హిజ్రత్ ఉద్యమాలలో పాల్గొన్న యువకులు టర్కీ, ఆఫ్ఘనిస్తాన్‌లకు వలస వెళ్ళి అక్టోబరు విప్లవ ప్రభావం వల్ల అక్కడ కమ్యూనిస్టులుగా మారి భారతదేశం వచ్చి స్వాతంత్రోద్యమానికి ఊపు తెచ్చారు.

యుద్ధానికి ముందే పొట్టకూటికోసం పంజాబు తదితర రాష్ట్రాలనుండి అమెరికాకు వలస వెళ్ళిన వారు యుద్ధ కాలంలో అక్కడ గదర్ పార్టీ స్థాపించారు. భారత దేశంలో సాయుధ తిరుగుబాటుకు సన్నాహాలు చేసిన గదర్ వీరులు అక్టోబరు విప్లవ ప్రభావం చేత కమ్యూనిస్టులుగా మారి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. భారత దేశంలో అతివాద కాంగ్రెస్ వాదులు, భగత్ సింగ్ వంటి విప్లవ కారులు లెనిన్ రచనలు చదివి నిజమైన విముక్తి కార్మిక, కర్షక రాజ్యంలోనే సాధ్యమని తెలుసుకుని కమ్యూనిస్టులుగా మారారు. బ్రిటీష్ వలస పాలననుండి భారత్‌ను విముక్తి గావించేందుకు ఆఫ్ఘనిస్తాన్ మీదుగా నాటి సోవియట్ యూనియన్‌కు వెళ్ళిన మొహాజిర్లలో అనేక మంది అక్కడ కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరారు. అప్పటికే అక్కడ కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎం.ఎన్. రాయ్ ప్రభృతులతో కలిసి వీరు 1920 అక్టోబరులో తాష్కెంట్‌లో తొలి 'భారత కమ్యూనిస్టు పార్టీ' శాఖను స్థాపించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీని, ఇతర శ్రేణులను కూడా అక్టోబర్ విప్లవం ప్రభావితం చేసింది.

స్వాతంత్ర్యానంతరం మన దేశం సోవియట్ తరహా పంచవర్ష ప్రణాళికలతోనూ, సోవియట్ ఇచ్చిన సహకారంతో ఆర్థిక, శాస్త్ర-సాంకేతిక, వ్యవసాయ, వైద్య, రక్షణ రంగాల్లోనూ స్వావలంబన సాధించగలిగింది. సోవియట్ మద్దతు వల్లనే అది అమెరికన్ సామ్రాజ్యవాదుల ఒత్తిడిని తట్టుకుని స్వతంత్రంగా నిలబడగలిగింది. అలీన దేశాలకు నాయ

> ❝ బంగ్లాదేశ్‌లో ఈ అంశం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. దిగువస్థాయి వరకు విద్యను అందించటంతో పాటు మహిళలను ఎక్కువగా ఉత్పత్తిలో భాగస్వాములను చేయటంతో వస్త్రాలను ఎగుమతి చేయటంలో విజయం సాధించింది. అయినప్పటికీ మానవ వనరులను అభివృద్ధి చేయటం కోసం తగినంత పెట్టుబడి పెట్టకపోవటంతో ఇతర రంగాలలో పోటీ పడే పరిస్థితి లేకుండా పోయింది. ❞



**1917** అక్టోబర్ విప్లవం సందర్భంగా సెంట్ పీటర్స్‌బర్గ్‌లోని వింటర్ ప్యాలెస్ వద్ద విజయోత్సవ ప్రదర్శన జరుపుతున్న రెడ్ ఆర్మీ

కత్వం వహించింది. కానీ 1990వ దశకంలో సోవియట్ విచ్ఛిన్నం కావడంతో మన దేశం స్వావలంబన మార్గాన్ని విడిచిపెట్టి అమెరికా పంచన చేరాల్సిన దుస్థితిలోకి దిగజారి పోయింది.

**1949, అక్టోబర్ 1 : చైనా విముక్తి**

ప్రపంచ చారిత్రక గమనంలో మరో పెద్ద మైలురాయి చైనా విముక్తి. చైనా విప్లవానికి స్ఫూర్తినిచ్చింది కూడా అక్టోబర్ మహావిప్లవమే. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆ దేశంలో సాగిన సుదీర్ఘ విప్లవ పోరాటం విజయం సాధించి నవ చైనాను ప్రజా రిపబ్లిక్‌గా (పిఆర్‌సి) ప్రకటించినది అక్టోబర్ 1 తేదీనే.

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన ఏడాది తరువాత 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. తరతరాలుగా అర్ధబానిస భూస్వామ్య వ్యవస్థ క్రింద మగ్గిపోతున్న చైనా ప్రజల విముక్తి కోసం పార్టీ వీరోచిత పోరాటం నిర్వహించింది. ఈ పోరాటంలో కార్మికవర్గంతో పాటు రైతాంగాన్ని పెద్ద ఎత్తున కదిలించింది. 1911లో చైనాలో చివరి రాజరికం కూలిపోయిన తరువాత సన్ యట్-సెన్ నాయకత్వంలో ఏర్పడిన బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్ భూ సమస్యను పరిష్కరించలేకపోవడమే కాక ఒకవైపు వివిధ రకాల యుద్ధ ప్రభువులు, మరోవైపు అయిదు సామ్రాజ్యవాద దేశాల పాలన క్రింది అత్యంత అస్థిరత్వాన్ని ఎదుర్కొన్నది. విదేశీ దాస్యం నుండి, భూస్వామ్య పీడన నుండి చైనాను విముక్తం చేయడం కోసం చైనా కమ్యూనిస్టు పార్టీ బూర్జువా పక్షమైన కొమింటాంగ్‌తో కలిసి పనిచేసింది. అయితే చాంగ్ కైషెక్ నాయకత్వంలోని కొమింగ్‌టాంగ్, విప్లవాన్ని అణిచివేయడం కోసం 1927లో కమ్యూనిస్టు పార్టీపై పెద్ద ఎత్తున దాడికి దిగింది. కమ్యూనిస్టులను ఊచకోతకోసి, రైతాంగ పోరాటంపై ఉక్కుపాదం మోపింది. అలాంటి దశలో వరుస ఓటములు చవి చూసిన చైనా కమ్యూనిస్టు పార్టీ, కామ్రేడ్ మావో జెడాంగ్ నాయకత్వంలో దక్షిణాదిలో ఉన్న తన విప్లవ స్థావరాలను శత్రువుల దాడులనుండి తప్పించుకోడానికిగాను వ్యూహాత్మకంగా ఉత్తరాదికి మార్చాలని నిర్ణయించింది. దాదాపు లక్ష మంది ప్రజా విమోచనా సైన్యం ఏడాది పాటు సుమారు 10,000 కిలో మీటర్లు నడిచి చైనా ఉత్తరానగల షాంగ్జీ రాష్ట్రానికి చేరుకున్నారు. ఇది మహత్తర "లాంగ్ మార్చ్"గా చరిత్రకెక్కింది. చైనా లాంగ్ మార్చ్ **1934** అక్టోబర్ నెలలోనే **16**వ తేదీన ప్రారంభమై తిరిగి **1935** అక్టోబర్ **20**న ముగిసింది. ఆకలి, శత్రువుల దాడులు, అనేక ఈతిబాధల నెదుర్కొని లాంగ్ మార్చ్ ముగింపేసరికి బయలుదేరిన లక్షమంది ప్రజా విమోచనా సైన్యంలో 8,000 మంది మాత్రమే మిగిలారు.

రెండవ ప్రపంచ యుద్ధాన్ని హిట్లర్ 1939లో ప్రారంభించక ముందే ఫాసిస్టు రాజ్యాల కూటమిలో భాగస్వామిగా ఉన్న జపాన్ సామ్రాజ్యవాదులు 1936లో చైనాపై దాడి చేసి చాలా భాగం ఆక్రమించుకున్నారు. కొమింటాంగ్, కమ్యూనిస్టులతో కూడిన ఐక్య సంఘటన దురాక్రమణదారీ జపాన్‌ను తీవ్రంగా ప్రతిఘటించింది. ఈ పోరాటంలో కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున రైతాంగాన్ని, ప్రజలనూ కదిలించారు. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనలో కమ్యూనిస్టులు చూపిన తెగువ, పట్టుదల, త్యాగాలు పార్టీని చైనా ప్రజలకు చేరువ చేశాయి. 1945లో జపాన్ ఓటమితో మళ్లీ అంతర్యుద్ధం ప్రారంభమైంది. చివరికి అవినీతికర, ప్రజా వ్యతిరేక కొమింటాంగ్ నాయకులు, సైన్యం తైవాన్ పారిపోవడంతో చైనా ప్రధాన భూభాగం కమ్యూనిస్టు పార్టీ అధీనంలోకి వచ్చింది. **1949** అక్టోబర్ **1**న కామ్రేడ్ మావో చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడినట్లు ప్రకటించారు.

విముక్తి అనంతరం సోషలిజం బాట పట్టిన చైనా భూమి లేని పేదలందరికీ భూమి పంచింది. అది అమలు చేసిన సమూల భూ సంస్కరణలు చైనా రైతాంగపు జీవన ప్రమాణాలను ఎంతగానో మెరుగుపడ్డానికి దోహద పడ్డాయి. పంచవర్ష ప్రణాళికలతో అందరికీ విద్య, వైద్యం అందించ గలిగింది. అయితే 1991లో సోవియట్ విచ్ఛిన్నమై, అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాద ఏకధృవ ప్రపంచం ఏర్పడ్డంతో చైనా తన సోషలిస్టు అభివృద్ధి వ్యూహాన్ని మార్చుకున్నది. సామ్రాజ్యవాదుల వద్ద పోగుపడి ఉన్న పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానాలనూ ఉపయోగించుకుని చైనాను ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథాన నడిపించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ

సృజనాత్మక విధానాలు చేపట్టింది. ఈ నాడు సోషలిస్టు చైనా ఆర్థిక, సాంకేతిక, సైనిక రంగాల్లో అగ్ర రాజ్యాలకు ధీటుగా అభివృద్ధి సాధించడమే కాదు నేటి భూగోళ రాజకీయాల్లో అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని అడుగడుగునా ఎదిరించి నిలబడుతోంది. పెట్టుబడిదారీ ప్రపంచం సంక్షోభంలో కూరుకుపోతున్న నేటి తరుణంలో బలమైన ప్రభుత్వ రంగం అండతో చైనా సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధి ప్రపంచ ప్రజానీకానికి

> ❝జిడిపి పెరుగుదల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత దేశం అత్యధికంగా అభివృద్ధి చెందుతున్నదని ఊదర కొట్టటం అందుకు భిన్నంగా ఉన్న సమాచారమంతటినీ తోసిపుచ్చటానికే దారితీస్తున్నది. ఆర్థికవ్యవస్థలో వ్యవస్థాగతంగా గిడసబారి ఉన్న అంశాలు ముఖ్యమైనవి. ఎంతగా ప్రయత్నించినప్పటికీ జిడిపిలో ఉత్పత్తిరంగ వాటా పెరగటం లేదు. ద్రవ్యరంగం, నిర్మాణం, ప్రభుత్వ రంగాల ఖర్చు ఆర్థిక పెరుగుదలలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి.❞



**1949 అక్టోబర్ 1వ తేదీన విప్లవం విజయవంతమై చైనా ప్రజా రిపబ్లిక్ (పిఆర్‌సి) ఏర్పడినట్లు ప్రకటిస్తున్న విప్లవ సారథి మావో జెడాంగ్**

సోషలిజం విశిష్టతను చాటి చెప్పడమే కాదు, దివాళా తీసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు ప్రత్యామ్నాయాన్ని ప్రపంచం ముందు ఉంచుతోంది.

చైనా చొరవతో ప్రారంభమైన బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ, బెల్ట్ అండ్ రోడ్ అభివృద్ధి పథకం, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అనేక ప్రత్యామ్నాయాలు నేడు వర్ధమాన దేశాలకు అమెరికా ఇతర సామ్రాజ్యవాద ఒత్తిళ్లను ఎదుర్కొనే ఆయుధాలుగా పనిచేస్తున్నాయి. అమెరికా నాయకత్వంలోని ఏకధృవ ప్రపంచం నుండి భూగోళం బహుళ ధృవ ప్రపంచంవైపు పయనిస్తున్నదంటే దానిలో చైనా పాత్ర చాలా కీలకమైనది. ఒకనాడు అమెరికా ఆధిపత్య ఒత్తిళ్లనుండి తట్టుకోడానికి నవ స్వతంత్ర దేశాలకు సోషలిస్టు సోవియట్ యూనియన్ ఎంతగానో సహాయం అందించగా నేడు ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ఖండాల్లోని అనేక వర్ధమాన దేశాలకు చైనా అనేక విధాలుగా అండదండలందిస్తోంది, ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాన్ని చూపిస్తోంది. ఇది సహించలేకనే ఈనాడు సోషలిస్టు చైనాను నిలువరించడం కోసం అమెరికా అగ్రరాజ్యాధికార అహంకారంతో అనేక కుట్రలకూ, చైనా వ్యతిరేక సైనిక వ్యూహాలకూ, విషప్రచారానికీ పాల్పడుతున్నది. నిన్నటి వరకు చైనాకు వ్యతిరేకంగా అమెరికా వ్యూహంలో భాగస్వామిగా వ్యవహరించిన భారత ప్రభుత్వంకూడా నేడు అమెరికా నుండి వస్తున్న ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు చివరికి చైనాతో సయోధ్య కుదుర్చుకోక తప్పడం లేదు. ఏమైనా భారత దేశం చైనా, రష్యా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో కలిసి సామ్రాజ్యవాద ఒత్తిళ్లను ఎదిరించి నిలబడ్డం భారత ప్రజల ప్రయోజనాలకు ఎంతైనా ప్రయోజనకరమే. అయితే మోడీ ప్రభుత్వం ఎంతవరకు ఈ విధంగా నిలబడుతుందో వేచి చూడాలి.

❖

## అక్టోబర్ 17, 1920

# భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపిత దినం



రచయిత భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరు. 1997 అక్టోబర్ 5న ఈ వ్యాసాన్ని రాశారు.

ముజఫర్ అహ్మద్

భారత కమ్యూనిస్టు పార్టీ 1920 అక్టోబర్ 17వ తేదీన తాష్కెంట్‌లో స్థాపించ బడింది. తదుపరి సంవత్సరం, 1921లో అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ మహా సభలో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మౌలానా హస్రత్ మొహానీ, స్వామి కుమారానందలు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఇటువంటి తీర్మానం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. అయితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని 1930లో మాత్రమే ఆమోదించింది.

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండీ బ్రిటిష్ వారు కమ్యూనిస్టులను వెంటాడి వేటాడి వేధిస్తూనే ఉన్నారు. మొదట వారిపై పెషావర్ కుట్రకేసు (1922-23) పెట్టారు. తరువాత కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసు (1924) పెట్టారు. ఆ తరువాత పరమ నీచమైన మీరట్ కుట్రకేసు పెట్టారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు ఎటువంటి పరిస్థితుల్లో జరిగింది అన్న విషయంలో విభిన్న కథనాలున్నాయి. "భారత కమ్యూనిస్టు పార్టీ, విదేశాల్లో దాని స్థాపన" అన్న పుస్తకంలో కామ్రేడ్ ముజఫర్ అహ్మద్ పార్టీ ఏర్పాటు తేదీలను గురించీ, ఏర్పాటు చేసిన వ్యక్తుల గురించీ వివరాలు ఇచ్చారు. "నేనూ–కమ్యూనిస్టు పార్టీ" అన్న పేరుతో ఆయన రాసిన రెండో పుస్తకంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి పరిశోధనాంశాలను వివరించారు. వాటితో పాటు, ఉజ్బెకిస్థాన్ కమ్యూనిస్టు పార్టీ పురాతన పత్ర భాండాగారంలో లభించిన పత్రాల్లోని పూర్తి సమాచారాన్ని పుస్తకంలో ఇచ్చారు.

పార్టీ ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు, దాని తొలినాటి కార్యకలాపాలకు సంబంధించి అత్యంత అధికారికమైన సమాచారాన్ని ఆ రెండు పుస్తకాల నుండి తీసి ఈ వ్యాసంలో ఇస్తున్నాం. డాక్టర్ దేవేంద్ర కౌశిక్ జరిపిన పరిశోధన ఆధారంగా తను రాసిన పుస్తకం "నేనూ–కమ్యూనిస్టు పార్టీ" అన్న పుస్తకంలో ముజఫర్ అహ్మద్ ఈ విధంగా చెప్పారు.

**(1)**

ఆయన తనుజరిపిన పరిశోధన సందర్భంగా ఉజ్బెకిస్థాన్ పురాతన పత్ర భాండాగారంలో ఒక ఫైలు (ఎఫ్.60 ఇడి, నెం. 724,ఎల్ 1-14)ను కనుగొన్నారు. నిజానికి డాక్టర్ కౌశిక్ కోర్కె మేరకు ఆ భాండాగారం కీపర్ ఈ ఫైలును వెదికి ఇచ్చారు. ఈ ఫైలులో డాక్టర్ కౌశిక్, భారత కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన కొన్ని విలువైన పత్రాలను కనుగొన్నాడు. ఆ ఫైలులో అటువంటి విలువైన పత్రాలు దొరకుతాయని డాక్టర్ కౌశిక్ అనుకుని ఉండరని నేను భావిస్తున్నాను. ఈ ఫైలులో ఈ క్రింది పత్రాలు ఉన్నాయి:

1. తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడినప్పటి సమావేశానికి సంబంధించిన చాలా క్లుప్తమైన మినిట్స్,

2. కొత్తగా ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ, తరువాత జరిపిన సమావేశపు క్లుప్తమైన మినిట్స్,

3. తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందని తెలియజేస్తూ తుర్కిస్థాన్ కమ్యూనిస్టు పార్టీకి రాసిన ఒక లేఖ. (1920లో ఈ పార్టీని తుర్కిస్థాన్ కమ్యూనిస్టు పార్టీ అనేవారు. అప్పటికి అనేక రిపబ్లిక్‌లతో కూడిన సోవియట్ యూనియన్ ఇంకా ఏర్పడలేదు.)

డాక్టర్ కౌశిక్ కనుగొన్న మూడు పత్రాల్లోని విషయాన్ని నేను ఇక్కడ యథాతథంగా ఇస్తున్నాను.

అ) 1920 అక్టోబర్ 17వ తేదీన తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఈ క్రింది సభ్యులతో ఏర్పడింది.

1) ఎం ఎన్ రాయ్
2) ఎవెలినా ట్రెంట్ రాయ్
3) ఎ. ముఖర్జీ
4) రోజా ఫిటింగాఫ్
5) మొహమ్మద్ అలీ (అహ్మద్ హసన్)
6) మొహమ్మద్ షఫీద్ సిద్దిఖి
7) ఆచార్య ఎం ప్రతివాది భయంకర్


క్యాండిడేట్ సభ్యుల ప్రొబేషన్ సమయం మూడు మాసాలు. మొహమ్మద్ సిద్దిఖి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడవ ఇంటర్నేషనల్ ప్రకటించిన సూత్రాలను భారత కమ్యూనిస్టు పార్టీ స్వీకరిస్తోంది. భారత దేశ పరిస్థితులకు అనువైన కార్యక్రమాన్ని రూపొందించే పనిని చేపడుతుంది.

> “కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించి పోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయ మైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశం లోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది.”

## సిపిఐ వ్యవస్థాపక సభ్యులు



ఎంఎన్ రాయ్



అబని ముఖర్జీ

(సం॥) అధ్యక్షులు : ఎం ఆచార్య

(సం॥) కార్యదర్శి : ఎం ఎన్ రాయ్

ఆ) తాష్కెంట్‌లోని పార్టీ పురాతన పత్ర భాండాగారంలో దొరికిన తదుపరి పత్రాల్లో 1920 డిసెంబర్ 15వ తేదీన తదుపరి పార్టీ సమావేశం జరిగినట్లు మినిట్స్‌లో ఉంది. అందులో ఇలా ఉంది:

అబ్దుల్ ఖదీర్ సెహ్రాయ్, మసూద్ అలీ షా ఖాజీ, అక్బర్ షాలను క్యాండిడేట్ సభ్యులుగా చేర్చుకోవాలని తీర్మానించడమైనది,

ఇ) ఆ పత్రాల్లో ఎం ఎన్ రాయ్ తాష్కెంట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి పంపిన ఒక లేఖ కూడా ఉంది. పార్టీ కార్యదర్శి హోదాలో దానిపై రాయ్ సంతకం చేసి ఉన్నారు. (రష్యన్ భాషలో ఒట్వెస్టెవ్నీ సెక్రటర్ అని ఉంది) దాని కింద మరో సంతకం కూడా ఉందిగానీ అది స్పష్టంగా లేదు. రాయ్ ఎర్ర సిరాతో బోల్డ్ అక్షరాలతో రాశారు. ఆయన ఇలా రాశారు:

“ఇక్కడ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం జరిగిందని తెలియజేస్తున్నాం. అది మూడవ ఇంటర్నేషనల్ సూత్రాలకు అనుగుణంగా, కోమింటర్న్ టర్కిస్తాన్ బ్యూరో రాజకీయ మార్గదర్శకత్వంలో పని చేస్తున్నది....”

(అప్పట్లో అనేక మంది యువకులు ఖిలాఫత్ ఉద్యమంలో భాగంగా భారత దేశాన్ని విడిచిపెట్టి ఆఫ్ఘనిస్తాన్ మీదుగా తాష్కెంట్ చేరుకున్నారు. వాళ్లను ముహాజిర్లు అనేవాళ్లు. ముహాజిర్ అనేది అరబిక్ పదం. అణచివేత నుండి తప్పుకోడానికి తన స్వదేశాన్ని విడిచి వెళ్లిపోయిన వ్యక్తి అని దాని అర్థం. ఈ ముహాజిర్లలో అనేకమంది మాస్కోలో తూర్పుదేశాల శ్రామికుల కోసం ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయంలోనూ, తదుపరి తాష్కెంట్ సైనిక స్కూలులోనూ చేరారు. ప్రవాస భారత కమ్యూనిస్టు పార్టీ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో అనుసంధానమై ఉండేది....సంపాదకుడు)

**(2)**

“భారత కమ్యూనిస్టు పార్టీ, విదేశంలో దాని స్థాపన” అనే పేరుతో కామ్రేడ్ ముజఫర్ అహ్మద్ రాసిన పుస్తకంలోని ఈ క్రింది విషయాలు పార్టీ తొలినాటి కార్యకలాపాలను గురించి మనకు వివరిస్తాయి:

భారత కమ్యూనిస్టు పార్టీ ప్రవాస శాఖకూ, దేశం లోపల ఏర్పాటు చేయబడిన పార్టీకీ మధ్య లింకు నిరంతరాయమైనది. నిజానికి విదేశంలో ఏర్పడిన పార్టీ నిర్మాణానికి కొనసాగింపే భారత కమ్యూనిస్టు పార్టీ అంటే ఏ మాత్రం తప్పుకాదు. పార్టీ మొదటిగా విదేశంలో నిర్మించబడింది అనే విషయం నిస్సందేహమైంది, దీనిలో రెండో మాటకు తావులేదు. 1922–23లో బనాయించ బడిన పెషావర్ కమ్యూనిస్టు కుట్ర కేసు భారత కమ్యూనిస్టులను విచారించిన తొలి కేసు. ఈ కేసులో నిందారోపణలు చేయబడిన పది మందిలో తొమ్మిది మంది పార్టీ ప్రవాస శాఖ సభ్యులే.

1923 మే 1వ తేదీన నన్ను కలకత్తాలో అరెస్టు చేశారు. సౌకత్ ఉస్మాన్‌ను కాన్పూర్ లోనూ, గులామ్ హుస్సేన్‌ను లాహోర్‌లోనూ అరెస్టు చేశారు. మా ముగ్గుర్నీ పెషావర్ కుట్ర కేసులో ఇరికించాలని ప్రభుత్వం చూసింది. వాస్తవానికి షౌకత్ ఉస్మాన్, గులామ్ హుస్సేన్ లను పెషావర్ తీసుకెళ్లారు కూడా. అయితే అప్పటికే ఆ కేసు విచారణ పూర్తయింది. అందువల్ల మా ముగ్గుర్నీ వివిధ జైళ్లకు తీసుకుపోయి 1818 రెగ్యులేషన్ కింద జైలు నిర్బంధంలో ఉంచారు. “1924 ఫిబ్రవరి 27వ తేదీన ప్రభుత్వ సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ కల్నల్ సి కాయె, కాన్పూర్ జిల్లా మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరై అనేక మంది కమ్యూనిస్టుల ప్రాసిక్యూషన్ కోరుతూ ఒక పిటిషన్ దఖలు చేశాడు. భారత శిక్షా స్మృతి సెక్షన్ 121 కింద విచారణ ప్రారంభమైంది.

> ❝ కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించి పోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయ మైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశం లోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది. ❞

## సిపిఐ వ్యవస్థాపక సభ్యులు



ఆచార్య ఎం ప్రతివాది భయం కర్



ఎవెలినా ట్రెంట్ రాయ్

ఈ కేసు తరువాత కాన్పూర్ బోల్షివిక్ (లేదా కమ్యూనిస్టు) కుట్రకేసుగా ప్రసిద్ధి చెందింది. ఇది జరిగిన అయిదు సంవత్సరాల తరువాత 1929 మార్చి 15వ తేదీన ప్రభుత్వ డిప్యూటీ డైరెక్టర్ అయిన ఆర్.ఎ హోర్టన్ ఇదే పద్ధతిలో మీరట్ జిల్లా మెజిస్ట్రేట్ ముందు ఒక పిటిషన్ దఖలు చేశాడు. దీనిపై జరిగిన విచారణ మీరట్ కమ్యూనిస్టు కుట్ర కేసుగా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. కాన్పూర్ కేసులో పిటిషన్‌ను బెంగాల్ అడ్వకేట్ జనరల్ ఎస్. ఆర్. దాస్ తయారు చేశారు. (ఆ రోజుల్లో బెంగాల్ అడ్వకేట్ జనరల్ భారత ప్రభుత్వానికి సలహాదారుగా కూడా వ్యవహరించేవారు.) మీరట్ కుట్రకేసు పిటిషన్‌ను కలకత్తా హైకోర్టు న్యాయవాది అయిన లాంగ్‌ఫోర్డ్ జేమ్స్ తయారు చేశాడు. భాషలో కొద్దిపాటి తేడాలు మినహా రెండు కుట్రకేసుల్లో ప్రధానమైన పాయింట్లు ఒకేలాగ ఉన్నాయి. మీరట్ కుట్రకేసులోని ప్రాసిక్యూషన్ పిటిషన్‌లో మొదటి, నాల్గవ పేరాలను నేను కింద ఇస్తున్నాను.

1. రష్యాలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అనే ఒక సంస్థ ఉంది. సాయుధ విప్లవం ద్వారా ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న ప్రభుత్వ సంస్థల రూపాలన్నిటినీ కూలదోసి, వాటి స్థానంలో మాస్కోలోని కేంద్ర సోవియట్ పాలన కింద పనిచేసే సోవియట్ రిపబ్లిక్కులను ఏర్పాటు చేయడం.... ఈ సంస్థ లక్ష్యం.

2. 1921వ సంవత్సరంలో పైన చెప్పబడిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ బ్రిటిష్ ఇండియాలో తన శాఖను ఏర్పాటు చేయాలన్న కృతనిశ్చయానికి వచ్చింది. నేరారోపణకు గురైన శ్రీపాద అమృత డాంగే, షౌకత్ ఉస్మాన్, ముజఫర్ అహ్మద్‌లు మరికొందరు వ్యక్తులతో కలిసి, బ్రిటిష్ ఇండియాపై రాజు-చక్రవర్తికి సార్వభౌమత్వం లేకుండా చేయడం కోసం ఇక్కడ ఆ సంస్థకు చెందిన ఒక శాఖను ఏర్పాటు చేయడానికి కుట్ర చేశారు.

శ్రీపాద అమృత డాంగే, నేనూ భారత కమ్యూనిస్టు పార్టీలో చేరినప్పటి నుండే ఇక్కడ భారత దేశంలోనే ఉన్నాం. కానీ షౌకత్ ఉస్మాన్ మాస్కోలో ప్రవాస శాఖలో చేశారు. నేను ఇంతకు ముందే చెప్పినట్లు భారత కమ్యూనిస్టు పార్టీ తొలుత తాష్కెంట్‌లో ఏర్పాటు చేయబడింది. తరువాత మాస్కోలో తూర్పు దేశాలకు చెందిన శ్రామికుల కమ్యూనిస్టు యూనివర్శిటీ స్థాపించడంతో దాని ప్రధాన కార్యాలయాన్ని మాస్కోకు మార్చారు. భారతీయ యువకులు తాష్కెంట్‌కూ, మాస్కోకూ ఎలా చేరుకున్నారు, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో ఎలా సంబంధాల్లోకి వచ్చారు అన్న విషయాలను నేను ఇంతకు ముందే చెప్పాను. వారంతా కమ్యూనిస్టులు ప్రకటించిన సూత్రాలు, కార్యక్రమాలను ఆమోదించారు. అందువల్ల భారత కమ్యూనిస్టు పార్టీ విదేశంలో ఏర్పడింది, దాని కొనసాగింపుగానే భారత దేశంలో పార్టీ ఏర్పాటు జరిగింది.

విదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారు దానివల్లనే భారత దేశం తిరిగి వచ్చాక నిర్బంధాన్ని అనుభవించారు. 1922-23లో బనాయించబడిన పెషావర్ కమ్యూనిస్టు కుట్ర కేసు ఈ నిర్బంధానికి ఒక ఉదాహరణ. ఆ కేసులో జైలు శిక్ష అనుభవించిన వారు జైలు నుండి బయటకు వచ్చిన తరువాత మా లాగా భారత దేశంలోనే పార్టీలో చేరిన వారితో చేతులు కలిపారు.

(ఆ విధంగా బ్రిటిష్ రికార్డులు చెబుతున్న దాని ప్రకారమే, భారత దేశ కమ్యూనిస్టులు పార్టీ ఏర్పడినప్పటి నుండే స్వాతంత్ర్యోద్యమంలో అగ్రభాగాన నిలబడి పోరాడారు...సంపాదకులు)

## అక్టోబర్ 23, 1946

# పున్నప్ర-వాయలార్ అమరుల జ్ఞాపకాలలో..



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యవస్థాపక నేతల్లో ఒకరు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. **1997** అక్టోబర్ **19**న ఈ వ్యాసాన్ని రాశారు.

**ఇఎంఎస్ నంబూద్రిపాద్**

అక్టోబరు 23వ తేదీన పున్నప్ర-వాయలార్ పోరాట వార్షికోత్సవాన్ని కేరళ ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. కేరళలోని ట్రావెన్‌కూర్ సంస్థానంలో జరిగిన ఈ పోరాటాన్ని దివాన్ సిపి రామస్వామి అయ్యర్ నేతృత్వంలోని ప్రభుత్వం క్రూరంగా అణచివేసింది. ఈ పోరాటం నాటి ట్రావెన్ కూర్ రాష్ట్రంలోని రాజకీయ క్రమాన్ని పూర్తిగా మార్చివేసింది.

దేశం మొత్తంలో జరిగిన విధంగానే ట్రావెన్‌కూర్‌లోనూ జాతీయోద్యమం మూడు దశలుగా అభివృద్ధి చెందింది. మొదటి దశలో ఈ పోరాటానికి ఫ్యూడల్ వర్గాలు-అధికారం కోల్పోయిన రాజులు, భూములు పోగొట్టుకున్న భూస్వాములు- నాయకత్వం వహించాయి. రెండవ దశలో బూర్జువా వర్గం నాయకత్వం వహించింది. బూర్జువావర్గం కన్నా బలహీనంగా ఉన్నప్పటికీ, జాతీయోద్యమపు మూడవ దశలో భాగస్వామి అయిన కార్మికవర్గం ఉద్యమంలో చురుకుగా పాల్గొంది.

మిగతా దేశంలో కన్నా ట్రావెన్‌కూర్‌లో రెండవ, మూడవ దశల మధ్య వ్యత్యాసం చాలా తక్కువగా ఉన్నది. బూర్జువా వర్గం రాష్ట్ర కాంగ్రెస్‌లో నిర్మాణయుతంగా ఉండి, బాధ్యతాయుత ప్రభుత్వం కోసం పోరాటం ప్రారంభించిన 1930 నాటికే కార్మికవర్గం ఒక రాజకీయ శక్తిగా అభివృద్ధి అయింది. తెలంగాణ పోరాటం వలెనే కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో జరిగిన పున్నప్ర-వాయలార్ పోరాటం కూడా ఉత్తేజాన్ని కలిగించింది. ఈ విధంగా చూసినపుడు సంఘటితమైన కార్మిక వర్గం, దాని రాజకీయ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ రెండు బూర్జువా పార్టీలైన కాంగ్రెస్, ముస్లింలీగ్‌లతో ఘర్షణ పడింది. సమ్మె పోరాటాలు, రైతాంగ ఉద్యమాలకు లభించిన విధంగానే పున్నప్ర-వాయలార్, తెలంగాణ పోరాటాలకు ఇతర కార్మిక, రైతు ఉద్యమాల నుండి గట్టి మద్దతు లభించింది.

### బాధ్యతాయుత ప్రభుత్వం కోసం పిలుపు

ఆ విధంగా కాంగ్రెస్ నాయకత్వంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వం కోసం పోరాటం జరుగుతున్నపుడు -1938లో అలప్పుజ (అల్లెప్పి)లోని కార్మికవర్గం ఆ డిమాండ్‌ను బలపరుస్తూ ముందుకు వచ్చింది. దానితో పాటు ఒక స్వతంత్ర శక్తిగా జనరల్ సమ్మె జరిపింది. అలప్పుజలో జరిగిన ప్రదర్శనలో ఈ రచయిత కూడా పాల్గొన్నాడు. ఇందులో కార్మికవర్గ సంస్థలు ఒక కోర్కెల పత్రాన్ని ప్రకటించి, ఆ ప్రాతిపదికపై రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతాయుత ప్రభుత్వం కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించాయి. బాధ్యతాయుత ప్రభుత్వం కావాలన్న కోర్కె చార్టర్‌లోని మొదటి డిమాండ్‌గా ఉన్నది. ఆ ప్రాతిపదికపై అభివృద్ధి అయిన పోరాటం రాష్ట్ర కాంగ్రెస్ చేస్తున్న పోరాటాన్ని ఎంతగానో బలపర్చింది.

అంతకు ముందు అన్నిచోట్లా జరిగినట్లుగానే కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్న బూర్జువావర్గం ఈ పోరాటానికి ద్రోహం చేసింది. ట్రావెన్‌కూర్ దివాన్ సర్ సిపి రామస్వామి నాయర్‌కు వ్యతిరేకంగా మహారాజుకు ఇవ్వాలనుకున్న మెమొరాండాన్ని, మహాత్మా గాంధీ సలహాతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న అతివాదులు దీనిని విద్రోహంగా భావించారు. రాష్ట్ర కాంగ్రెస్ మొదటిగా రూపొందించిన మెమొరాండాన్నే అందజేయాలని వారంతటా వారు భావించారు. పోరాట ప్రభావంతో ఈ సెక్షన్ కాంగ్రెస్ నాయకులు అతివాదులుగా మారారు.

కోర్కెల పత్రంలోని మొదటి డిమాండ్‌ను సాధించలేకపోయినప్పటికీ, సమ్మెలో వ్యక్తమైన కార్మికవర్గ ఐక్యత, దానికి రాష్ట్ర కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో కోర్కెల పత్రంలో పేర్కొన్న అనేక ఆర్థిక డిమాండ్లను అంగీకరించక తప్పని పరిస్థితి దివాన్ ప్రభుత్వానికి ఎదురైంది. సంఘటితమైన అలప్పుజ కార్మికవర్గం బాధ్యతాయుత ప్రభుత్వం కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో శక్తివంతమైన భాగస్వామిగా ఉంటూ ముఖ్యమైన ఆర్థిక డిమాండ్లను సాధించుకున్నది.

### సమైక్యత కోసం ప్రచారం

భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని కార్మికవర్గ సంస్థకు ఇది గొప్ప ప్రోత్సాహం ఇచ్చింది. (రెండవ ప్రపంచ) యుద్ధానంతర వెల్లువతో దేశవ్యాపితంగా విప్లవాత్మక తిరుగుబాటుకు సన్నద్ధమౌతున్న పరిస్థితులలో పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికవర్గం, మధ్య తరగతి సమ్మె పోరాటాలు చేస్తున్నారు. బెంగాల్ (తెభాగ), పంజాబ్, మహారాష్ట్ర, కేరళలో భాగమైన మలబార్, కొచ్చిన్, అన్నింటిని మించి

> **"కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించి పోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయ మైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశం లోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది."**



పున్నప్ర-వాయలార్ అమరవీరుల స్మారక చిహ్నం

హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు మాట్లాడే కొన్ని ప్రాంతాలలో రైతాంగ పోరాటాలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో స్వతంత్ర భారతదేశంలో ట్రావెన్‌కూర్-కొచ్చిన్‌లతో పాటు మలబార్‌ను కూడా కలిపి, సమైక్య రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఆందోళన ప్రారంభమైంది. బొంబాయిలో భారత నావికా దళ తిరుగుబాటుతో పాటు దేశవ్యాపితంగా జరుగుతున్న ఈ పోరాటాలు ట్రావెన్‌కూర్‌పై ప్రభావం చూపాయి.

దివాన్ సర్ సిపి రామస్వామి అయ్యర్ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా బల మైన, మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్మించటంలో అలప్పుజ కార్మికవర్గం మరోసారి నాయకత్వ పాత్ర తీసుకున్నది. దివాన్ చేసిన రెండు ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా నిరసన ఉద్యమాన్ని సాగించింది. మొదటిది, బాధ్యతాయుతమైన ప్రభుత్వానికి అంగీక రిస్తున్నామనే పేరుతో అమెరికా తరహా ప్రజా స్వామ్యం ప్రాతిపదికగా ట్రావెన్‌కూర్‌కు నూతన రాజ్యాంగం ఉంటుందని దివాన్ ప్రకటిం చాడు. ఇందులో శాసనవ్యవస్థకు అనుగు ణంగా కార్యనిర్వాహక వర్గం పని చేయదు. రెండవది, భారతదేశం కోసం రూపొందిస్తున్న రాజ్యాంగానుసారం ట్రావెన్‌కూర్ భారత దేశంలో విలీనం కాకుండా, ప్రత్యేక దేశంగా ఉంటుంది.

దివాన్ రామస్వామి అయ్యర్ రూపొం దించిన ఈ రెండు వేర్పాటువాద ప్రతిపాదనలు కాంగ్రెస్‌తో పాటు మొత్తం ట్రావెన్‌కూర్ ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. దీనికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో కాంగ్రెస్ వారు కూడా పాల్గొన్నారు. అలప్పుజ కార్మిక వర్గం రెండు నినాదాలను రూపొందించింది.

1) అమెరికన్ నమూనాను వ్యతిరే కించండి

2) స్వతంత్ర ట్రావెన్‌కూర్‌ను అరేబియా సముద్రంలో కలిపేయండి.

రాష్ట్రంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వం కావాలన్నది తమ కోర్కెల పత్రంలో మొదటి డిమాండ్‌గా పెట్టుకొని, గతంలో చేసిన పోరాటానికి కొనసాగింపుగా అలప్పుజ కార్మికవర్గం ఈ పోరాటం చేసింది. దివాన్ రామస్వామి అయ్యర్ ఇస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక నినాదాలను ప్రతిఘటిస్తూ ఇప్పుడు కూడా స్వతంత్రంగానే ముందుకు వచ్చి పోరాటం చేసింది. కార్మికవర్గం అనుసరిస్తున్న విధానాల పట్ల కాంగ్రెస్ వారు సానుభూతితో ఉన్నారు. ట్రావెన్‌కూర్ ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ కార్మికవర్గం కమిటీలను ఏర్పాటు చేసి, వలంటీర్లను సమీకరించింది.

### అణచివేతకు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో పోరాటం

ఈ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం దృఢంగా నిర్ణయించుకుంది. సైనిక చట్టాన్ని ప్రకటించింది. దివాన్ రామస్వామి అయ్యర్ సర్వసైన్యాధ్యక్షునిగా బాధ్యతలు స్వీక రించాడు. ఈ 'తిరుగుబాటు'ను అణచివేయ టానికి పోలీసులను, సైన్యాన్ని వినియో గించాడు. ఒకవైపున ట్రావెన్‌కూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సంఘ వ్యతిరేక శక్తులు, మరో వైపున కార్మికవర్గ సాయుధ వలంటీర్లు మోహరించారు. అలప్పుజ పట్టణం, చుట్టు పక్కల గ్రామాలలో కార్మికవర్గ వలంటీర్లు పురాతన ఆయుధాలు చేబట్టి పోలీసులు, సైన్యంతో పోరాడారు. అమరజీవి కృష్ణ పిళ్లై ఆధ్వర్యంలోని కేరళ కమిటీ మార్గదర్శకత్వంలో పనిచేసిన ట్రావెన్‌కూర్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి ఈ క్రెడిట్ అంతా దక్కుతుంది. వాస్తవంగా నిరాయుధులుగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ దమనకాండను ఎదుర్కోవటానికి వారు సన్నద్ధమయ్యారు.

దివాన్ ప్రభుత్వం అంతం కావాలనీ, అమెరికన్ రాజ్యాంగాన్ని అరేబియా సముద్రం లో కలపాలనేవి మొత్తం ట్రావెన్‌కూర్ ప్రజల రాజకీయ డిమాండ్ల సారాంశంగా ఉన్నది. వాటి సాధన కోసం అలప్పుజ, చెర్తల తాలూకాలలోని కార్మికవర్గం, శ్రామిక ప్రజలు సాహసంతో పోరాడారు. మొత్తం ప్రజలు చేస్తున్న డిమాండ్ల సాధన కోసం వారు తమ తండ్రులు, కుమారులు, సోదరులను వందల సంఖ్యలో కోల్పోయారు. వందల మంది జీవితాంతం అవిటితనంతో బతకాల్సి వచ్చింది. చెప్పనలవికాని పోలీసు, సైనిక దురాగతాలకు అనేకమంది గురయ్యారు. ఈ మొత్తం ప్రాంతాన్ని నాశనం చేసి, ఎడారిలా మార్చేశారు. అనేకమంది తమ ఇళ్ళు, వాకిళ్ళను వదిలి, ట్రావెన్‌కూర్ బయట ప్రాంతాలకు వెళ్ళి బతకాల్సి వచ్చింది. అలప్పుజ, చుట్టుపట్ల ప్రాంతాలలో ఈ విధమైన విషాద దృశ్యాలు, కార్మికవర్గ వలంటీర్లు సాహసంతో చేసిన పోరాటాలను ట్రావెన్‌కూర్ ఎప్పుడూ చూడలేదు.

ఈ అసమాన పోరాటంలో కార్మికవర్గం ఓడిపోయింది. కాని దీనిలో నుండి "వాయలార్ రక్తమే మన రక్తం" అన్న కొత్త నినాదం పుట్టుకొచ్చింది. వారి బలిదానాలు వృధా పోలేదు. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఈ తిరుగుబాటును అణచివేసి సంవత్సరం తిరగకముందే "స్వతంత్ర ట్రావెన్‌కూర్", అమెరికా తరహా రాజ్యాంగం" నినాదాలిచ్చిన దివాన్ రామస్వామి అయ్యర్ ట్రావెన్‌కూర్ నుండి పారిపోయాడు. బాధ్యతాయుత ప్రభుత్వం, ప్రతిపాదిత స్వతంత్ర భారతదేశంలో ట్రావెన్‌కూర్‌ను విలీనం చేయటానికి మహారాజు ఆధ్వర్యంలోని ప్రభుత్వం అంగీకరించింది.

**కేరళ రాష్ట్ర రాష్ట్రం ఏర్పాటు**

దీని ఫలితాలు ట్రావెన్‌కూర్ ప్రజలకు మాత్రమే పరిమితం కాలేదు. రాజుల పాలనలో ఉన్న ట్రావెన్‌కూర్-కొచ్చిన్ రెండు రాష్ట్రాలు ఒకే రాష్ట్రంగా విలీనం కావటానికి, ఆ తర్వాత ఏడు సంవత్సరాలకు బ్రిటిష్ పాలనలో మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్న మలబార్ జిల్లాను కూడా కలుపుకొని, భాషా ప్రాతిపదికన ఐక్య కేరళగా ఏర్పడటానికి ఇవి ఆరంభసూచకం పలికాయి.

మళయాళ ప్రజలు కలలు కన్న కేరళ రాష్ట్రం ఏర్పడటానికి పున్నప్ర-వాయలార్ అమరులు చిందించిన రక్తం ప్రాతిపదికను ఏర్పరచింది. కేరళ రాష్ట్రం ఏర్పడిన కొన్ని నెలల తర్వాత రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ ఘన విజయం సాధించి, స్వంత బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

నూతనంగా ఏర్పాటైన ఐక్య కేరళ రాష్ట్రంలోని రెండు ప్రధాన భాగాలైన ట్రావెన్‌కూర్-కొచ్చిన్, మద్రాసు ప్రెసిడెన్సీలోని మలబార్ జిల్లా వామపక్ష ఉద్యమానికి పెట్టని కోటలుగా మారాయి. వామపక్ష ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన శక్తిగా తయారయింది. నూతన రాష్ట్రంలో కాంగ్రెస్-కమ్యూనిస్టు పార్టీలు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు పోరాడుతూ, ఆధిపత్యం సాధించటం కోసం పోటీ పడ్డాయి.

**కుల, మత శక్తులతో**
**కూటమి కట్టిన కాంగ్రెస్**

రాష్ట్రంలో జరిగిన మొదటి శాసనసభ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ సాధారణ మెజారిటీ సాధించింది. కాంగ్రెస్ ప్రధాన పోటీదారుగా ఉన్నది. కులం, మతం ప్రాతిపదికగా ఏర్పడిన ప్రధాన రాజకీయ పార్టీలు, సామాజిక, సాంస్కృతిక సంస్థలు,

> ❝ కోవిడ్ కాలంలో కొద్దిమేరకు పెరిగిన ఐటిరంగ ఉద్యోగాలు 50 లక్షలు దాటాయి. ఈ ఐటి బూమ్ కూడా అంతరించి పోయింది. దేశంలోని పెద్ద ఐటి కంపెనీలు 2024లో గణనీయ మైన సంఖ్యలో తమ సిబ్బందిని తొలగించాయి. 2025లో కొత్తవారిని ఉద్యోగాలలోకి తీసుకోలేదు. వాస్తవానికి దేశం లోని అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ 2025లో తన సిబ్బందిలో 2 శాతం, 12,000 మందిని తొలగిస్తానని ప్రకటించింది. ❞



జైలు నుండి విడుదలైన సందర్భంగా రెడ్ సెల్యూట్ చేస్తున్న పున్నప్ర-వాయలార్ పోరాట యోధులు


మలబార్ ప్రాంతంలో ముస్లింలీగ్, ట్రావెన్‌కూర్-కొచ్చిన్‌లో క్రైస్తవ సంస్థలు, రాష్ట్ర వ్యాపితంగా ఉన్నత, నిమ్న కులాలలోని హిందు మత సంస్థల మద్దతు కాంగ్రెస్‌కు ఉన్నది. అందువల్లనే రాష్ట్రంలోని అన్ని కుల, మతశక్తులను తన నాయకత్వంలోని కమ్యూనిస్టు వ్యతిరేక సంఘటనలోకి తీసుకురావటానికి అవసరమైన వ్యూహాన్ని జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ అనుసరించింది. 1957 తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ఏక పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వాలలో కుల, మత పార్టీలు, సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. 1967లో జరిగిన ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీకి 126 స్థానాలకు గాను, తొమ్మిది స్థానాలు వచ్చాయి. కుల, మత పార్టీలతో సంఘటన లేకుండా ఆ పార్టీ తొమ్మిది స్థానాలు మాత్రమే సాధించ గలిగింది. అప్పటి నుండి అధికారంలోకి రావటం కోసం కాంగ్రెస్ పార్టీ కుల, మత పార్టీలతో కూడిన సంఘటనను అంటిపెట్టుకొని ఉంది.

ఆ సంఘటన ఇపుడు విచ్ఛిన్నమైపోయింది. 1987, 1996 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో కుల, మత పార్టీలతో ఎటువంటి సంఘటన లేకుండా కమ్యూనిస్టు వ్యతిరేక కూటమిని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఓడించింది. కమ్యూనిస్టు వ్యతిరేక కూటమికి నాయకునిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అవినీతి బురదలో కూరుకుపోయి ఉన్నదని స్పష్టమైంది. తన నాయకత్వంలో కుల-మత కూటమిని పునరుద్ధరించటం కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం సాధ్యం కాదు. అందువలన మనం స్వాతంత్ర్య సాధన 50వ వార్షికోత్సవం జరుపుకొంటున్న ఈ సమయంలో పోరాటంలో బలిదానాలు, త్యాగాల ద్వారా కేరళ రాష్ట్ర ఏర్పాటుకు, రాష్ట్రంలో వామపక్ష ఉద్యమ ఆధిపత్యానికి పునాదులు వేసిన పున్నప్ర-వాయలార్ వీరులను స్మరించుకొంటూ, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమం వారికి విప్లవాంజలి ఘటిస్తున్నది.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

## 1946 అక్టోబర్

# బెంగాల్ రైతాంగ గర్జన 'తెభాగా పోరాటం'




**నేపాల్ మజుందార్, అతీష్ దాస్‌గుప్తా**

**1946-47** కాలంలో భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు బెంగాల్‌లో ఒక శక్తివంతమైన రైతాంగ ఉద్యమం ప్రారంభమైంది. దీనిని "తెభాగా ఉద్యమం" అని పిలుస్తారు. ఈ ఉద్యమం దీర్ఘకాలం కొనసాగకపోయినా బెంగాల్ చరిత్రలో అత్యంత స్ఫూర్తికమైన రైతాంగ ఉద్యమంగా నిలిచింది.

తెభాగ ఉద్యమాన్ని రెండు దశల్లో చూడవచ్చు:

1. స్వాతంత్ర్యం ముందు
2. స్వాతంత్ర్యం తరువాత

### వివాదానికి కారణం

తెభాగ ఉద్యమానికి ప్రధాన కారణం పంటను పంచుకునే విధానం. ఇక్కడ కౌలు రైతులను బర్గదార్స్, అదియార్స్, భాగిదార్స్ అని పిలుస్తారు. తమ సొంత ఖర్చులతో పండించిన పంటను భూ యజమానులతో ఎలా పంచుకోవాలనే దానిపై వివాదం ఉండేది. రైతులు పండిన పంటలో మూడింట రెండు వంతులు తమకు కావాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు వారికి సగం వాటా మాత్రమే లభించేది. అది కూడా భూ యజమానులు విధించే వివిధ రకాల అక్రమ వసూళ్లు, అధిక వడ్డీ రేట్ల కారణంగా రైతులకు వచ్చే వాటా బాగా తరిగి పోయేది. కరవు రోజుల్లో తీసుకున్న అప్పులకు కూడా భూ యజమానులు ఎక్కువ వడ్డీ వసూలు చేసేవారు.

### తెభాగా డిమాండ్ వెనుక చరిత్ర

1930లో మొదలై 1943 వరకు సాగిన బెంగాల్ కరవుతో గ్రామీణ బెంగాల్‌లో ఒక పెద్ద మార్పు చోటుచేసుకుంది. రైతులు ఒక్కొక్కరుగా తమ భూములను కోల్పోతూ కౌలు రైతులుగా మారిపోయారు. ఈ భూములన్నీ కొత్త జోతేదార్ల వర్గం చేతిలోకి చేరాయి. జమిందారీ వ్యవస్థ మధ్యలో పుట్టిన జోతేదార్లు (జమిందార్లు, రైతులకు మధ్యలో ఉన్న మధ్యతరగతి భూస్వాములు) పెద్ద భూభాగాలు కొనుగోలు చేశారు. ఒక అంచనా ప్రకారం ఈ కాలంలో దాదాపు పది కోట్ల రూపాయల విలువైన భూమి 15 జిల్లాల్లో అమ్ముడైపోయింది. ఈ భూములను ఎక్కువగా కొనుగోలు చేసినవారు జోతేదార్లు. వీరు 1793లో బ్రిటీష్ పాలకులు అమలు చేసిన పర్మినెంట్ సెటిల్‌మెంట్ వల్ల పుట్టుకొచ్చిన మధ్య తరగతి భూస్వామ్య వర్గం. వీరు జమిందార్లలా పెద్ద భూస్వాములు కాకపోయినా, రైతుల నుండి కౌలు వసూలు చేసే శక్తి వీరికి ఉండేది. జమిందార్లు ఎక్కువగా పట్టణాల్లో ఉండి, భూమిని కౌలుదారుల ద్వారా పర్యవేక్షించేవారు. కానీ జోతేదార్లు మాత్రం గ్రామాల్లోనే నివసించి, నేరుగా రైతులపై ఒత్తిడి తెచ్చేవారు. వారు భూములను కౌలుకి ఇచ్చి, పంటలో సగం వసూలు చేసేవారు. అంతేకాదు, అప్పులు, వడ్డీలు, అదనపు వసూళ్లతో రైతుల జీవితం మరింత దుర్భరంగా మారింది.

ఈ పరిస్థితుల్లోనే రైతులు ముందుకు వచ్చి ఒక స్పష్టమైన డిమాండ్ పెట్టారు. అదే "తేభాగా".

అంటే పంటలో సగం కాకుండా మూడింట రెండు వంతులు రైతుకే ఇవ్వాలి. జోతేదార్లు మూడో వంతు మాత్రమే తీసుకోవాలి. ఇది కేవలం పంటలో వాటా కోసం పోరాటం కాదు. ఆత్మగౌరవ పోరాటం. ఒకవైపు కౌలు తగ్గించాలి అన్న డిమాండుతోపాటు మరోవైపు భూమిపై హక్కు కావాలి అన్న ఆకాంక్ష రైతులది. ఈ డిమాండ్ వెనుక 60 లక్షల మంది రైతుల ఆవేదన ఉంది. తమ చెమటతో పండించిన పంటలో గౌరవప్రదమైన వాటా కావాలి, భూమిపై భద్రత కావాలి అన్న డిమాండ్‌తో వారు తేభాగా ఉద్యమం వైపు అడుగులు వేసారు.

### ఉద్యమ వ్యాప్తి

ఈ రైత్వారీ వ్యవస్థ ప్రధానంగా ఉత్తర బెంగాల్‌లో ఉండడం వల్ల, ఉద్యమం మొదట అక్కడే మొదలైంది, అక్కడే ఎక్కువగా కేంద్రీకృతమైంది.

1940లో ముస్లిం లీగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాండ్ రెవెన్యూ కమిషన్ పంటను రైతులకు మూడింట రెండు వంతులు ఇచ్చే సిఫార్సు చేసింది. అదే సమయంలో కిసాన్ సభ కూడా ఈ నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఇది 1946లో తిరుగుబాటు చేసిన "తేభాగా" రైతుల పోరాటానికి కేంద్ర నినాదంగా మారింది. ఈ కాలంలో భారతదేశం అంతటా గొప్ప పోరాటాలు, ఉద్యమాలతో అట్టుడుకి పోయింది. 1946 ప్రారంభంలో కలకత్తాలో భారత జాతీయ సైన్యం ఖైదీలకు మద్దతుగా ఉద్యమం, నావికా తిరుగుబాటు, పోస్ట్, టెలిగ్రాఫ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా జూలై 29న కలకత్తాలో సార్వత్రిక సమ్మె వంటివి జరిగాయి. ఆగస్టు 16న కలకత్తాలో మత కలహాలు కూడా ఈ

కాలంలోనే తలెత్తాయి, అవి త్వరగా ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించాయి. అక్టోబర్ ప్రారంభంలో తూర్పు బెంగాల్‌లోని నోఖాలిలో కూడా అల్లర్లు చెలరేగాయి.

పోరాటం ప్రారంభం

తెభాగ పోరాటానికి అక్టోబర్‌లో పిలుపునిచ్చారు. అయితే ఉద్యమానికి సన్నాహాలు నవంబర్ 1946లో మొదలయ్యాయి. గాంధీ నోఖాలి జిల్లాలో మార్చ్ చేయడాని కంటే ముందే, కిసాన్ సభ సభ్యులు ఆ జిల్లాలో మత హింస వ్యాప్తిని విజయవంతంగా అరికట్టారు, ఇది వారికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది.

మొదట తెభాగ ఉద్యమం కౌలుదారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే పరిమితమైంది. దీనికి వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు మద్దతు పలికారు. 1940వ దశకంలో ఉత్తర బెంగాల్‌లోని దినాజ్‌పూర్ రైత్వారీ ప్రాంతాలలోని మొత్తం రైతు జనాభాలో కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు.. ఈ మూడు వర్గాల వారు 70 శాతానికి పైగా ఉన్నారు. అయితే, క్రమంగా ఈ ఉద్యమం తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు కూడా విస్తరించింది. మొదటి దశ మొత్తం పంట కోత కాలం. ఈ కాలం నవంబర్ 1946 నుండి మార్చి 1947 వరకు సాగింది. ఈకాలంలో కౌలుదారులు జోతేదార్ల ఖామర్ (పంటను నిల్వ చేసే గది)లో కాకుండా తమ సొంత పొలాల్లో పంటను కోసి, తమ వాటాను తీసుకున్నారు.

మొదటి ఘర్షణ దినాజ్‌పూర్ జిల్లాలో జరిగింది. సునీల్ సేన్ నేతృత్వంలోని స్థానిక నాయకులందరూ రాజ్‌బన్షి షెడ్యూల్డ్ కులానికి చెందిన కౌలుదారులు. పోలీసులు లాఠీచార్జ్ చేసినప్పుడు ఒక రాజ్‌బన్షి వితంతువు లాఠీని ఊపుతూ పోలీసుల వైపు దూసుకెళ్లింది. ఆమె వెనుక కిసాన్ సభ సభ్యులందరూ అనుసరించారు. దీంతో పోలీసులు పూర్తిగా నిస్సహాయులై వెనక్కి తగ్గారు.

తెభాగఉద్యమం రెండో దశ

తెభాగ ఉద్యమం మొదటి దశలోనే రైతుల్లో నమ్మకం పెరిగింది. పోలీసులు నాయకులను అరెస్టు చేసినా ఉద్యమం ఆగలేదు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత చాలా మంది నాయకులు రహస్య జీవితం (అజ్ఞాత వాసం) ఎంచుకున్నారు. ఈ సమయంలో కిసాన్ సభ ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఉద్యమం నాయకులపై ఆధారపడకుండా, నేరుగా బర్గాదార్ల చేతుల్లో

> “2024లో ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, సంభల్, బరేలీ, బహ్రైచ్, మహారాజ్‌గంజ్, ఫరుఖాబాద్, హార్దోయి, ఆజంఘడ్, అయోధ్య గోరఖ్‌పూర్ వంటి పలు జిల్లాల్లో ఈ తరహా 14 సంఘటనలు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బహిరంగంగానే 'బుల్డోజర్ జస్టిస్'కు మద్దతు ఇస్తున్నందున ఇది ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. 2024 నవంబర్ 9న, మైన్పురిలో జరిగిన యోగి ఆదిత్యనాథ్ బహిరంగ సభకు ఆయన అనుచరులు పలువురు బుల్డోజర్‌లపై తరలివచ్చారు.”



పంటలో మూడోవంతు వాటా కోసం కదం తొక్కిన బెంగాల్ రైతులు

ఉండాలి అని భావించింది. దీంతో గ్రామీణ రైతులే సమావేశాలు పెట్టడం, రహస్యంగా సమాచారాన్ని పంచుకోవడం, నాయకులకు ఆశ్రయాలు కల్పించడం మొదలుపెట్టారు. ఈ ప్రక్రియలో అనేక మంది కొత్త గ్రామీణ నాయకులు ఎదిగి ముందుకు వచ్చారు.

ఈ దశలో మహిళల పాత్ర ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. పురుషులు వెనుకడుగు వేసిన సందర్భాల్లో కూడా, వృద్ధ మహిళలతో సహా మహిళా రైతులే పొలాల్లోకి దిగి వరి కోయడం, తెభాగా అమలు చేయడం వంటివి చేశారు. మహిళలు చూపిన ధైర్యం ఉద్యమానికి కొత్త శక్తినిచ్చింది.

ఉద్యమం ఉత్తర బెంగాల్ నుంచి తూర్పు బెంగాల్ వరకు విస్తరించింది. అక్కడ మోనీ సింగ్ అనే ప్రముఖ కూలీల నాయకుడు ముందుకు వచ్చాడు. ఎన్నో ఏళ్ల జైలు శిక్షలు అనుభవించిన ఈ నాయకుడు మయమన్సింగ్ జిల్లాలోని కిషోరగంజ్ ప్రాంతంలో రైతులను కదిలించాడు. అదే సమయంలో మేదినిపూర్‌లో కూడా తెభాగా ఉద్యమం బలంగా రగిలింది. మహిష్య కులం రైతులు, గిరిజన రైతులు పెద్దఎత్తున ఉద్యమంలో పాల్గొన్నారు.


తూర్పు బెంగాల్‌లో మైమెంగ్ ప్రాంతంలోని హజాంగ్ తెగ రైతులు "టంకా ఉద్యమం" ప్రారంభించారు. టంకా అంటే పంట పండినా పండక పోయినా ఒకే రకంగా కౌలు చెల్లించాల్సిన విధానం. దీనికి వ్యతిరేకంగా హజాంగ్ తెగ రైతులు, ముస్లిం రైతులు కలిసి పోరాటం చేశారు. ఇలా 1947 నాటికి తెభాగా ఉద్యమం 28 జిల్లాల్లో 15 జిల్లాలకు విస్తరించింది. సుమారు 50 లక్షల మంది రైతులు పోరాటంలో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించింది. అనేక జిల్లాల్లో సాయుధ పోలీసులను మోహరించారు. నవంబర్ 1946లో వెయ్యికి పైగా కిసాన్ సభ కార్యకర్తలను అరెస్టు చేశారు. వేలాది మందిపై తప్పుడు కేసులు పెట్టారు. మహిళా కార్యకర్తలపై దాడులు చేశారు. 1947 జనవరిలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు రైతులు చనిపోయారు. ఉద్యమం తీవ్రం అవ్వడంతో ప్రభుత్వం దిగి వచ్చి పండిన పంటలో మూడింట రెండు వంతులు బర్గాదార్ల హక్కు అని బిల్లును ప్రవేశపెట్టింది. కానీ ఈ చట్టం పూర్తిగా అమల్లోకి రావడానికి చాలా కాలం పట్టింది.

(మిగతా 26వ పేజీలో)

## 1945 అక్టోబర్

# వర్లీ ఆదివాసుల తిరుగుబాటు



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు

అశోక్ ధావళే

ఎనభై సంవత్సరాల క్రితం 1945, జనవరి 12న మహారాష్ట్ర కిసాన్ సభ వ్యవస్థాపక సమావేశం థానే జిల్లాలోని టిట్వాలాలో జరిగింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనుంచీ 7,000 మందికి పైగా రైతు ప్రతినిధులు ఆ సభకు హాజరయ్యారు. వాళ్లలో కేవలం 15 మంది మాత్రమే వర్లీ ఆదివాసులు. థానే జిల్లాలోని ఉంబర్‌గాంవ్ పంచాయితీ సమితి నుంచి వాళ్ళు వచ్చారు. ఇంత కొద్ది సంఖ్యలో హాజరైన ఈ ఆదివాసీలు కేవలం ఆరు నెలల వ్యవధిలోనే వేలాదిమంది ఆదివాసీలను సమీకరించి కిసాన్ సభ, ఎర్రజెండా నాయకత్వంలో సంఘటితమై, కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకత్వంలో చారిత్రాత్మకమైన తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు రాష్ట్రంలోనూ, దేశంలోనూ జరిగిన రైతాంగ ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగినట్టిది.

'వర్లీల తిరుగుబాటు' అన్న తన గ్రంథంలో శామ్‌రావ్ పాలేకర్ ఆ తిరుగుబాటులో తొలి అడుగులు ఏవిధంగా పడ్డాయో చాలా వివరంగా తెలిపారు.

1945 జనవరి మహాసభ హాజరైన వర్లీలను మంత్రముగ్ధుల్ని చేసింది. వాళ్ళని ఉత్తేజితుల్ని చేయడమే గాక వారిలో పూర్తి పరివర్తన కలగడానికి అది దోహదం చేసింది. జారీ నుంచి వచ్చిన మాయా ధంగ్డా అనే ఆదివాసి, బహుశా తన జీవితంలో అంతకు ముందు ఎన్నడూ పట్టుమని పది మాటలు కూడా మాట్లాడడం ఎరిగివుండడు. అతడు వెట్టిచాకిరీ రద్దుపై ప్రవేశపెట్టిన తీర్మానం మీద మాట్లాడేందుకు ముందుకు వచ్చాడు. మాట్లాడుతున్నప్పుడు అతడి గొంతు వణికింది. కానీ అతడి పట్టుదల ఆ మాటల్లో వ్యక్తం అయింది. ఎప్పటినుంచో అతడిలో గూడు కట్టుకుని వున్న భావాలన్నీ బద్దలై బైటకు ఒక వరద ప్రవాహం మాదిరిగా దూసుకువచ్చాయి. వాళ్ళ దారుణమైన స్థితిగతుల గురించి అతడు చెప్పిన వివరాలు మొత్తం ప్రతినిధులను నిశ్చేష్టుల్ని చేశాయి. తన ప్రసంగం ముగింపులో అతడు వర్లీలు తమ బానిసత్వానికి స్వస్తి పలకనున్నారని, తమను అణచివేసేవారిని ప్రతిఘటించి తీరుతారని స్పష్టంగా ప్రకటించాడు.

తక్కిన ప్రతినిధుల మాదిరిగా కాకుండా వర్లీలు ఆ మహాసభను, ఆ తీర్మాన ప్రాధాన్యతను విభిన్నంగా గుర్తించారు. వెట్టిచాకిరీని రద్దు చేసి తీరుతాం అని మహాసభలో చేసిన ప్రకటన తాను చేసిన ఒక శపథం అనీ, ఆ శపథాన్ని ఎటువంటి త్యాగానికైనా వెనుదీయకుండా, ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొని నెరవేర్చితీరాల్సిందేననీ అతడు భావించాడు. మహాసభ నుండి తిరిగి ఇళ్ళకు చేరిన వర్లీలు తక్కిన ప్రతినిధుల మాదిరిగా లేరు. వారు పూర్తిగా, గుర్తు పట్టలేనంతగా పరివర్తన చెందారు. తమను అణచివేసే పెత్తందారులముందు వారు ఇక ఏ మాత్రమూ జంకు గొంకు లేకుండా నిలవగలుగుతున్నారు. వారి పెత్తనాన్ని ఎదిరించగలుగుతున్నారు. తమ వెంట మహాసభ ప్రాంగణంలో అలంకరణ కోసం ఎగరేసిన ఎర్రజెండాలను కొన్నింటిని తమతో వాళ్ళు తీసుకెళ్ళారు. ఆ ఎర్రజెండాయే తమకు మార్గదర్శిగా, మిత్రుడిగా, బోధకుడిగా ఉంటుందని వారనుకున్నారు. తమ పాత దైనందిన జీవిత విధానాన్ని విడిచిపెట్టారు. ఒక గ్రామం నుండి మరో గ్రామానికి మత బోధకుల మాదిరిగా తిరుగుతూ, ఎక్కడికక్కడ గ్రూపు సమావేశాలు జరుపుతూ వర్లీ రైతులకు మహాసభ సందేశాన్ని వివరించారు. ఆ సందేశం యావత్తు వర్లీ రైతులనూ కదిలించింది. అడవిదారులన్నీ ఆ సందేశంతో ప్రతిధ్వనించాయి.

### సహించరాని పీడన, అణచివేత

టిట్వాలా మహాసభ అనంతరం గోదావరి పరులేకర్, ఆమె సహచరులు ఆదివాసీ ప్రాంతాలకు వెళ్ళి వారితో పూర్తిగా కలగలిసిపోయారు. అమానవీయ దుస్థితిపై తిరగబడేలా వారిని ఉత్తేజపరిచారు.

ఒక శతాబ్దం వెనుక ఈ ఆదివాసీలకే అక్కడి భూమి మొత్తం సొంతం. క్రమంగా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దన్నుతో ఆ భూమినంతటినీ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. 1945 నాటికి దహాను సమితిలో 6.8 శాతం, ఉంబర్‌గాంవ్ సమితిలో 2.2 శాతం భూమి మాత్రమే ఆదివాసీలకు మిగిలింది. తక్కినదంతా భూస్వాములది, వడ్డీ వ్యాపారులది. వారి భూమిని తమ చేజిక్కించుకున్నాక, భూస్వామి ఆదివాసీలను తమ వద్ద వెట్టి చాకిరీ చేసేవారిగా దిగజార్చాడు. ఆ ప్రాంతంలో భూదాస్యాన్ని ప్రవేశపెట్టారు. ఆదివాసీలు భూస్వాములకు ఎటువంటి ప్రతిఫలమూ లేకుండా బలవంతంగా అన్ని రకాల చాకిరీ చేయవలసివచ్చేది. చేసిన అప్పు తీర్చలేనివారిని బానిసలుగా పట్టుకుపోయే పద్ధతి ప్రవేశించింది. అలా బానిసగా మారిన ఆదివాసి భార్య సైతం భూస్వామికి బానిసగా పరిగణించబడేది. ఆ భూస్వామి ఆమెను అనునిత్యం తన శారీరక కోర్కెలను తీర్చుకోడానికి

వాడుకునేవారు. కొలు రేట్లు, చట్టవిరుద్ధంగా దోచుకోవడం పెరిగిపోయింది. ఫారెస్టు కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఫారెస్టు ఉద్యోగులు ఆదివాసీలను నిరంతరం దోపిడీ చేస్తూ, అణచివేస్తూవుండేవారు. న్యాయస్థానాలు, పోలీసులు, ప్రభుత్వ విభాగాలు అన్నీ భూస్వాముల గుప్పెట్లో ఉండేవి. ఎటువైపూ పరిష్కారం కానరాని పరిస్థితి ఏర్పడింది.

ఒకవైపు లక్షలాది ఆదివాసీలు తీవ్ర పేదరికంతో నలిగిపోయేవారు, మరోవైపు కొద్దిమంది భూస్వాములు అపారమైన సంపదలను పోగేసుకున్నారు. వారి దురాగతాలకు అంతే లేకుండాపోయింది.

**నిరంతర చిత్రహింసలు**

ప్రఖ్యాతి చెందిన 'ఆదివాసుల తిరుగుబాటు' అన్న తన గ్రంథంలో గోదావరి పరులేకర్ మనల్ని దిగ్భ్రాంతికి గురి చేసే కొన్ని ఘటనలను తెలియజేశారు. ఆమె మాటల్లోనే: "రూప్‌జీని చెట్టుకేసి కట్టేశారు. అతడి వీపు మీది చర్మం చిట్లిపోయి మాంసం బైటపడేదాకా కొరడాదెబ్బలు కొట్టారు. ఈ దెబ్బలకు తట్టుకోలేక అతడు జంతువు మాదిరిగా అరిచాడు. కాని అతడికి తోడ్పడేందుకు ఎవరూ సాహసం చేయలేదు. మరొక ఆదివాసీ కాలి బొటనవేళ్లకు తాళ్ళుకట్టి వాటి ఆధారంగా అతడిని చెట్టుకు తల్లక్రిందులుగా వేలాడదీశారు. అతడి కింద మంట పెట్టి అందులో మిరపకాయలు వేశారు. ఆ ఘాటైన పొగలు అతడిని ఊపిరాడ నివ్వకుండా చేస్తూంటే మరోపక్క అతడిని కొరడాలతో కొట్టడం ప్రారంభించారు. ఈ చిత్రహింసలకు ఆదివాసీ మహిళలు కూడా మినహాయింపు కాదు. తమ కొల్దారులుగా, రుణ బానిసలుగా ఉండే ఆదివాసీల ఇళ్ళలోని ఆడవాళ్ళని భూస్వాములు తమ స్వంత ఆస్తిగా భావించేవారు. ఆ మహిళలను ఎప్పుడు పడితే అప్పుడు అనుభవించే హక్కు తమకు వంశపారంపర్యంగా సంక్రమించిందని వారు బలంగా విశ్వసించారు. అయిదు రోజుల పురిటికందును చేత ఉంచుకున్న పచ్చి బాలింతను సైతం విడిచిపెట్టకుండా పదే పదే దెబ్బలు కొట్టిన సంఘటన కూడా జరిగింది."

గోదావరి పరులేకర్ ఇంకా ఇలా వివరించారు:

"నాగలికి కట్టివున్న రెండు ఎద్దుల్లో ఒకదానిని విప్పదీసి దాని స్థానంలో రిఖ్యర్ అనే ఆదివాసీని కట్టి రెండో వైపు ఎద్దుతో పొలాన్ని దున్నవలసిందిగా ఆజ్ఞాపించారు. అలిసిపోయిన రిఖ్యర్ ఆ నాగలిని ఏ మాత్రమూ కదల్చలేకపోయాడు. అందుకు శిక్షగా అతడిని భూస్వామి మేస్త్రీ ముఖుగ్రతో రక్తం బైటకు ఎగజిమ్మేదాకా బాదివాడు. ఒక ఫారెస్టు కాంట్రాక్టర్ బొగ్గుల కుంపట్లో ఒక ఆదివాసీని తోసి సజీవ దహనం చేసిన ఘటన గురించి ఆ చుట్టుపక్కల చెప్పుకుంటూ వుంటారు. ఇది భూస్వాముల క్రూరత్వానికి పరాకాష్ఠ. ఒక ఆదివాసీ కళ్ళెదుటే అతడి భార్యను భూస్వామి బలవంతాన లాక్కు పోతూంటే పెద్దగా కేకలు వేసి ఘర్షణ పడ్డారు. దానికి ప్రతీకారంగా ఆ భూస్వామి ఒక గొయ్యి తవ్వించి అందులో ఆ ఆదివాసీ దంపతు లిద్దరినీ సజీవంగా పాతిపెట్టాడు. ఆ గ్రామంలో అందరూ భయంతో మౌనంగా బిగుసుకు పోయారు. అయినా మొత్తానికి ఆ సంఘటన చుట్టుపక్కల ఊళ్ళకు పాకింది. పోలీసు విచారణ ఒక తంతు మాదిరిగా సాగింది. ఆ తర్వాత కేసు కూడా నడిచింది. ఒక డాక్టర్ ఆ గోతిలో బైటపడ్డ ఎముకలు జంతువులవని సాక్ష్యం చెప్పాడు. దాంతో ఆ భూస్వామిని నిర్దోషిగా ప్రకటించారు.

> ❝ ఈ విధానం రాజస్థాన్ వరకూ విస్తరించింది. అదే ఏడాది అక్టోబర్‌లో ఒక హిందూ ఆలయంలో కత్తిపోటు ఘటనలో నసీబ్ చౌదరి, అతని కుమారుడు పాల్గొన్నారన్న ఆరోపణలొచ్చాయి. అనంతరం అతని ఇల్లు ఆలయభూముల్లో కట్టారని చెబుతూ అధికారులు ఇంటిని కూల్చివేశారు. మరో ఘటనలో, ఉదయపూర్‌లో 15 ఏళ్ల ముస్లిం బాలుడు తనతో కలిసి చదువుకునే మరో హిందూ బాలుడిని పొడిచి చంపేశాడని కేసు నమోదైంది. ఆ వెంటనే అధికార యంత్రాంగం అతని కుటుంబం నివసించే ఇంటిని కూల్చి వేసింది. ❞



గోదావరి పరులేకర్

**భగభగమండిన తిరుగుబాటు**

ఇటువంటి ప్రపంచంలోకి ఎర్రజెండా 1945లో అడుగు పెట్టింది. ఐక్యత, పోరాటం, విముక్తి నినాదాలు ఇచ్చింది. టిట్వాలా లో మహారాష్ట్ర కిసాన్‌సభ జరిగిన అయిదు నెలలకే ఆదివాసీ ప్రాంతంలో గ్రామ గ్రామానికీ ప్రచారం పూర్తయింది. ఉంబర్‌గాంవ్ సమితి లోని జారీ అనే గ్రామంలో భారీ ఆదివాసీ మహాసభ జరిగింది. (ఇప్పుడది తలసారి

> ❝ 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన తుగ్లక్‌బాద కూల్చివేత నగర చరిత్రలోనే అతిపెద్ద క్లియరెన్స్ డ్రైవ్‌లలో ఒకటి. ఆ సమయంలో, అక్కడి నోటీసులు అందుకున్నవారు తమ ఇళ్లను మాత్రమే ఎందుకు కూల్చి వేస్తున్నారని ప్రశ్నించారు. ముస్లింల ఇళ్లను కూల్చాలని వాదనకు దిగారు. వారు తమపై చేపట్టిన కూల్చి వేతల చట్టబద్ధతను ప్రశ్నించడం, లేదా తమ హక్కుల గురించి పట్టుబట్టడం వంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ❞

సమితిలో ఉంది) కిసాన్ సభ ఆధ్వర్యంలో 1945 మే 23న ఈ మహాసభ జరిగింది. అయిదువేలమందికి పైగా ఆదివాసీలు ఈ మహాసభకు హాజరయారు. వారిలో అయిదు వందలకు పైగా మహిళలు. ఇక్కడే శామ్‌రావ్ పరులేకర్, గోదావరి పరులేకర్‌లు నాలుగు సరళమైన నినాదాలను రూపొందించి వాటి ప్రాతిపదికన రాజీ లేని పోరాటానికి పిలుపు నిచ్చారు. అవి:

(1) రోజు కూలి కింద 12 అణాలు నగదు రూపంలో చెల్లిస్తే తప్ప భూస్వామి స్వంత భూమిని సాగు చేయవద్దు.

(2) భూస్వామికి ఎటువంటి ఉచిత చాకిరీని చేయవద్దు.

(3) అతడు నీపై దాడి చేస్తే ప్రతిఘటించు.

(4) అందరూ ఐక్యంగా మెలగండి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో, వారి అధికార యంత్రాంగం దన్నుతో శతాబ్దం పైగా సాగిన భూదాస్యానికి, వెట్టి చాకిరీకి, రుణ బానిసత్వానికి , దారుణమైన కూలు రేట్లకు, అన్నింటికీ మించి అమాన వీయమైన రీతిలో భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, ఫారెస్టు కాంట్రాక్టర్లు సాగించిన అణచివేతకు, చిత్రహింసలకు వ్యతిరేకంగా వర్లీ ఆదివాసుల తిరుగుబాటుగా ప్రఖ్యాతి చెందిన పోరాటం ఆ విధంగా మొదలైంది.

జారీ మహాసభ ఇచ్చిన నినాదాలు అంబర్‌గావ్ సమితిలోని ఆదివాసీ ప్రజానీకాన్ని ఉత్తేజపరిచాయి. 24 గంటల్లోపే అడవిలోని అన్ని గ్రామాలకూ ఆ మహాసభ పిలుపు అందిపోయింది. వందశాతం ఐక్యత సాధించిన వర్లీ ఆదివాసీలు శతాబ్దం పైగా వారిని బంధించిన సంకెళ్ళనుండి విముక్తి పొందారు. కేవలం మూడు వారాలలోనే వెట్టి చాకిరీ శాశ్వతంగా రద్దయింది. ఆదివాసీలలో కొత్తగా వ్యక్తం అయిన ఈ ఐక్యతను బలాన్ని చూసి భూస్వాములు భయపడ్డారు. దాంతో వారిపై దాడులు, అత్యాచారాలు కూడా నిలిచిపోయాయి.

ఆ మరుసటి నెలలో, అంటే జూన్ 1945లో రుతుపవనాలు మొదలవుతున్న తరుణంలో అంబర్‌గావ్ ఆదివాసీలు భూదాస్యాన్ని కూడా రద్దు చేయడానికి నడుం కట్టారు. భూస్వాముల భూములను ఉచితంగా సాగు చేయడానికి నిరాకరించారు. కిసాన్‌సభ నిర్ణయించిన ప్రకారం కూలి రేట్లు చెల్లిస్తేనే పొలాల్లోకి అడుగు పెడతామన్నారు. ఇంతకు ముందు ఎన్నడూ చూడని ఈ ఐక్య ప్రభంజనాన్ని తట్టుకోలేక భూస్వాములు వారి డిమాండ్లకు తలొగ్గారు. 1945 సెప్టెంబర్, అక్టోబర్ మాసాలనాటికి ఆదివాసీల తిరుగుబాటు పక్కనుండే దహాను సమితికి కూడా విస్తరించింది. అక్కడ కూడా బ్రహ్మాండమైన రీతిలో ప్రజల తిరుగుబాటు చెలరేగింది. దాంతో వెట్టి చాకిరీ, భూదాస్యం రద్దయ్యాయి. దహాను సమితిలోని ఆదివాసీలు సమరశీలంగా మరో అడుగు ముందుకేశారు. వేలాదిగా కదిలి ప్రతీ గ్రామానికీ పోయి రుణ బానిసలుగా పడివున్నవారిని ఆ శతాబ్దాల దాస్యం నుండి విముక్తుల్ని చేసి విడిపించుకునివచ్చారు.

### వేతనాల పెంపు కోసం రెండవ దశ పోరాటం

ఆదివాసుల పోరాటంలోని మొదటి దశలో వారికి గొప్ప విజయం దక్కింది. ఐతే, అంతకన్నా కష్టతరమైన రెండవ దశ పోరాటం అక్టోబర్ **1945**లో మొదలైంది. 200 కిలోల గడ్డి కోయడానికి రు.2.50 కూలి చెల్లించాలన్న డిమాండ్‌తో వారు సమ్మెకు దిగారు. రెండు సమితుల్లోనూ సమ్మె సంపూర్ణంగా జరిగింది. ఐతే ఈ సారి భూస్వాములు వెనక్కి తగ్గదలుచుకోలేదు. బ్రిటిష్ పోలీసు యంత్రాంగం సహకారంతో వారు ఒక కుట్ర పన్నారు. తాలేవాడలో గోదావరి పరులేకర్ రాత్రి ఒక సభలో ప్రసంగించబోతున్నారని, అక్కడ ఆమె మీద భూస్వాములు దాడి చేయ డానికి కుట్ర పన్నారని, అందుచేత ప్రతీవారూ తమ తమ లాఠీలతో, కొడవళ్ళతో అక్కడికి చేరుకోవాలని ఎర్రజెండా పిలుపునిచ్చినట్టు ఒక తప్పుడు సమాచారాన్ని ఆదివాసీలలో వ్యాపింపజేశారు. ఆ సమాచారం ప్రతీ గూడేనికీ వెళ్ళింది. దాంతో అక్టోబర్ 10వ తేదీ రాత్రి దాదాపు 30 వేలమంది ఆదివాసీలు తాలేవాడకు చేరుకున్నారు. వారిలో కొందరు దాదాపు 50 కి.మీ. దూరం కాలినడకన ప్రయాణించి మరీ వచ్చారు. అదే సమయంలో పెద్ద సంఖ్యలో సాయుధులైన ఆదివాసీలు గుమిగూడుతున్నారని, వారు హింసకు తెగబడనున్నారని పోలీసులకు వర్తమానం అందింది.

దాంతో అక్కడికి పోలీసులు హుటాహుటిన చేరుకున్నారు. దాదాపు 15 గంటల వ్యవధిలో అక్టోబర్ 10, 11 తేదీలలో ఆ పోలీసులు ఆదివాసీలమీద మూడు సార్లు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో అయిదుగురు ఆదివాసీలు మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. ఆదివాసీల తిరుగుబాటులో మొదటి అమరవీరులు వారు. ఇక్కడ గొప్ప విశేషం ఏమంటే ఆ కాల్పులు జరిగి నప్పటికీ, ఆ **15** గంటల కాలం అంతా అక్కడినుంచి ఒక్క ఆదివాసీ కూడా కదలలేదు. ఎవరో ఒక ఎర్రజెండా నాయకుడు ఇవ్వబోయే ఆదేశాలకోసం వారంతా ఎదురు చూశారు. తమ ఎర్రజెండా నాశనం చేయడానికే పోలీసులు కాల్పులు జరుపుతున్నారని భావించి వారు కాల్పులు జరిగిన ప్రతీసారీ ఆ ఎర్రజెండాను కాపాడుకోవడానికే ప్రయత్నించారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ఒక స్థానిక కిసాన్ సభ కార్యకర్త అక్కడికి చేరుకుని ఇదంతా భూస్వాముల కుట్ర అని వారికి వివరించి వారినందరినీ శాంతియుతంగా వెనక్కి మరలమని కోరాడు. భూస్వాములు ఎటువంటి నీచమైన కుట్రలకు పాల్పడతారో గ్రహించి జాగ్రత్తలు వహించాలని వారికి విజ్ఞప్తి చేశాడు. దాంతో అక్కడికి చేరిన ఆదివాసీలందరూ వెనక్కి మళ్ళారు. తమ గుండెలనిండా తమ వర్గశత్రువుల పట్ల విపరీతమైన ద్వేషాన్ని, తీవ్రమైన ఆగ్రహాన్ని నింపుకుని వారు వెనక్కి మరలిపోయారు. తమ సమ్మెను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగించి తీరుతామని స్పష్టం చేశారు. చివరికి భూస్వాములు వారి డిమాండ్లకు తలొగ్గక తప్పలేదు. జనవరి 21, 1946న మహాలక్ష్మి

వద్ద భారీ స్థాయిలో ఆదివాసీలు విజయోత్సవ సభ జరుపుకున్నారు. ఆరోజు లెనిన్ వర్ధంతి.

శత్రువు మారాడు

అక్కడికి తొమ్మిది నెలల తర్వాత, అక్టోబర్ **1946** లో ఇంతకన్నా పెద్ద పోరాటం జరిగింది. ఇంతకన్నా ఎక్కువ నిర్బంధాన్ని చవి చూసింది. ఐతే ఈ మారు శత్రువు వేరు. గతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండేది. ఇప్పుడు మధ్యంతర ప్రభుత్వం వచ్చింది. బి.జి.ఖేర్ ముఖ్యమంత్రిగా, మొరార్జీ దేశాయి హోం మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వీళ్ళు కూడా ఆదివాసీల తిరుగుబాటును రక్తపుటేరుల్లో ముంచెత్తి అణచివేయడానికి ప్రయత్నించారు. ఆదివాసీ రైతులను అణచివేయడానికి సైన్యాన్ని సైతం పంపడానికి ఈ మధ్యంతర ప్రభుత్వం వెనుకాడలేదు. కాని రాష్ట్రంలో ఆదివాసీలకు అనుకూలంగా బ్రహ్మాండమైన రీతిలో ప్రజాభిప్రాయం ఐలపడి మధ్యంతర కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆదివాసీల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని, దారుణంగా దోపిడీకి గురౌతూ ఎటువంటి రక్షణా లేకుండా ఉన్న ఆదివాసీల మీద అటవికంగా రాష్ట్ర ప్రభుత్వం విరుచుకుపడడం సహించరానిదని రాష్ట్రం యావత్తూ ఎదురుతిరిగింది.

అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తన అసలైన వర్గ స్వభావాన్ని బైట పెట్టుకుంది. 1946 డిసెంబర్ 13న విడుదల చేసిన పత్రికా ప్రకటనలో "భారతదేశంలో కమ్యూనిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేయాలనే కుట్రకు పూనుకున్న కొందరు వ్యక్తులు హింసను రెచ్చగొట్టే విధంగా చేపట్టిన కార్యకలాపాలకు పరాకాష్ఠగా ఆదివాసీల తిరుగుబాటు జరిగింది" అని పేర్కొన్నారు.

భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రదర్శించడం సహజమైన పరిణామం. ఇంకా దేశానికి స్వాతంత్ర్యం రాకముందే కాంగ్రెస్ తన అసలు రంగును బైట పెట్టుకుంది. తాను త్వరలో దేశాన్ని ఏలనున్న దోపిడీ వర్గాల రాజకీయ ప్రతినిధినని ప్రకటించుకుంది. ఆ తర్వాత బిజెపి అదే బాటలో నడుస్తోంది. అదే వర్గాల సేవలో నడుస్తోంది.

ఆదివాసీల తెగువ, ధైర్య సాహసాలు

సైన్యాన్ని ప్రభుత్వం ఉపసంహరించక తప్పలేదు. కాని 1946-47 మధ్య కాలంలో పోలీసులు, భూస్వాములు సాగించిన అణచివేత తారాస్థాయికి చేరుకుంది. ఈ మారణ దశ

❝ చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార వర్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు. ❞



వర్లీ ఆదివాసీలతో గోదావరి పరులేకర్

తిరుగుబాటులో వేలాదిగా ఆదివాసీలు గాయపడ్డారు. వందలాదిమంది చిత్రహింసల పాలయ్యారు. వారి మహిళలు మానభంగాలను చవిచూశారు. పలు చోట్ల సాగిన పోలీసుకాల్పుల్లో అనేకులు అమరులయ్యారు. కానీ, ఇంతవరకూ ఈ పోరాటంలో చాలా నిగ్రహాన్ని పాటిస్తూ వచ్చిన ఆదివాసీలు ఇక ఊరుకోలేదు. ఆత్మరక్షణలో భాగంగా వారు ఎదురు దాడికి తలపడ్డారు. భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు చెందిన విశాల భవంతులను వారు తగులబెట్టారు. తమను అవమానాల పాలు చేసిన ఇళ్ళు అవి. అక్కడే వాళ్ళు చిత్రహింసలకు గురిచేయబడ్డారు. అక్కడే వారి మహిళల మానాలు దోచుకోబడ్డాయి. ఇదంతా శతాబ్దం పైగా కొనసాగిన దుర్మార్గం. ఆ దుర్మార్గం ఆదివాసీల గుండెల్లో ఆర్పలేని మంటలు రగిల్చింది. దాంతో ఆ ఇళ్ళను వారు తగులబెట్టి నేలమట్టం చేసేశారు.

దానితోపాటు నానాటికీ పెరుగుతున్న రాజ్య నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి వేలాదిగా ఆదివాసీ యువకులు మిలిటెంట్ దళాలుగా ఏర్పడ్డారు. గ్రామ గ్రామానికీ పోయి ప్రజలకు ధైర్యం నూరిపోసి ఈ నిర్బంధాన్ని ఎలా తట్టుకు నిలవాలో వారికి తెలియజెప్పారు. ఆదివాసీ ప్రాంతం యావత్తూ ఒక కొత్త వర్గ చైతన్యంతో నిండిపోయింది. ఈ పోరాటంలో వారిని ఆ విధంగా గట్టిపరచడానికి, ఉక్కు సంకల్పంతో వారు ముందుకు సాగడానికి కావలసిన చైతన్యాన్ని కలిగించినవి కిసాన్ సభ, కమ్యూనిస్టు పార్టీలు. ప్రభుత్వం, భూస్వాములు దారుణంగా దెబ్బ తిన్నారు. 1947 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి ఆదివాసీలతో రాజీ పడానికి సిద్ధపడినట్టు ప్రకటించాడు. తమ ప్రకటనలో చిత్తశుద్ధి ఉందని నిరూపించుకోడానికి అన్ని అణచివేత చర్యలనూ ఉపసంహరించాడు. కనీస వేతనంతో సహా ఉద్యమం డిమాండ్లను అన్నింటినీ అంగీకరించారు. దాని కొనసాగింపుగానే

> ❝ అల్లావుద్దీన్ ఖిల్జీకి నమ్మకస్తులైన ఇద్దరు సేనానుల నాయకత్వంలో గుజరాత్ మీద దండయాత్రకు 1299 లో ఢిల్లీ సేనలు బయలుదేరాయి. మార్గమధ్యంలో జైసల్మేర్‌ను ముట్టడించాయి. ఎటువంటి ప్రతిఘటనా ఇవ్వకుండానే ఆ రాజు పలాయనం చిత్తగించాడు. ఆ తర్వాత గుజరాత్‌లోని ముఖ్య పట్టణాలను ఢిల్లీ సేనలు కొల్లగొట్టాయి. ❞

ఆ తర్వాత కాలంలో ఆదివాసీలకు భూహక్కులను దఖలుపరుస్తూ పలు చట్టాలు వచ్చాయి. ఆదివాసీల పోరాటాలు కూడా కొనసాగాయి.

1946 నవంబర్ 21 నుండి 1953 జనవరి 14 వరకూ థానే జిల్లాలోకి శామ్‌రావ్, గోదావరి పరులేకర్‌లను బహిరంగంగా అడుగుపెట్టనివ్వకుండా ప్రభుత్వం నిషేధించింది. 1946-48 మధ్య కాలంలో వారిద్దరూ బహిష్కరించబడ్డారు. 1948-51 మధ్య కాలంలో వారు అజ్ఞాతవాసంలోకి వెళ్ళారు. 1951-53 మధ్య కాలంలో వారిద్దరినీ నిర్బంధించారు. అయినప్పటికీ వారిద్దరూ 1945-46 మధ్య కాలంలో ఆదివాసీల పోరాటానికి అందించిన దృఢమైన నాయకత్వం, దిశానిర్దేశం చాలా బలమైన పునాదిని వేశాయి. కమ్యూనిస్టు పార్టీ, కిసాన్ సభల నిర్మాణానికి బలమైన పునాది పడింది. తమ ప్రియతమ నాయకులిద్దరూ తమ మధ్య భౌతికంగా లేకపోయినా ఆదివాసీలు వారి బోధనలకు అనుగుణంగానే వ్యవహరించారు.

తాము థానే జిల్లాకు తిరిగి వచ్చిన సందర్భాన్ని హృద్యంగా వర్ణిస్తూ గోదావరి పరులేకర్ ఇలా రాశారు:

1953 ఫిబ్రవరిలో మాత్రమే మేము థానే జిల్లాకు తిరిగి రాగలిగాం. మహాలక్ష్మిలో వేలాదిగా ఆదివాసీలు చేరి మాకు స్వాగతం పలికారు. వారి ప్రేమ, విశ్వాసం, ఉత్సాహం మమ్మల్ని ఎంతగానో కదిలించాయి. అంతటి అభిమానానికి మేం నిజంగా పాత్రులమేనా అని నాకనిపించింది. తాను ఉద్విగ్నతకు లోనైనప్పుడు మౌనంగా ఉండిపోవడం శామ్‌రావ్ పరులేకర్‌కు అలవాటు. ఇప్పుడు కూడా అదేవిధంగా ఉండిపోయాడు. ఆ తర్వాత ఇలా నాతో అన్నాడు: "అంకిత భావం, ప్రేమ, జీవత్వం తొణికిసలాడుతున్న ఈ జన సందోహం మధ్య మనలాంటివాళ్ళం ఎంత అల్పులమో కదా. వాళ్ళ స్వంత బలమే వారివిముక్తికి దోహదం చేసింది. మనం కేవలం వాళ్ళకి ఉత్ప్రేరకాలుగా మాత్రమే పని చేశాం." ఇటువంటి స్వమతే ఆ గొప్ప నేతల విశిష్టతకు గీటురాయి.

విజయాలు, వారసత్వం

మహత్తర ఆదివాసీ తిరుగుబాటు సాధించిన అనేక విజయాలను, దాని వారసత్వాన్ని ఆ పోరాట నేతల సమీక్ష నుండే తెలుసుకుందాం. శామ్‌రావ్ పరులేకర్ ఇలా రాశారు:

"చాలా కొద్ది కాలంలోనే ఈ పోరాటం గుర్తు పెట్టుకోదగ్గ విజయాలను సాధించింది. భూదాస్యం కూకటివేళ్ళతో సహా పెకలించివేయబడింది. వెట్టి చాకిరీ రద్దైంది. రుణ బానిసలు విముక్తి చెందారు. వారి స్త్రీలు రక్షించబడ్డారు. దాడులు, చిత్రహింసలు ఆగిపోయాయి. వర్లీల సహజాతమైన చైతన్యానికి ఈ పోరాటం పదును పెట్టి వారి అవగాహనను పెంపొందించింది. వారి మధ్య నుండే ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించగలిగిన నాయకులు పుట్టుకొచ్చారు. వారు సాగించిన తీవ్ర పోరాటమే వర్లీలలో వేగంగా పరివర్తన తెచ్చింది. ఆ పరివర్తన ఎంత తీవ్రమైనదంటే వారంతా కొత్త అస్తిత్వాన్ని పొందారు. శైశవ దశనుండి పరిపక్వ దశలోకి అడుగుపెట్టారు.

గోదావరి పరులేకర్ ఈ విధంగా రాశారు:

"ఈ పోరాటంలో ఆదివాసీలు అత్యున్నత స్థాయి ధైర్య సాహసాలను ప్రదర్శిస్తే, మరోవైపు ప్రభుత్వం, భూస్వాములు, వర్తక వ్యాపారులు సాగించిన అణచివేతలతో అత్యంత హీనమైన స్థాయికి దిగజారిపోయారు. అంతులేని అధికారం, డబ్బు, సాయుధ బలగాలు, గూండాలు వెంటరాగా, రణక్షేత్రంలోకి అడుగుపెట్టిన వాళ్ళు అర్ధనగ్నంగా, కాలిన కడుపులతో, కేవలం తమ తిరుగులేని ఐక్యత, అచంచల దీక్ష, ఎంతటి త్యాగానికైనా వెనుదీయని సంసిద్ధత మాత్రమే తోడుగా ఉన్న ఆదివాసీ పేదలముందు మట్టి కరిచారు. ఆ రణ భూమి నుండి కొత్త చైతన్యంతో తలెత్తిన రైతులు ముందుకు నడిచారు."

ఆ తర్వాత ఆమె ఇలా రాశారు:

"మహారాష్ట్రలో రైతాంగం సాధించిన కొద్దిపాటి రాయితీల ఘనత ప్రధానంగా వర్లీలకు, వారి పోరాటానికి చెందుతుంది. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం, కౌల్దార్ చట్టం, కౌలుదారులకు కౌలు రేటు తగ్గింపు వంటి రాయితీలన్నీ మహారాష్ట్రలోని తక్కిన రైతాంగానికి కూడా దక్కాయి. ఐతే, వారు సంఘటితంగా లేనందున ఆ రాయితీలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. ఆదివాసీలు తమ సంస్థను సమరశీలంగా నిర్మించుకుని, పెంపొందించిన ఐక్యత ప్రాతిపదికగా మరో ముందడుగు వేసినప్పుడే వారు తమ లోకానికి మరింత చేరువ అవుతున్నామన్న ఆనందాన్ని పొందగలుగుతారు."

చివరిగా ఆమె ఇలా రాశారు:

"ఒక మనిషిగా తన ఆత్మ గౌరవాన్ని, స్వీయ చైతన్యాన్ని పొందగలడమే వర్లీ ఆదివాసిలో వచ్చిన ప్రధానమైన మార్పు. ఒక సంస్థలో సభ్యుడిగా తనకున్న శక్తి సామర్థ్యాల గురించిన అతడి చైతన్యం నుండే అతడి ఆత్మవిశ్వాసం పెంపొందింది. తాను అల్పుడి నన్న భావనను, భయాన్ని అతడు వదిలించు కోగలిగాడు. అతడిప్పుడు అశావహుడు. ప్రపంచ రాజకీయాలన్నింటినీ అతడు తెలుసుకోగోరుతున్నాడు. అన్యాయాన్ని ఎదిరించి దృఢంగా నిలిచిన ఈ ఆదివాసి అక్కడే ఆగిపోడు. అతడు ముందుకు పురోగమిస్తాడు. జరగబోయే పోరాటాలకు అతడు పూర్తి సిద్ధంగా ఉన్నాడు. ఈ సన్నద్ధతే, ఈ పరిపక్వతే మన ఉద్యమం మనకు, అతడికి తెచ్చిపెట్టిన నిజమైన విజయం."

(భూ స్వాముల దాస్య శృంఖలాల నుండి ఆదివాసీలను విముక్తి చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన గోదావరి పరులేకర్ అక్టోబర్ నెలలోనే శాశ్వతంగా కన్నుమూయడం విశేషం. ఆమె 1996 అక్టోబర్ 8వ తేదీన మరణించారు.)

(అనువాదం : ఎం.వి.ఎస్.శర్మ)

## అక్టోబర్ 21, 1934

# కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ- భారత కమ్యూనిస్టు పార్టీ

ఇఎంఎస్ నంబూద్రిపాద్



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యవస్థాపక నేతల్లో ఒకరు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించిన వారిలో ఇఎంఎస్ ఒకరు. 1997 అక్టోబర్ 12న ఈ వ్యాసాన్ని రాశారు.

(కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) 1934 అక్టోబర్ 21వ తేదీన బొంబాయిలో ఏర్పాటయింది. ఈ పార్టీ వ్యవస్థాపకుల్లో కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒకరు. తరువాతి కాలంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) కేరళ విభాగం గుండుగుత్తగా భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయింది..... సంపాదకుడు)

కాంగ్రెస్ పార్టీలో సోషలిస్టు భావాలు కలిగిన వారి ప్రాథమిక సమావేశం 1934 మే నెలలో పాట్నాలో జరిగింది. 1931-33 సహాయ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించుకున్న తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రధాన భాగం అనుసరిస్తున్న గాంధేయ, పార్లమెంటరీ కార్యక్రమాల పట్ల తీవ్రంగా నిరాశ చెందుతున్న కాంగ్రెస్ వారితో ఒక కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఈ సమావేశం జరిగింది. చర్చలు జరిగిన తరువాత ఒక ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. మౌలిక పత్రాలు తయారు చేయాలనీ, పార్టీ ఏర్పాటు కోసం ఒక మహాసభను నిర్వహించాలనీ ఈ కమిటీని నిర్దేశించారు.

పాట్నాలో జరిగిన సమావేశంలో జయ ప్రకాష్ నారాయణ్ కార్యదర్శిగా సన్నాహక కమిటీ ఏర్పడింది. ఆయన అనేక రాష్ట్రాలు పర్యటించారు. అటువంటి పార్టీ ఏర్పాటు పట్ల ఆసక్తిగల వారితో సంప్రదింపులు జరిపారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా పాట్నా సమావేశంలో ఏర్పాటైన ఆర్గనైజింగ్ కమిటీ మౌలిక పత్రాలను తయారు చేసింది. ఈ పత్రాలను 1934 అక్టోబర్‌లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక మహాసభలో ప్రవేశపెట్టారు.

1934లోనే ఇటువంటి కొత్త సంస్థను ఎందుకు స్థాపించాల్సి వచ్చింది? దానికి క్రింది కారణాలున్నాయి.

1. స్వాతంత్ర్యం సాధించడానికి గాంధీ నాయకత్వం ప్రత్యక్ష కార్యాచరణ కార్యక్రమాన్ని వదిలిపెట్టడం. పార్లమెంటరీ కార్యక్రమాన్ని చేపట్టిన కాంగ్రెస్ వాదుల నాయకత్వం పట్ల భ్రమలు కోల్పోయిన విస్తారమైన కాంగ్రెస్ అనుయాయులు వామపక్ష ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కోరుకోవడం.

2. పదిహేను సంవత్సరాలపాటు కమ్యూనిస్టులు సోషలిజం, కమ్యూనిజం కార్యక్రమం కోసం జరిపిన కృషి ప్రభావం వామపక్షం వైపు మొగ్గు చూపాలని కోరుకున్న కాంగ్రెస్ వాదులపై పడింది. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీ లోపలా, బయటా.... ప్రజలపై పీడన, పేదరికం, ఆకలి, నిరుద్యోగం మొదలైన వాటిని తొలగించడం ద్వారా ప్రజలకు సేవచేయాలన్న స్పష్టమైన సైద్ధాంతిక, ఆచరణాత్మక కార్యక్రమం కావాలనుకున్న వారందరినీ ఏకం చేసేందుకు క్షేత్రాన్ని సన్నద్ధం చేయడం జరిగింది.

3. సోషలిస్టు భావాలు కలిగిన ఈ కాంగ్రెస్ వాదులు కాంగ్రెస్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అటు గాంధేయవాద నాయకత్వాన్ని, పార్లమెంటరీ కార్యక్రమవాదుల నాయకత్వాన్ని కూడా వ్యతిరేకించారు. అదేవిధంగా భారత ప్రజలను కులం, మతాల వారీగా విభజించడానికి ప్రయత్నించిన కులతత్వ, మతతత్వ వాదులను కూడా వారు వ్యతిరేకించారు.

### కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ విభేదించిన అంశాలు

కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సిద్ధాంతం, కార్యక్రమాలకు వనరు ఒకటే. అది 1920 నుండి పని చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం, కార్యక్రమమే. అంతే వాళ్లు అనేక అంశాల్లో కమ్యూనిస్టులతో విభేదించేవారు.

మొదటిది, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విప్లవానికి వ్యవసాయ విప్లవం ఇరుసుగా ఉంటుందని కమ్యూనిస్టులకు స్పష్టమైన అవగాహన ఉంది. ఇది జరగాలంటే కమ్యూనిస్టులు, జాతీయోద్యమంలో ఎంత చిన్న గ్రూపుగా ఉన్నప్పటికీ వారు స్వాతంత్ర్యోద్యమంలో స్వతంత్ర భాగంగా సమీకృతులవ్వాలి. బూర్జువా వర్గ నాయకత్వంలోని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో వాళ్లు విలీనం కాకూడదు. పారిశ్రామిక కార్మికులనూ, వ్యవసాయ కార్మికులనూ, పనిచేసే రైతులు ఇంకా శ్రామిక వర్గంలోని ఇతరులను ఒక స్వతంత్ర సామాజిక ఆర్థిక శక్తిగా సమీకృతులను చేయడమే కమ్యూనిస్టుల ప్రధాన పని. అదే సమయంలో ఈ శక్తి సామ్రాజ్యవాద-వ్యతిరేక, ఫ్యూడల్- వ్యతిరేక బూర్జువర్గాలతో సంఘటన కట్టాలి. కాంగ్రెస్ సోషలిస్టులుగా సమీకృతులైన వారిలో ఇటువంటి స్పష్టమైన వర్గ దృక్పథం లేదు. అందువల్ల సహజంగానే కమ్యూనిస్టుల మౌలిక రాజకీయ దృక్పథానికీ, కాంగ్రెస్ సోషలిస్టుల దృక్పథానికీ

> "ప్రభుత్వాలు, ప్రభుత్వభూములకు, ప్రజల తరఫున ట్రస్టీలు మాత్రమే కానీ, ప్రజల విశ్వాసాన్ని ఉల్లంఘించి, ఏకపక్షంగా ఆ భూములను ఇష్టానుసారం ప్రైవేట్ కంపెనీలకు తక్కువ ధరలకు పంచిపెట్టడం, సుప్రీమ్ కోర్టు ధ్రువపరిచిన ప్రజా విశ్వాస సిద్ధాంతాన్ని (Doctrine of Public Trust) ను ఉల్లంఘించినట్లు అవుతుంది కదా?"

మధ్య విభేదాలున్నాయి. అందు వల్లనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపించిన మాలో చాలా మందిమి ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీలో చేరలేదు. మా దృష్టిలో దేశంలో అతి పెద్ద సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తి కాంగ్రెస్ కాబట్టి, మేము మొదట కాంగ్రెస్‌కు విధేయులుగా ఉండాలి. కానీ అదే సమయంలో కార్మికవర్గ నాయకత్వంలోని శ్రామిక ప్రజల ప్రాధాన్యతను గురించి తెలుసుకున్నాం కాబట్టి మేము సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులతో సన్నిహితంగా కలిసి పని చేయాలనుకున్నాం. కమ్యూనిస్టులు మొట్ట మొదటిగా, అన్నిటికీ మించి స్వతంత్ర కార్మికవర్గానికి విధేయులుగా ఉంటారు.

దీనికి ఒక ఉదాహరణ తీసుకుంటే, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తొలి (బొంబాయి) మహాసభలో ఆమోదించిన మౌలిక పత్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చెందిన ప్రతి సభ్యుడూ కాంగ్రెస్ పార్టీ సభ్యుడై ఉండాలి అని నిర్దేశించడం జరిగింది. అనేక మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో కూడా పని చేసినప్పటికీ కమ్యూనిస్టులు మాత్రం అటువంటి నిబంధనేదీ పెట్టుకోలేదు. అంతే, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడే నాటికి కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీలో చేరి దానిలో పని చేయాలని నిర్ణయించుకున్నారు. దాంతో గతంలో కాంగ్రెస్ సోషలిస్టులకూ, కమ్యూనిస్టులకూ మధ్య ఉన్న తేడా సమసిపోయింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యుల మాదిరిగానే కమ్యూనిస్టులు తమ స్వంత పార్టీ కృషిని స్వతంత్రంగా కొనసాగిస్తూనే కాంగ్రెస్ పార్టీ లోపల పని చేయసాగారు.

అంతే, పక్షాళింపులో ఒక తేడా ఉండేది. కమ్యూనిస్టులకు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రాడికల్ సామ్రాజ్యవాద-వ్యతిరేక ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడం మౌలిక కర్తవ్యంగా ఉండేది. మరోవైపు కాంగ్రెస్ సోషలిస్టులకు కాంగ్రెస్ లోపల ఉండి పనిచేయడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం కాంగ్రెస్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంగా మలచడమే.

### మీరట్ థీసిస్ దాని తరువాత

1936 జనవరిలో మీరట్‌లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ రెండవ మహాసభలో ఈ విభేదాలను పరిష్కరించుకోవడం జరిగింది. ఆ మహాసభ "మీరట్ థీసిస్" పేరుతో కొత్త పత్రాన్ని ఆమోదించింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యతకు మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదికగా ఉండాలని ఆ థీసిస్ పేర్కొంది. దాని తరువాత ఈ రెండు పార్టీల ప్రధాన కార్యదర్శులైన జయప్రకాశ్ నారాయణ్ (కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ), పిసి జోషి (భారత కమ్యూనిస్టు పార్టీ) ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దాంతో రెండు పార్టీలు స్వతంత్రంగా ఉంటూ, స్వతంత్రంగా పనిచేస్తున్నప్పటికీ అవి ఐక్యంగా కలిసి పనిచేయడం ప్రారంభించాయి.

రెండు పార్టీల మధ్య కుదిరిన ఈ ఒప్పందం వల్ల అనాడు చీలిపోయి ఉన్న అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘాలు విలీనం కావడానికి తోడ్పడింది. కాంగ్రెస్ పార్టీ లోపలనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ, సుభాష్ చంద్రబోస్ అనుయాయులు, ఇంకా పెద్ద సంఖ్యలోని ఇతర వామపక్ష వాదులంతా కలిసి మితవాద కాంగ్రెస్ నాయకుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పనిచేశారు. ఈ మితవాద నాయకత్వంలో గాంధేయ వాదులు, 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం మంత్రి పదవులు చేపట్టిన వారితో సహా పార్లమెంటరీ కార్యక్రమాలను చేపట్టిన వారంతా ఉండేవారు. 1936-39 మధ్య మూడేళ్ల కాలం, మొత్తంగా వామపక్ష ఉద్యమానికీ, నిర్దిష్టంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీకి విజయోత్సవ కాలంగా ఉండింది.

### కమ్యూనిస్టు వ్యతిరేక వేట

అంతే, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకత్వం కమ్యూనిస్టుల విషయంలో రెండుగా చీలిపోయింది. ఒకవైపు కమ్యూనిస్టు వ్యతిరేకులైన ఎంఆర్ మసానీ, అశోక్ మెహతా, డాక్టర్ లోహియా వంటి వారు నిలబడ్డారు. మరోవైపున జయప్రకాశ్ నారాయణ్ వంటివారు కమ్యూనిస్టులతో సహకార సంబంధాలు కొనసాగించాలని కోరుకునేవారు. మసానీ-మెహతా గ్రూపు మాలో చాలా మందిని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో "కమ్యూనిస్టు ఫ్రాక్షన్" అని దూషిస్తూ వేటాడేవారు. చివరికి 1939-40 వచ్చేసరికి 'పరాయి' కమ్యూనిస్టులను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి బహిష్కరించారు. దీంతో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మొదటి (బొంబాయి) మహాసభలోనే పార్టీ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన నన్ను 1940లో పార్టీ నుండి బహిష్కరించారు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచ పరిస్థితులపై అంచనాల విషయంలో రెండు పార్టీల మధ్య సైద్ధాంతిక విభేదాలు పెరిగాయి. కమ్యూనిస్టులమైన మేము కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్దేశించిన పంథాలో మా వైఖరిని తీసుకున్నాం. ప్రపంచ యవనికపై ఫాశిస్టు వ్యతిరేక పోరాటం కేంద్ర స్థానం ఆక్రమిస్తుందనీ, ఈ పంథాలోనే భారత దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ స్వాతంత్ర్యోద్యమాలను అభివృద్ధి చేయాలనేది ఈ పంథా. ఇంకో మాటలో చెప్పాలంటే భారత జాతీయవాదం, కార్మికవర్గ అంతర్జాతీయతతో పూర్తిగా సమైక్యం కావాలి.

హిట్లర్ జర్మనీ, సోవియట్ యూనియన్‌పై దాడి చేయడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. సోవియట్ యూనియన్, చైనా జాతీయోద్యమ నాయకత్వం చురుకుగా పాల్గొంటున్న ఫాసిస్టు-వ్యతిరేక పోరాటం భారత జాతీయ వాదానికి అత్యుత్తమ మిత్రపక్షమనీ, కొన్ని వారాల ఊగిసలాటలు, తటపటాయింపుల తరువాత కమ్యూనిస్టు పార్టీ నిర్ధారణకు వచ్చింది.

### కొన్ని తప్పిదాలు

అంతే కాంగ్రెస్ సోషలిస్టుల వాదన మరోలా ఉంది. ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో మన జాతీయ శత్రువైన గ్రేట్ బ్రిటన్, సోవియట్ యూనియన్‌తో భాగస్వామిగా

> ❝ ప్రభుత్వాలు, ప్రభుత్వభూములకు, ప్రజల తరఫున ట్రస్టీలు మాత్రమే కానీ, ప్రజల విశ్వాసాన్ని ఉల్లంఘించి, ఏకపక్షంగా ఆ భూములను ఇష్టానుసారం ప్రైవేట్ కంపెనీలకు తక్కువ ధరలకు పంచిపెట్టడం, సుప్రీమ్ కోర్టు ధ్రువపరిచిన ప్రజా విశ్వాస సిద్ధాంతాన్ని (Doctrine of Public Trust) ను ఉల్లంఘించినట్లు అవుతుంది కదా? ❞

ఉన్నంత మాత్రాన ఈ పోరాటంలో మనం పాల్గొనలేమన్నది వారి వాదన. అందువల్ల వారు, మహాత్మాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమంలో సంపూర్ణంగా పాల్గొన్నారు. మానవాళికి అత్యంత భయంకర శత్రువుతో పోరాడుతున్న ఫాసిస్టు-వ్యతిరేక ప్రపంచ దేశాల కూటమిలో బ్రిటన్ ఉంది కాబట్టి ఈ ఫాసిస్టు-వ్యతిరేక కూటమిని విచ్ఛిన్నం చేయడం వినాశకరమని మనం భావించాం.

మనం ఇలా సరైన నిర్ణయమే తీసుకున్నప్పటికీ, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ప్రతిఒక్కరినీ "ఫాసిస్టు ఏజెంట్ల"గా ముద్ర వేసి తప్పు చేశాం. అందువల్ల మనం తాత్కాలికంగా భారత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం నుండి వేరుపడ్డాం.

కాంగ్రెస్ సోషలిస్టులు మనపై దాడి చేసిన మరో అంశం, భారత దేశంలో జాతుల సమస్య పట్ల మన వైఖరి. మనం ఒకవైపు ముస్లిం లీగ్ ముందుకు తీసుకువచ్చిన "ద్విజాతి" సిద్ధాంతాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూనే మరోవైపు భారత దేశం ఒక యూనిటరీ దేశం అనే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని కూడా వ్యతిరేకించాం. నిజానికి మనం, భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి భాషా-సాంస్కృతిక గ్రూపు హక్కును పరిరక్షించడం ద్వారా మాత్రమే భారత దేశ ఐక్యతను పరిరక్షించి, పెంపొందించ గలమని వాదించాం.

ఎంతో సరైన ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే క్రమంలో మనం చేసిన తప్పిదం, భారత దేశాన్ని మతపరంగా విభజించే వారి సరసన ప్రజలు మనల్ని చూసేట్లు చేసింది. క్విట్ ఇండియా ఉద్యమం పట్ల మన వైఖరి, దాంతోపాటు యూనిటరీ భారత దేశం అనే కాంగ్రెస్ వైఖరితో మనం విడదీసుకోవడం... ఈ రెండూ కలిపి మనల్ని ప్రజలు పాకిస్తాన్ వేర్పాటు కోరుతున్న ముస్లిం లీగ్ డిమాండ్‌కు మద్దతుదారులం అనే అపోహను సృష్టించాయి. మనం ఆత్మవిమర్శనా పూర్వకంగా సమీక్షించు కుంటే, ఆ కాలంలో మనం తయారు చేసిన ప్రచారాందోళన సామగ్రి ఇటువంటి అపోహలకు తావిచ్చింది. అయితే, ఈ రెండు పంథాలు (అంటే కాంగ్రెస్ క్విట్ ఇండియా, ముస్లిం లీగ్ ద్విజాతి సిద్ధాంతాలు)తో కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు రెండూ లక్షలాది మంది ప్రజలను కదిలించే సమయంలో కూడా భారత కమ్యూనిస్టు పార్టీ ఈ రెండు పంథాలను వ్యతిరేకిస్తూ కూడా తన సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ అస్తిత్వాన్ని నిలుపుకోగలిగింది. అందువల్ల ఈ కాలం మనకు చాలా ప్రమాదకరమైన కాలం. అయినప్పటికీ మనం కాంగ్రెస్, ముస్లిం లీగ్ పంథాలకు వ్యతిరేకంగా మన స్వంత కాళ్లమీద నిలబడగలిగాం.


జయప్రకాశ్ నారాయణ్

## రెండవ ప్రపంచ యుద్ధం తరువాత

అయితే రెండో ప్రపంచ యుద్ధం తరువాత భారత రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. ఇది ఒక మిలిటెంట్ సామ్రాజ్యవాద వ్యతిరేక శకం. ఈ కాలంలో పార్టీ అనేక పోరాటాల్లో పాల్గొన్నది, నిర్మించి నడిపించింది. పారిశ్రామిక కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగుల మహోత్తర సమ్మెపోరాటంతో ప్రారంభమై, బెంగాల్‌లో తెభాగ పోరాటం, ట్రావన్‌కోర్‌లో పున్నప్ర-వాయలార్, హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణా ఉద్యమం మొదలైన అనేక పోరాటాలు జరిగాయి. వీటన్నిటికీ తలమానికం, భారత నౌకాదళ సైన్యపు పోరాటానికి మద్దతుగా బొంబాయి కార్మికవర్గం మిలిటెంట్ సౌహార్ద్ర కార్యాచరణకు దిగడం. ఈ పోరాటాలన్నిటి వల్ల బ్రిటిష్ పాలకులు, భారత దేశంలో తమ రోజులు ముగిసాయని, ఇక తాము తట్టాబుట్టా కట్టుకుని దేశం విడిచి వెళ్లిపోక తప్పదని గ్రహించారు. అయితే, ముస్లిం లీగ్ పిలుపునిచ్చిన "విభజించు, వెళ్లిపో" అనే నినాదానికి దేశంలోని ఒక ప్రాంతంలో ప్రజా మద్దతు లభించడంతో బ్రిటిష్ పాలకులు దాన్ని ఉపయోగించుకుని దేశాన్ని రెండుగా -భారత్, పాకిస్తాన్‌లుగా- విభజించి, రెండు దేశాలూ నిరంతరం శత్రువులుగా కొట్టుకునేట్లు చేసి వెళ్లిపోయారు. ఆ విధంగా అధికారం భారత యూనియన్‌లో కాంగ్రెస్ నాయకత్వానికీ, పాకిస్తాన్‌లో ముస్లిం లీగ్ నాయకత్వానికీ బదిలీ చేయబడింది.

భారత దేశం ఈ విధంగా చీలిపోవడంతో దేశ రాజకీయ చరిత్రలో కొత్త శకం ప్రారంభమైంది. కాంగ్రెస్‌కు అధికారం బదిలీ కావడంతోనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు తమ పార్టీ పేరు నుండి "కాంగ్రెస్" అన్న పదాన్ని తొలగించారు. దాని పేరును "సోషలిస్టు పార్టీ" అని మార్చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు ఈ పార్టీ కూడా 1952 ఎన్నికల్లో పోటీ చేసింది. ఎన్నికల అనంతరం తాము దేశంలో అధికారంలోకి వస్తామని సోషలిస్టు పార్టీ ఆశపడింది. కానీ ఎన్నికల ఫలితాలు వారికి నిరాశ మిగిల్చాయి. పార్లమెంటులో వారు పెద్ద పార్టీగా రాలేకపోయారు సరికదా వారు తమ బద్ధ శత్రువుగా భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటులోనూ, నాలుగు రాష్ట్రాల్లోనూ ప్రధాన శక్తిగా ఆవిర్భవించింది.

అప్పటి నుండి ఈ మాజీ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, లేక పేరు మార్చుకున్న సోషలిస్టు పార్టీ చీలికలు పేలికలై భారత దేశ రాజకీయాల్లో ఒక శక్తిగా లేకుండా పోయింది. 1977లో అప్పటి సోషలిస్టు పార్టీ జనతా పార్టీలో విలీనం అవడంతో అది పూర్తిగా అంతమైపోయింది.

## అక్టోబర్ 21, 1943

# ఆజాద్ హింద్ ఫౌజ్ సాహసగాథ

కెప్టెన్ లక్ష్మీసెహెగల్



రివంయిత భారత స్వాతంత్ర్య పోరాట యోధురాలు. సుభాష్ చంద్ర బోస్ నాయకత్వంలో ఏర్పడిన భారత జాతీయ సైన్యం (ఐఎన్ఏ)లో కెప్టెన్‌గా పనిచేశారు. తరువాతి కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో చేరి చురుకుగా పనిచేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వ్యవస్థాపక సభ్యురాలు

ఆజాద్ హింద్ ఫౌజ్ సుప్రీం కమాండర్ అయిన సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన "ఛలో ఢిల్లీ" పోరాట పిలుపు నందుకొని 2,500 మంది యుద్ధఖైదీలు, ఆగ్నేయాసియాలో నివసిస్తున్న మరో 20,000 మంది భారతీయులు సమీకృతులయ్యారు. "జై హింద్" అనేది వారి పోరాట నినాదమైంది. రాణీ ఝాన్సీ పేరుతో మహిళా రెజిమెంటును కూడా ఏర్పాటు చేసి, కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌ను కమాండర్‌గా నియమించారు. ఆమె అసలు పేరు లక్ష్మీ స్వామినాథన్. **1943**, అక్టోబరు **21**వ తేదీన భారతదేశ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినట్లు ప్రకటించారు.

1942, ఫిబ్రవరి 15వ తేదీన ఆసియాలో బ్రిటన్ వలసవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం నూతన దశలోకి ప్రవేశించింది. ఆ రోజు బలమైన బ్రిటిష్ సైన్యం జపాన్ సామ్రాజ్యవాద సైన్యానికి లొంగిపోయింది. (అంతకు ముందు జపాన్ వారిని ప్రాచ్యదృష్టి గలవారనీ, బుద్ధిలేనివారనీ పిలిచేవారు). బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన తెల్ల సైనికుల నుండి భారతీయులను (అధికారులు, సైనికులు) వేరు చేసి, పంజాబ్ 14వ రెజిమెంట్ కెప్టెన్ మోహన్‌సింగ్‌కు అప్పగించాలని లొంగుబాటు సందర్భంలో చేసుకున్న ఒప్పందంలోని ఒక క్లాజులో పేర్కొన్నారు.

తీవ్రమైన పోరాటం జరుగుతున్న సమయంలో ఆ దుష్ప్రభావాన్ని భారతీయ సైనికులు భరించాల్సి వచ్చింది. సామ్రాజ్యవాద బ్రిటన్ తరఫున పోరాడవద్దనీ, జపాన్ సైన్యానికి లొంగిపోవాలనీ హిందుస్తానీ, తమిళ్, ఇంగ్లీష్‌లో ముద్రించిన వేలాది కరపత్రాలను జపాన్ వారు బాంబులతో పాటు జారవిడిచేవారు. 1915 నుండి జపాన్‌లో ప్రవాస జీవితం గడుపుతూ, అక్కడే ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌ను స్థాపించిన రాస్ బిహారిబోస్ సంతకంతో ఆ కరపత్రాలు ముద్రించి ఉన్నాయి. జపాన్‌కు వ్యతిరేకంగా అత్యంత సాహసంతో పోరాడుతున్న మోహన్‌సింగ్, ఆయన సైనికులను ఇతర దళాల నుండి వేరు చేసి, జపాన్ సైనికులు చుట్టుముట్టారు. లొంగిపోవటం మినహా వారికి మరో మార్గం లేకపోయింది. బ్రిటిష్ అధికారులను ఖైదీలుగా నిర్బంధించి, మోహన్‌సింగ్‌ను మాత్రం అత్యంత గౌరవంగా చూశారు. రాస్ బిహారి బోస్, కెప్టెన్ ఫ్యుజివర, ప్రీతంసింగ్ ఉన్న చోటుకు ఆయనను తీసుకెళ్ళారు. పోరాటం చేయటం ఆపివేయాలని ఆయనతో పాటు భారతీయ సైనికులందరికీ వారు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై లోతుగా ఆలోచించటానికి తనకు సమయం కావాలని చెప్పి, ఆ సందర్భాన్ని ఉపయోగించుకొని భారత సైన్యంలోని అధికారులు, సైనికులతో కూడా చర్చించవచ్చునని ఆయన భావించాడు. ఇకముందు జపాన్ సైన్యాలతో పోరాడకూడదని ఆయనా, ఆయన సైనికులూ నిర్ణయించుకున్నారు.

1942, ఫిబ్రవరి 15వ తేదీన భారతీయ సైనికులు, అధికారులను బ్రిటిష్ వారి నుండి వేరుచేసి, జపాన్ వారికి అప్పగించారు. జపాన్ వారు కెప్టెన్ మోహన్‌సింగ్‌కు వారిని అప్పగించారు. వారిని క్యాంపులలో ఉంచి, కొంత మేరకు స్వేచ్ఛ కల్పించారు. జపాన్ వారికీ, కెప్టెన్ మోహన్ సింగ్‌కు మధ్య, మోహన్‌సింగ్, రాస్‌బిహారి బోస్‌కూ మధ్య తీవ్ర చర్చలు జరిగాయి. చివరకు మోహన్‌సింగ్ నాయకత్వంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ)లో చేరాలని 80 శాతం మంది అంగీకరించారు. ఆయనకు 'జనరల్' ర్యాంక్ ఇచ్చారు. రాస్ బిహారి బోస్ ప్రెసిడెంట్‌గా, కెపికె మీనన్, ఎన్‌పి గోష్, ఎన్ రాఘవన్, ప్రీతంసింగ్, నీలకంఠ అయ్యర్ సభ్యులుగా కార్యాచరణ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ చారిత్రాత్మకమైన "క్విట్ ఇండియా", "డు ఆర్ డై" తీర్మానాలను ఆమోదించిన తర్వాత ఆగస్టు 10వ తేదీన అధికారికంగా ఐఎన్ఏను ఏర్పాటు చేశారు.

ఐఎన్ఏ తమకు మిత్రసంస్థ అని చెప్పటానికీ, దాని విస్తరణ కోసం బర్మా–భారత్ పరిహద్దులలో మోహరిస్తున్నట్లు రాతపూర్వక ఒప్పందం చేసుకోవటానికీ జపాన్ ప్రభుత్వం సిద్ధం కాలేదు. కెప్టెన్ మోహన్‌సింగ్‌తో పాటు ఐదుగురు సైనిక అధికారులు, ఐదుగురు పౌర అధికారులతో కూడిన యాక్షన్ కౌన్సిల్ సభ్యులు జపాన్ ప్రభుత్వంతో ప్రత్యక్ష చర్చలు జరపటం కోసం జపాన్ వెళ్ళారు. ఈ చర్చలలో అర్థవంతమైన ఫలితం రాలేదు. 1942,

జులైలో రాస్ బిహారి బోస్ అధ్యక్షతన భారత్, ఆగ్నేయాసియా దేశాలు, ఐఎన్ఎ ప్రతినిధుల సమావేశం బ్యాంకాక్‌లో జరిగింది. జపాన్ ప్రభుత్వం నుండి హామి పొందటానికి ఈ సమావేశం చివరి ప్రయత్నం చేసినా అది కూడా విఫలమైంది.

ఐఎన్ఎను రద్దు చేసి, తిరిగి యుద్ధఖైదీలుగా మారదామని జనరల్ మోహన్ సింగ్ నిర్ణయించుకున్నాడు. ఆయన రాజకీయ గురువు అయిన కెపికె మీనన్ ఈ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించాడు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే పోరాడాలని ప్రతిజ్ఞ చేసిన తర్వాత దాని నుండి వెనక్కు పోవటం సరికాదని భావించిన ఐఎన్ఎలోని మెజారిటీ సభ్యులు ఈ నిర్ణయాన్ని ఆమోదించలేదు. మోహన్ సింగ్, కెపికె మీనన్‌లను అరెస్ట్ చేశారు. ఇదే సమయంలో సుభాస్ చంద్రబోస్ బెర్లిన్ వచ్చాడని, పశ్చిమ ఎడారిలో జనరల్ రొమెల్ పట్టుకున్న భారతీయ యుద్ధ ఖైదీలతో ఇండియా లీగ్‌ను ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేస్తున్నాడన్న వార్తలు వారికి చేరాయి. సుభాస్ చంద్రబోస్‌ను బెర్లిన్ నుండి ఆగ్నేయాసియాకు తీసుకురావటానికి జపాన్ ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని వినియోగించాలని రాస్ బిహారి బోస్‌కు విజ్ఞప్తి చేశారు. రాస్ బిహారి బోస్ కార్యాచరణలోకి వెళ్ళాడు. ఈ ప్రతిపాదనను ఆమోదింపజేయటం కోసం బెర్లిన్‌లో ఉన్న జపాన్ రాయబారి జర్మన్ విదేశీ సంబంధాల శాఖ ద్వారా ప్రయత్నం చేశాడు. సుభాస్ చంద్రబోస్‌ను ప్రచారం కోసం మాత్రమే వినియోగించుకోవాలని హిట్లర్ భావించాడు. సోవియట్ యూనియన్‌పై జర్మనీ దాడి చేసి, విఫలం చెందిన తర్వాత ఇక దానికి పరాజయం తప్పదని సుభాస్ చంద్రబోస్ అర్థం చేసుకున్నాడు. జర్మనీలో ఉండి ఎటువంటి అర్థవంతమైన పాత్ర నిర్వహించలేని పరిస్థితులలో ఆగ్నేయాసియాకు పంపమని కోరాడు.

> ❝స్థానికంగా అటువంటి పరిశ్రమలవలన ప్రజలకు కలిగే ఉద్యోగావకాశాలు తక్కువ. కేవలం, మీనియల్ ఉద్యోగాలు (వాచ్ మెన్ వంటి ఉద్యోగాలు) మాత్రమే స్థానిక ప్రజలకు లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సాగుచేసే చిన్నకారు రైతులు, అటువంటి భూకేటాయింపుల కారణంగా, నిర్వాసితులవుతున్నారు.❞



భారత జాతీయ సైన్యంలో రాణీ ఝాన్సీ పేరుతో ఏర్పడిన మహిళా రెజిమెంటును సుభాష్ చంద్ర బోస్‌తో కలిసి పరిశీలిస్తున్న కెప్టెన్ లక్ష్మీ సెహెగల్

జలాంతర్గామిలో ప్రమాదకరమైన సుదీర్ఘ ప్రయాణం తర్వాత సుభాష్ చంద్రబోస్ సుమత్రాకు చేరుకున్నాడు. అక్కడి నుండి జపాన్ వెళ్ళాడు. ఆయనను కలుసుకోవటానికి ప్రధానమంత్రి టోజో విముఖంగా ఉన్నాడు. మంత్రులు, సలహాదారుల ఒత్తిడితో మాత్రమే బోస్‌ను కలిశాడు. ఒకసారి కలిసిన తర్వాత ఆయన పూర్తి సానుకూలంగా మారిపోయి, సుభాష్ చంద్రబోస్ భారతదేశానికి మాత్రమే కాక, ఆసియా అంతటికీ నాయకుడౌతాడని ప్రకటించాడు. సుభాష్ చంద్రబోస్ కోరిన దిగువ అంశాలను ఆయన తక్షణమే ఆమోదించాడు. 1. ప్రజలను చేర్చుకోవటం ద్వారా ఐఎన్ఎను విస్తరించాలి, దానిని జపాన్ సైన్యానికి మిత్రునిగా గుర్తించాలి. 2. బర్మా భారత సరిహద్దులకు వెళ్ళటానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలి. 3. వారి సైనికదళాలపై ఐఎన్ఎ అధికారులకు పూర్తి ఆధిపత్యం ఉండాలి. సమన్వయం చేసే బాధ్యత మాత్రమే జపాన్ అధికారులు నిర్వహించాలి. 4. భారతదేశ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎక్కడ ఏర్పాటు చేసినప్పటికీ, అండమాన్-నికోబార్

> ❝ పైన సూచించిన భూకేటాయింపులు కొన్ని ఉదాహరణకు మాత్రమే. గత రెండుమూడు దశాబ్దాలుగా, వేలాది ఎకరాల ప్రభుత్వభూములను, అధికారంలో ఉన్న రాజకీయనాయకులు యథేచ్ఛగా, ప్రైవేట్ ప్రైవేటు కంపెనీలకు సమర్పించిన విషయం అందరికీ తెలిసిందే. ఆ భూ కేటాయింపుల్లో ఎన్నో నిర్ణయాలను లోతుగా దర్యాప్తు చేస్తే వేలాది కోట్ల కుంభకోణాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. ❞

దీవులను ఆ ప్రభుత్వానికి అప్పగించాలి.

ఈ హామీలను తీసుకున్న తర్వాత సుభాష్ చంద్రబోస్ 1943, మే 3వ తేదీన సింగపూర్ చేరుకున్నాడు. మే 5వ తేదీన స్త్రీ, పురుష ఐఎన్ఎ అధికారులు, పౌరులు విస్తృతంగా హాజరైన సమావేశంలో ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ అధ్యక్ష బాధ్యతలను, ఐఎన్ఎ కమాండ్‌ను సుభాష్ చంద్రబోస్‌కు రాస్ బిహారి బోస్ అప్పగించాడు. ఆ మరుసటి రోజు నుండే మానవ వనరులను, అవసరమైన సామాగ్రిని పూర్తిగా సమీకరించాలని సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చాడు. భారత పౌరులను-వీరిలో అత్యధికులు భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారు-రిక్రూట్ చేసుకోవటంతో ఐఎన్ఎ బలం మూడు వారాల్లో రెట్టింపు అయింది. ధనికులైన భారతీయ వ్యాపారులు, ప్రధానంగా చెట్టియార్‌లు, పంజాబీలు, సింధిలు స్వచ్ఛందంగా డబ్బు, బంగారం విరాళాలుగా ఇచ్చారు. బంగారాన్ని విరాళంగా ఇచ్చినవారిలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ఈ విరాళాలతో ఆజాద్ హింద్ బ్యాంకును ఏర్పాటు చేసి, జర్మనీ, జపాన్‌ల నుండి తీసుకున్న రుణాలను క్రమంగా తీర్చివేశారు.

అప్పటికి నేతాజీగా ప్రసిద్ధుడైన సుభాష్ చంద్రబోస్, ఒక మహిళా రెజిమెంటును ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించటం ద్వారా బాంబు పేల్చాడు. దానికి రాణీ ఝాన్సీ రెజిమెంట్ అని పేరు పెట్టారు. అకట్టుకొనే ఆయన నాయకత్వ ప్రతిభ, నిజాయితీ, నమ్రత, ధైర్యం ఆయనతో పరిచయాలున్న స్త్రీ, పురుషులందరిలో విశ్వాసాన్ని నింపి, ఉత్తేజపరిచేవి. రాణీ ఝాన్సీ రెజిమెంటులో 1,500 మంది మహిళలు ఉన్నారు. పదాతి దళాలలో, గెరిల్లా యుద్ధంలో పాల్గొనటానికి అవసరమైన శిక్షణ వారికి ఇచ్చారు. **అక్టోబరు 21వ** తేదీన తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. పురుషులతో పాటు ఒక మహిళ కూడా మంత్రివర్గంలో ఉన్నారు. బ్రిటన్, అమెరికాలపై యుద్ధం ప్రకటించటం ఈ ప్రభుత్వ మొదటి కర్తవ్యం. వీటిలో బ్రిటన్ మన తక్షణ శత్రువు. భవిష్యత్‌లో అమెరికా మన ప్రధాన శత్రువుగా మారుతుందని నేతాజీ అంచనా కొచ్చారు. తన ఆర్థిక విధానాల ద్వారా అభివృద్ధిలో వెనుకబడిన మనలాంటి దేశాలపై ఆధిపత్యం సాధించటానికి అమెరికా అన్ని విధాలుగా ప్రయత్నిస్తుందని ఆయన భావించాడు. 'మీరు నాకు రక్తం ఇస్తే నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను', 'జైహింద్', 'ఛలో ఢిల్లీ' నినాదాలను ఆయన ఇచ్చాడు. కుల, మత విభేదాలను అధిగమించి, ప్రతి ఒక్కరూ భారతీయుడు, భారతీయురాలుగా భావించుకొంటున్నారు. బ్రిటిష్ వారిని మిగతా అంశాల కన్నా ఇది ఎక్కువగా ఆందోళనకు గురి చేసింది. భారతదేశంలో తమ పాలనను కొనసాగించటానికి ఇక ముందు భారత సైన్యాలపై ఆధారపడలేమని వారికి స్పష్టమైంది. ఇతర అనేక ఉద్యమాలతో పాటు ఇది కూడా భారతీయులకు అధికారాన్ని అప్పగించటాన్ని వేగవంతం చేసింది. కానీ భారత ఉపఖండాన్ని విభజించిన తర్వాత మాత్రమే అధికార మార్పిడి చేశారు.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# బెంగాల్ రైతాంగ గర్జన 'తెభాగా పోరాటం'

(15వ పేజీ తరువాయి)

సంవత్సరాలు పట్టింది.

జోతేదార్లు కొత్త పద్ధతులు అవలంబించి రైతులను భూముల నుంచి బహిష్కరించడం ప్రారంభించారు. ఫలితంగా అనేక మంది రైతులు భూమిలేని కూలీలుగా మారారు. 1948లో ఉద్యమం మళ్లీ ఊపందుకుంది. 24 పరగణాల్లోని కాకద్వీప్, బీర్భూమ్, బర్ద్వాన్, హుగ్లీ, మేదినిపూర్ జిల్లాల్లో రైతులు తెగించి పోరాడారు. రైతులు చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం, జోతేదార్లు సహించలేక పోయారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించినా ఉద్యమం ఆగిపోలేదు. బర్గాదార్ల హక్కుల కోసం రైతులు మరో మూడు దశాబ్దాల పాటు పోరాడాల్సి వచ్చింది. చివరికి 1977లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే బర్గాదార్ల హక్కులు పూర్తిగా చట్టబద్ధం అయ్యాయి. పంటలో మూడింట రెండు వంతులు బర్గాదార్లకే అన్న నిబంధన అమలు చేయబడింది.

తెభాగా ఉద్యమం ప్రత్యేకత ఏమిటంటే కేవలం రాజకీయమే కాకుండా సాంస్కృతిక రంగం కూడా ఈ పోరాటంలో భాగమైంది. కళా, సాహిత్య రంగాలను కూడా ప్రభావితం చేసింది. బిష్ణుదే, సుభాష్ ముఖర్జీ, సుకాంత భట్టాచార్య వంటి కవులు తమ రచనల ద్వారా ఉద్యమానికి ఊపునిచ్చారు. దేబబ్రత బిశ్వాస్, సలిల్ చౌధురి వంటి గాయకులు పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. చిత్తప్రసాద్, సోమనాథ్ హోరె వంటి కళాకారులు ఉద్యమాన్ని చిత్రాల ద్వారా ప్రజలకు దగ్గర చేశారు. రైతుల పోరాటానికి ప్రాణం పోశారు.

మొత్తానికి, తెభాగా ఉద్యమం భారత స్వాతంత్ర్యానంతరం జరిగిన రైతు పోరాటాల్లో ఒక గొప్ప మైలురాయిగా నిలిచి పోయింది.

ఇది రైతుల ఆత్మ గౌరవం, భూమి పై హక్కులు, ఆర్థిక స్వేచ్ఛ కోసం జరిగిన మహత్తర పోరాటం. ఇది కేవలం బర్గాదార్ల హక్కులను సాధించడమే కాకుండా భారతదేశంలో రైతు ఉద్యమాల దశ, దిశను నిర్ణయించిన చారిత్రక సంఘటనగా చరిత్రలో నిలిచిపోయింది.

(అనువాదం : కె. హరికిషోర్)

రాజకీయ పరిణామాలు

# పెట్టుబడిదారుల లాభాల కోసమే 13 గంటల పని



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ.కోటిరెడ్డి

**13** గంటల పనిదినం అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును పెట్టి ఆమోదించటంతో చట్టంగా మారింది. శాసనమండలిలో అధిక్యత ఉన్న వైసిపి చర్చలో వ్యతిరేకించినప్పటికీ, వ్యతిరేకంగా ఓటువేయకుండా బిల్లు ఆమోదానికి తన వంతు సహకారాన్ని అందించింది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాణిజ్య సంస్థలలో పని గంటలను 8 నుండి 10కి పెంచుతూ జులైనెలలో జి ఓ జారి చేసింది. కేంద్ర ప్రభుత్వం 2020లో ఆమోదించిన ఆక్యుపేషనల్ సేఫ్టి, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో యజమానులు కార్మికుల చేత 12 గంటలు పని చేయించుకోవటానికి అవకాశం ఇచ్చింది. పని గంటలు పెంచుతూ చట్టాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తున్నది. వివిధ రాష్ట్రాలలోని ఎన్‌డిఎ నాయకత్వంలోని ప్రభుత్వాలతో పాటు ఇతర బూర్జువా రాజకీయ పార్టీల నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పని గంటలు పెంచుతూ చట్టాలు చేస్తున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ర్యాంకులను మెరుగుపరుచుకోవటం, తద్వారా పెట్టుబడులను ఆకర్షించటం కోసం అంటూ పనిగంటల పెంపుకు పాలకులు సాకులు చెబుతున్నారు. పనిగంటల పెంపు వలన పెట్టుబడిదారుల లాభాలు పెరుగుతాయి. కానీ దేశం, కార్మికవర్గం, ప్రజలు అనేక నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీని ఫలితంగా ఎదురయ్యే సామాజిక, ఆర్థిక ఫలితాలను ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవటం లేదు.

పనిగంటలు 8 నుండి 13కు పెంచటంతో ప్రస్తుతం పని చేస్తున్న కార్మికుల సంఖ్యను తగ్గించాల్సి వస్తుంది. పనిగంటలు పెంచకముందు రోజుకు ఎనిమిది గంటల చొప్పున 10 మంది కార్మికులు 80 గంటలు పనిచేస్తే, టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం ఇపుడు రోజుకు 13 గంటల చొప్పున ఆరుగురు కార్మికులు 78 గంటలు పనిచేస్తారు. కాబట్టి 10 మందిచేసే పనికి ఇపుడు ఆరుగురు కార్మికులు సరిపోతారు. నలుగురికి పని ఉండదు. ఈ విధంగా చూసినపుడు ఇపుడు పనిచేస్తున్న కార్మికులలో 40 శాతం మందికి పని ఉండదు. పనులను కోల్పోతున్న ఈ శ్రామికులకు నిరుద్యోగులలో చేరటం మినహా గత్యంతరం లేదు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉంది. ఉపాధి హామి పనుల కోసం ఎదురుచూడటం, తక్కువ కూలికి పనిచేయటానికి కూలీలు ఎగబడటం తదితరాలు ఉపాధి లేక వ్యవసాయ, గ్రామీణ కార్మికులు ఏ విధంగా అల్లాడుతున్నారో మన కళ్ళకు కడుతున్నాయి. పట్టణాలలోని కార్మికుల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ఇటువంటి పరిస్థితులలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటం ద్వారానే నిరుద్యోగాన్ని తగ్గించగలం. అందుకు పనిగంటలు పెంచటం కాక తగ్గించాలి.

పనిగంటలు పెంచితే కార్మికుల సంఖ్య తగ్గినట్లే, పనిగంటలు తగ్గిస్తే, అవసరమైన కార్మికుల సంఖ్య పెరుగుతుంది. ఐదుగురు కార్మికులు రోజుకు ఎనిమిది గంటల చొప్పున 40 గంటలు పనిచేస్తారు. పని దినాన్ని రోజుకు ఆరు గంటలకు తగ్గిస్తే అపుడు ఐదుగురు కార్మికులు 30 గంటలు పనిచేస్తారు. మిగతా 10 గంటల పనికూడా పూర్తి కావాలంటే మరో ఇద్దరు కార్మికులను అదనంగా పెట్టుకోవాలి. అంటే 40 శాతం కార్మికులు అదనంగా కావలసి వస్తారు. ఆ విధంగా పని గంటల తగ్గింపు ద్వారా నిరుద్యోగాన్ని కొంత మేరకు తగ్గించటానికి అవకాశం వస్తుంది.

పనిగంటలు పెంచితే ఇపుడు పని చేస్తున్న వారిలో ఉపాధి కోల్పోయే 40 శాతం కార్మికులకు వేతనాలు రావు. 2023-24లో దేశంలో 64.33 కోట్లమంది కార్మికులు, వైట్ కాలర్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పని గంటలు పెరిగితే వీరిలో 40 శాతం మంది, 25 కోట్లమందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనులు కోల్పోతారు. వీరికి ఆదాయం ఉండదు. ఇది ఆర్థికవ్యవస్థ, దేశీయ మార్కెట్‌పై పెను ప్రభావం కలిగిస్తుంది. మార్కెట్‌లో 40 శాతం కుంచించుకుపోయిన తర్వాత దేశంలో తయారయ్యే సరుకులు ఎవరు కొనుగోలు చేస్తారు? ఆదాయాలు లేని పేదలు, కార్మికుల కుటుంబాల పరిస్థితి ఏమిటి తదితర అంశాలు పెట్టుబడిదారులకు పట్టవు. లాభాల యావ, దేశ సంపదలను దోచుకోవటం, ప్రజల ఆదాయాలను, ఆస్తులను కొల్లగొట్టి, తమ సంపదలను పెంచుకోవటం మినహా మిగతా అంశాలను వారు పట్టించుకోరు.

ఎక్కువ మంది కార్మికులతో పనులు చేయిస్తే సరుకుల ధరలు పెరుగుతాయని, నిత్యావసరాల కొనుగోలుకు ప్రజలు ఎక్కువ ధరలు చెల్లించాల్సి వస్తుందని, అంతర్జాతీయ మార్కెట్‌లో మన సరుకులు పోటీకి నిలబడలేవని, పెట్టుబడులు దేశంలోకి రావని వాదనలు చేస్తారు. ఎక్కువ మంది కార్మికుల చేత పని చేయిస్తే సరుకుల ధరలు ఎక్కువగా ఉంటాయనేది కొంత వరకు వాస్తవమే. కార్మికుల శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉంటే సరుకుల ధరలు ఎక్కువగా ఉంటాయి. శ్రమ ఉత్పాదకత ఎక్కువగా ఉంటే సరుకుల ధరలు తక్కువగా ఉంటాయి. శ్రమ ఉత్పాదకత ఎక్కువగా ఉండాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం ఆధునీకరిస్తుండాలి. యంత్రాలను మెరుగుచేయాలి. పెట్టుబడిదారి వ్యవస్థలో పెట్టుబడిదారి వర్గమే ఈ పనులు చేయాలి.

> “ రాజ్యాంగం నిర్దేశించిన విధంగా పని చేయకపోతే ఆ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన వారికి, నియమించబడిన వారికి ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు ఉండదు. తమ బాధ్యతలను సక్రమంగా ఎందుకు నిర్వర్తించటంలేదో వారు ప్రజలకు సంజాయిషీ చెప్పాలి. రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను అమలు జరపనివారు దేశ వ్యతిరేకులని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ”

ఇవి సక్రమంగా చేయకపోతే శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. తక్కువ సరుకులను ఉత్పత్తి చేయటానికి ఎక్కువ శ్రమను వెచ్చించాల్సి ఉంటుంది. అందువలన పెట్టుబడిదారి వ్యవస్థలో, ఒక దేశంలో కార్మికుల శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉందంటే అందుకు అక్కడి పెట్టుబడిదారి వర్గం, ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఉత్పాదకత ఎక్కువ, తక్కువ ఉండటంతో కార్మికవర్గానికి సంబంధం లేదు. పెట్టుబడిదారులు, ప్రభుత్వ చేతగాని తనానికి కార్మికవర్గం ఎక్కువ గంటలు పని చేయాలనటం సమంజసం కాదు.

ఇక ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తే సరుకుల ధరలు కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎక్కువ మందికి పనులు దొరకటం, ఆదాయం పెరగటం వలన అదంత పెద్ద సమస్యగా ఉండదు. ఒకవేళ ప్రజలు అత్యవసరంగా వాడే సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులో లేవనుకుంటే ధరలు ఎక్కువగా ఉన్న సరుకులకు ఆ మేరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చినందు వలన మార్కెట్ విస్తరణ, అదనపు ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తుంది. అందువలన ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ దేశ ఆర్థికవ్యవస్థను అభివృద్ధి చేయటానికి తోడ్పడుతుంది. కాబట్టి దానిని వృథా ఖర్చుగా భావించరాదు.

కార్మికుల చేత 13, 15 గంటలు పని చేయిస్తేనే మన సరుకులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడగలవన్న వాదన కూడా సరైనది కాదు. అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యధికంగా సరుకులు విక్రయిస్తున్న ఏ దేశంలోనూ–అమెరికా, చైనా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు– కార్మికులు రోజుకు ఎనిమిది గంటలకు మించి పని చేయటం లేదు. కాబట్టి కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయటానికి, ఎగుమతులు పెరగటానికి సంబంధం లేదు. నిరంతర పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, యంత్రాలను ఆధునీకరిస్తుండటం ద్వారా శ్రమ ఉత్పాదకత పెరిగితే సరుకుల ఉత్పత్తి వ్యయం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ పోటీలో పై చేయి సాధిస్తాం. లేకపోతే దిగువ స్థానంలో ఉంటాం. ప్రభుత్వం, పెట్టుబడిదారులు చేయవలసిన ఆధునీకరణను వదిలేసి, కార్మికుల చేత ఎక్కువ గంటలు పని చేయించటం అంటే వారి అసమర్థతకు కార్మికులను బలి పశువులను చేయటం అవుతుంది.

విదేశీ పెట్టుబడులె ఎప్పుడూ బాగా లాభాలు సంపాదించుకోవచ్చనే ఆశతో దేశంలోకి వస్తాయి. వారి లాభాల కోసం మినహా మన ప్రజలకు ఉపాధి కల్పించటానికి, దేశాన్ని అభివృద్ధి చేయటానికి విదేశీ పెట్టుబడులు రావనే విషయాన్ని ప్రజలు, ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలి. మన దేశాన్ని అభివృద్ధి చేసుకోవటానికి దేశంలోని పెట్టుబడులపై ఆధారపడటం ప్రధానంగా ఉండాలి. పెట్టుబడులు బయటికి పోవటానికి అవకాశం ఇచ్చి, విదేశీ పెట్టుబడులను రప్పించి, దేశాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పే మాటలకు అర్థమేముంది? అందువలన దేశీయ

చదవండి! చదివించండి!!

**Marxist**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక

సంచిక 61, 1–2, జనవరి–జూన్ 2025

**ఎం.ఎ. బేబీ**

రాజకీయ తీర్మానం : బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా బహుముఖ పోరాటానికి పిలుపు

**ప్రకాశ్ కరత్**

రాజకీయ సమీక్షా నివేదిక: పార్టీ స్వతంత్ర బలం పెంపుపై కేంద్రీకరణ

**బి.వి. రాఘవులు**

సిపిఐ(ఎం) 24వ మహాసభలు: పార్టీ నిర్మాణ పునరుత్తేజానికై పిలుపు

**సుదీప్ దత్తా**

ముట్టడిలో నయా–ఉదారవాద భారత దేశం

**పత్రం**

ప్రసంగం: కామ్రేడ్ తో లామ్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

*Order copies from:*

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

పెట్టుబడులు, సహజ వనరులను ఉపయోగించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధించటానికి ప్రభుత్వం పూనుకోవాలి.

పని గంటల పెంపు వలన కార్మికవర్గం ఎక్కువ గంటలు పని చేయటంతో వారి శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. అనేక సంవత్సరాల పోరాటం తర్వాత కార్మికవర్గం ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల నిద్ర, ఎనిమిది గంటల విశ్రాంతి హక్కును సాధించుకున్నది. కనీసవేతన చట్టాలు, సంఘం పెట్టుకోవటం, ఇతర హక్కులు సాధించుకున్నారు. దానితో వారి జీవన ప్రమాణాలు, ఆరోగ్యం మెరుగుపడ్డాయి. ప్రస్తుత సమాజంలో ఎదురవుతున్న సమస్యల వలన ప్రజలతో పాటు కార్మికవర్గం కూడా మానసిక వత్తిడికి గురవుతున్నారు. ఇపుడు పని గంటలు పెంపుతో శారీరక సమస్యలతో పాటు మానసిక వత్తిడి పెరిగి కార్మికులు, ఉద్యోగులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. 64 కోట్లమంది కార్మికులు, ఉద్యోగులపై దీని ప్రభావం పడటం అంటే మన సమాజమే మానసిక వికలాంగ స్థితికి చేరుతుంది. విజ్ఞత ఉన్న ఏ ప్రభుత్వమైనా ఇటువంటి స్థితిని తెచ్చుకోవటానికి సిద్ధం కాదు.

అందువలన పని గంటల పెంపు ఏ మాత్రం వాంఛనీయం కాదు. కార్మికులు ఎనిమిది గంటల పనిదినం సాధించుకున్న శతాబ్దం తర్వాత పని గంటలు పెంచటం అంటే పెట్టుబడిదారి వ్యవస్థ ఎంత అసమర్థమైనదో స్పష్టం అవుతున్నది. ఈ వ్యవస్థ అసమర్థతకు మన సమాజం మూల్యం చెల్లించటం తగదు. కాబట్టి కార్మికవర్గంతో పాటు అన్ని తరగతుల శ్రమజీవులు కదిలి, పని గంటల పెంపు చట్టాన్ని, దానికి మూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకొనే వరకు పోరాటం చేయాలి.

### లడఖ్ ప్రజలపై అణచివేత

కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌లో ఆందోళనకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. తమ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఆందోళన చేస్తున్న ప్రజలపై పోలీసులు కాల్పులు జరపటంతో నలుగురు మరణించటం, నిరాహారదీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయటంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. తర్వాత వాంగ్‌చుక్‌పై కేంద్ర ప్రభుత్వం ఎన్ ఎస్ ఎ చట్టాన్ని ప్రయోగించింది. ఈ చట్టం కింద అరెస్టైన వారికి సంవత్సరం పాటు బెయిల్ ఇవ్వరు. ఈ

> ❝ రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవటం లక్ష్యంగా ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తున్నారు. ఆ విధంగా పని చేయటం కోసం తరుదు కట్టిన ఆర్ఎస్ఎస్ నేతలను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇచ్చి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమిస్తున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలను పని చేయకుండా నిరోధించటమే లక్ష్యంగా ఈ గవర్నర్లు పని చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కేరళ గవర్నర్లు ఈ వరుసలో ముందు వీరిన ఉన్నారు. ❞

ఘటనల తర్వాత ప్రజల అసంతృప్తి మరింతగా పెరిగింది. లడఖ్‌లో ఈ పరిస్థితి ఏర్పడటానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే.

చైనా, పాకిస్తాన్ సరిహద్దులలో ఉన్న లడఖ్‌లో బౌద్ధులు మెజారిటీగా ఉన్నారు. కార్గిల్ జిల్లాలో ముస్లింలు మెజారిటీగా ఉన్నారు. ఆందోళనలు జరుగుతూ, ప్రస్తుతం హింసాకాండ జరిగిన లేహ్‌లో బౌద్ధులే అధికంగా ఉన్నారు. వీరు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అనేక దశాబ్దాల నుండి పోరాటాలు చేస్తుండగా, కార్గిల్‌లో మెజారిటీగా ఉన్న ముస్లింలు తమను కాశ్మీర్ పాలనా వ్యవస్థలో భాగంగా చేయమని కోరుతున్నారు. కాని 2019లో కాశ్మీర్‌కు రాష్ట్రహోదా రద్దు చేసి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు–జమ్మూ-కాశ్మీర్, లడఖ్-గా విభజించిన తర్వాత లడఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, తమకు ఉద్యోగాలు, భూములు వచ్చే విధంగా మరింత స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని, రాష్ట్రాన్ని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బౌద్ధులు, ముస్లింలు, ఉభయులు కలిసి ఆందోళన చేస్తున్నారు.

రాష్ట్రహోదా కావాలని జరుగుతున్న నిరసన కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. కాని కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోవటంతో ఆందోళనలు తీవ్రమౌతున్నాయి. ఆ క్రమంలో సెప్టెంబరు 10వ తేదీ నుండి పర్యావరణ పరిరక్షణ ఉద్యమ కార్యకర్త, కొన్ని విద్యాలయాలను నడుపుతున్న సోనమ్ వాంగ్‌చుక్, ఆయనతో పాటు మరి కొందరు నిరాహారదీక్ష చేస్తున్నారు. ఆయనతో పాటు దీక్ష చేస్తున్న ఇద్దరు కార్యకర్తలను 23వ తేదీన ఆసుపత్రిలో చేర్చాల్సివచ్చింది. దానితో ప్రజలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ లేహ్ ఎపెక్స్ బాడీ 24వ తేదీన బంద్‌కు పిలుపు ఇచ్చింది.

బంద్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకత వెల్లువలా వ్యక్తమయింది. బంద్ రోజు లేహ్‌లోని లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ముందు ప్రారంభమైన ఆందోళనలు కొద్ది నిముషాలలో పట్టణమంతా విస్తరించాయి. రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ చేర్చటం, ఇతర డిమాండ్లపై ప్రభుత్వం లడఖ్ ప్రతినిధులతో చర్చలు జరపకపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు బిజెపి కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు నిరసనకారులపై బల ప్రయోగం చేయటానికి పూనుకోవటంతో ఆగ్రహోదగ్రులైన ప్రజలు బిజెపి కార్యాలయాన్ని దగ్ధం చేశారు. పోలీసులు భాష్పవాయువు గోళాలను ప్రయోగించటంతో పాటు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో నలుగురు మరణించారు. ప్రభుత్వం వివరాలు ప్రకటించకపోవటంతో ఖచ్చితంగా ఎంతమంది గాయపడిందీ తెలియనప్పటికీ, దాదాపు 90 మంది వరకు ఆసుపత్రి పాలయ్యారని చెబుతున్నారు. ఈ ఘటనల తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించి, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశాడు. ప్రభుత్వం నిరవధిక కర్ఫ్యూ విధించి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్టు ప్రకటించింది.

ప్రస్తుత నిరాహారదీక్షలు, ప్రజల అసంతృప్తి బద్దలైన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వ తీరు ఏ మాత్రం మారకపోగా, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న వారినే దోషులుగా నిలబెడుతున్నది. 24వ తేదీన లేహ్‌లో జరిగిన ఘటనలకు సోనమ్ వాంగ్‌చుక్ కారణమని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించి, 26వ తేదీన ఆయనను అరెస్టు చేసింది. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్‌కు విదేశీ నిధుల లైసెన్స్‌ను 25వ తేదీన రద్దుచేసింది. తన విధానాలను వ్యతిరేకిస్తున్న

> "చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు."

వారిపై కక్షసాధింపులో భాగంగా హింసను ప్రేరేపించాడనే ఆరోపణలతో కాంగ్రెస్ కౌన్సిలర్ స్టాంజిన్ త్సెపాగ్‌పై కూడా కేసు నమోదు చేశారు.

లడఖ్ ప్రజల ఆందోళనలను బల ప్రయోగం ద్వారా అణచివేయటం సాధ్యం కాదు. ప్రజల అసంతృప్తికి కారణాలను అర్థం చేసుకొని, వాటిని తొలగించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటేనే ప్రశాంతత నెలకొంటుంది. 2019లో జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను రద్దుచేసి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చటం, అక్కడి భూములు, ఉద్యోగాలలో స్థానికులకు రక్షణ కల్పిస్తున్న ఆర్టికల్స్ 370, 35ఎ లను రద్దు చేయటంతో ప్రజలు ఆగ్రహించారు. ఆనాడు దానిని అదుపు చేయటం కోసం రాష్ట్రంలో నిరవధిక కర్ఫ్యూ విధించటం, నెలల తరబడి ఇంటర్‌నెట్‌ను బంద్ చేయటం, వివిధ రకాలుగా అణచివేత చర్యలు తీసుకున్నారు. దానితో తాత్కాలికంగా పైకి ప్రశాంతంగా కనిపించినప్పటికీ జమ్మూకాశ్మీర్, లడఖ్ ప్రజలలో అసంతృప్తి పెరిగింది. ఈ అసంతృప్తిని పరిష్కరించటానికి అవసరమైన చర్యలు తీసుకోకపోతే జమ్మూకాశ్మీర్, లడఖ్‌లలోని ఏ ప్రాంతంలో, ఎప్పుడైనా ఇటువంటి ఆందోళనలు ప్రారంభం కావచ్చు. ఆందోళనలు జరిగేటప్పుడు బలప్రయోగం ద్వారా వాటిని అదుపు చేయాలని చూడటం, ఉద్యమాలలో పాల్గొంటున్న వారిపై తప్పుడు ఆరోపణలు చేయటం ద్వారా వారిని బలిపశువులను చేయటం వలన ఏ సమస్య కూడా పరిష్కారం కాదు. దీని వలన సమస్యలతో పాటు ప్రజలలోని అసంతృప్తి కూడా మరింత తీవ్రమౌతుంది. ప్రజా సమస్యలను పక్కన పెట్టి, పాలకపార్టీ సంకుచిత దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నంత కాలం జమ్మూకాశ్మీర్, లడఖ్ ప్రాంతాలలో ఇటువంటి ఆందోళనలు పదే పదే తలెత్తుతాయి.

చైనా, పాకిస్తాన్ దేశాల సరిహద్దులలో ఉన్న జమ్మూకాశ్మీర్, లడఖ్ ప్రజలలో అసంతృప్తిని పెంచే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఎంత తెలివి తక్కువ ప్రభుత్వమైనా సరిహద్దు ప్రాంతాలలోని ప్రజల అసంతృప్తిని పెంచే విధంగా వ్యవహరించ కూడదు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు కృషి చేయటం ద్వారా అక్కడి ప్రజల అసంతృప్తిని సత్వరం పరిష్కరించటానికి, వారు ప్రభుత్వం పట్ల విశ్వాసంతో వ్యవహరించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. అలా చేయటం ద్వారానే సరిహద్దు ప్రాంతాలను పటిష్టంగా ఉంచటంతో పాటు రక్షణ వ్యవస్థ కూడా శక్తివంతమౌతుంది. కాని దేశరక్షణను తామే గుత్తకు తీసుకున్నట్లుగా గప్పాలు కొడుతున్న బిజెపి ప్రభుత్వం సరిహద్దులలోని ప్రజల అసంతృప్తిని పెంచే చర్యలు తీసుకొంటున్నది. ప్రజలు సైన్యానికి మద్దతుగా నిలవకపోతే సరిహద్దులలో ఎంత శక్తివంతమైన ఆయుధాలను మోహరించినా నిరుపయోగమౌతాయి. దేశవ్యతిరేకశక్తులు తలెత్తటానికి, తీవ్రవాదులకు స్థావరాలు ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని, జమ్మూకాశ్మీర్, లడఖ్‌లకు రాష్ట్రాల హోదా ఇవ్వాలి. యువతకు ఉపాధి కల్పించి, వారి అసంతృప్తిని పరిష్కరించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు ఇక్కడి ప్రజలలో అసంతృప్తిని పెంచి, ఆందోళనలకు పురిగొల్పుతున్నాయి. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఇతర సంస్థలు ప్రజలు చేస్తున్న పోరాటాలకు నాయకత్వం వహిస్తాయి. ఆ విధంగా నాయకత్వం వహించటం వాటి హక్కు. కాని అధికారంలో ఉన్న ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న వారినల్లా దేశ వ్యతిరేకులుగా ముద్ర వేయటం, వారిపై చర్యలు తీసుకోవటం ప్రజాస్వామ్యానికి తిలోదకాలు ఇవ్వటానికి దారితీస్తుంది. ప్రజాస్వామ్యం లేకపోతే సమస్యల పరిష్కారానికి పోరాటాలు, ఉద్యమాలకు అవకాశం ఉండదు. ప్రస్తుతం ప్రజల, ప్రభుత్వ ఆస్తులు, భూములు, సంపదలను బడా పెట్టుబడిదారీ సంస్థలు, బూర్జువా ప్రభుత్వాలు అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్న పరిస్థితులలో పోరాడే హక్కును కోల్పోవటం అంటే సర్వం కోల్పోయినట్లే. అందువలన ప్రజలు అప్రమత్తం కావాలి. ప్రభుత్వ నిరంకుశ విధానాలను తిప్పికొట్టి, తమ హక్కులు, ఆస్తులు కాపాడుకోవటానికి సన్నద్ధం కావాలి.

❖

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి.**

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# భారత దేశంలో హేతువాద ఆలోచనా విధానం

**ఎస్ వెంకట్రావు**

శాస్త్రీయ ఆలోచనా విధానం అనేది వేల ఏళ్లుగా ఉంది. మన దేశంలో చార్వాకులు, సాంఖ్యులు, లోకాయతులు, బౌద్ధులు మొదలైన వాళ్లు ప్రాచీన కాలంలోనే హేతుబద్ధ ఆలోచనా ధోరణిని ప్రచారం చేశారు. అయితే వారి ఆలోచనా ధోరణిని బలపరిచే స్థాయిలో ఆనాడు సైన్సు అభివృద్ధి కాలేదు గనుక మన దేశంలో ఆ నాడు హేతువుకీ, మూఢత్వానికీ మధ్య జరిగిన ఘర్షణలో హేతువిరుద్ధ ఆలోచనా విధానం విజయం సాధించింది.

ప్రాచీన భారత దేశంలో హేతుబద్ధ ఆలోచనా విధానం ఎంతగా అభివృద్ధి చెందిందో లోకాయతులు లేక చార్వాకుల చరిత్ర గమనిస్తే అర్థమవుతుంది. బ్రాహ్మణవాదులు లోకాయతుల రచనలను, వారి గ్రంథాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అందువల్ల లోకాయతాన్ని గురించి తెలుసుకోడానికి మన వద్ద ప్రత్యక్ష సమాచారం లేదు. కానీ వారిని తిడుతూ మాధవాచార్యుడు లాంటి బద్ధ వ్యతిరేకులు రాసిన రచనల నుండి లోకాయతుల వాదనలేమిటో మనకు తెలిశాయి.

భౌతిక ప్రపంచమంతా కేవలం మాయ లేదా భ్రమ మాత్రమేననే అశాస్త్రీయ మిథ్యా వాదానికి వ్యతిరేకంగా లోకాయతులు వస్తు ప్రపంచపు ఉనికి యథార్థమైందేనని గుర్తించారు.

అంతేకాక నీరు, నిప్పు, భూమి, గాలి అనే నాలుగు మూల భూతాల కలయిక ఫలితంగా యావద్విశ్వం దానిలోని వస్తు సముదాయం సృష్టించబడతాయని లోకాయతుల ప్రగాఢ విశ్వాసం, ప్రాపంచిక వస్తు సముదాయంలో వైవిధ్యాన్ని వివరిస్తూ, పై చతుర్భూతాల సమ్మేళనాల మధ్య ఉండే గుణాత్మకమైన పరిమాణాత్మకమైన తేడాలే ఇందుకు కారణభూతమన్నారు.

మూలపదార్థాలు వాటి రూపాంతర కలయిక వల్లనే వస్తుసృష్టి సాగుతుందన్న తమ వాదాన్ని, లోకాయతులీ దిగువ విధంగా సోదాహరణంగా వివరించారు:

"సారా తయారు చెయ్యడానికి వివిధ రకాల పదార్థాలను ఉపయోగిస్తారు. వీటిలో దేనికీ స్వతంత్రంగా మత్తు కలిగించే స్వభావం లేదు. కానీ వీటన్నింటిని కలిపి పులియ పెట్టినపుడు తయారయ్యే సారాకు మత్తునిచ్చే సామర్థ్యం వస్తుంది" అలాగే మరో ఉదాహరణ నిచ్చారు.

తెల్లటి సున్నం, ఆకుపచ్చని తమల పాకులు కలిపి నమిలినప్పుడు అంతకుముందు లేని ఎరుపురంగు కొత్తగా పుడుతుంది.

సరిగా ఇదేవిధంగా మానవుడి మేధస్సు లేదా మానసిక చైతన్యం కూడా నాలుగు మూలభూతాల సమ్మేళనం నుంచే ఉద్భవించిందని లోకాయతులు నిర్ధారించారు. భూమి, గాలి, నీరు, నిప్పు విడివిడిగా ఉన్నప్పుడు, వాటికి లేని మానసిక చైతన్యం, ఆలోచనాశక్తి అవి సమ్మిళితం అయినప్పుడు రూపొందే భౌతిక శరీరంలో కొత్తగా పుడతాయని లోకాయతులు వివరించారు. అలాగే మరణం తరువాత భౌతిక శరీరంతో పాటే దానికి సంబంధించిన మానసిక చైతన్యమూ నాశనమౌతుందని వక్కాణించారు.

కాబట్టి మానసిక చైతన్యం అనేది పదార్థం లేదా భౌతిక శరీరం నుంచి విడదీయ రానిదన్నమాట. ఈ విషయాన్ని నిర్ధారించడానికి లోకాయతులు కొన్ని వాదనలు ప్రవేశ పెట్టారు.

1.భౌతిక శరీరంలో సంబంధం లేకుండా స్వతంత్రమైన అస్తిత్వాన్ని కలిగి ఉంటుందని చెప్పే 'మానసిక చైతన్యం' కోసం ప్రత్యక్ష పరిశీలన ద్వారా మనం వెతికినప్పుడు అది విడిగా కనబడటంలేదు.

2.మానసిక చైతన్యానికి చిహ్నమయిన స్పర్శజ్ఞానం, ప్రత్యక్ష జ్ఞానం మొదలైనవి వివిధ శారీరకావయవాలు సహకరించినప్పుడే మనకు లభ్యమవుతాయి. దీన్ని బట్టి మానసిక చైతన్యానికి భౌతిక శరీరం పునాది అని తెలుస్తున్నది.

3.'మానవుడి మేధాశక్తి త్వరితంగానూ గుణనీయంగానూ పెరగాలంటే ప్రత్యేకంగా కొన్ని రకాల ఆహార పదార్థాలను, పానీయాలను స్వీకరించాలని వైద్యశాస్త్రం సూచిస్తున్నది. భౌతిక పదార్థాలకు మానసిక చైతన్యానికీగల సంబంధాన్ని విషయం మరొకసారి బలపరుస్తున్నది.

ఈ విధంగా మానవుడు మానసిక చైతన్యంపట్ల లోకాయతుల దృక్పథాన్ని పై ఉదాహరణలు స్పష్టంగా వివరిస్తున్నాయి. ఈ వాదనలను నిరూపించడానికి లోకాయతులు కొన్ని ప్రయోగాలు కూడా చేసినట్లు మనకు తెలుస్తుంది.

'పాయసి' అనే ఒక యువరాజు భౌతికవాద సిద్ధాంతాలను ప్రచారం చేసినట్లు బౌద్ధ, జైన గ్రంథాలు ప్రస్తావించాయి. పరలోకం, పునర్జన్మ, కర్మ ఫలితాలు, అసలున్నాయా లేవో తెల్పడానికి పాయసి అవలంబించిన పద్ధతి తమాషాగా ఉంటుంది. ఆత్మ అనేది ఉందో లేదో నిర్ధారించడానికి పాయసి కొన్ని ప్రయోగాత్మకమైన పద్ధతులను ఉపయోగించాడు, ఇందులో మొదటిది ఇలా ఉంటుంది.

"మరణ దండన విధించిన ముద్దాయిని ఒక పెద్ద జాడీలో పెట్టి మూతవేసి అతడు చనిపోయే వరకూ ఆ జాడీని మంటల్లోవేసి కాల్చాలి. ఆ తరువాత జాడీ మూత తీసినప్పుడు ఏదైనా బయటకు వచ్చినట్లయితే 'ఆత్మ ఉందని తెలుస్తుంది. కానీ అలాంటి దేమీ జరగనందున ఆత్మ అనేది లేదని నిర్ధారించవచ్చు" మరో ప్రయోగం పరిశీలిద్దాం.

"అనేక ఘోరకృత్యాలు చేసిన నేరస్తుడికి ఉరిశిక్ష అమలు పరిచే ముందు అతని బరువు తూయాలి. మరణానంతరం అప్పటి వరకు శరీరాన్నంటి పెట్టుకొని ఉంటుందని చెప్పే ఆత్మ అతని శరీరాన్ని వదిలి బయటకు పోవాలి. ఒకవేళ అలా జరిగితే మృత శరీరాన్ని మళ్ళీ బరువు తూసినపుడు అది తప్పనిసరిగా తగ్గాలి. లేకపోతే ఆత్మకు అస్తిత్వం లేదని తేలిపోతుంది. కానీ ఆ శవం బరువు ఏమాత్రం తగ్గకపోగా ఎంతోకొంత పెరిగినట్లు కనబడుతుంది. అంతేగాక మరణానికి ముందు సజీవ చైతన్యంతో తొణికిసలాడిన భౌతిక శరీరం ఆ తరువాత జడప్రాయమై పోవడమూ మనం గమనించవచ్చు. దీన్నిబట్టి ఆత్మ అనేది లేదని కచ్చితంగా చెప్పవచ్చు."

ఆత్మరాహిత్యాన్ని నిరూపించడంకోసం 'పాయసి' అవలంబించిన పద్ధతులు చాలా ఆటవికంగా, హింసాత్మకంగా ఆధునిక కాలంలో మనకు కనిపించవచ్చు. కానీ ఆత్మ పరమాత్మలాంటి అది భౌతిక, కాల్పనిక విషయాల ఉనికిని నిరాకరించడానికి కనీసం వ్యతిరేకించడానికి ఆనాటి విజ్ఞాన శాస్త్రపు అభివృద్ధి స్థాయి దృష్ట్యా అంతకంటే వేరే మార్గం లేదు. ఏదేమైనా సైద్ధాంతిక విషయాలను ప్రయోగాత్మకంగా నిరూపించడానికి అతి ప్రాచీన కాలంలోనే లోకాయతులు చేసిన కృషి అభినందించదగినది.

మన ప్రాచీన సైన్సు అని సంఘ పరివారం ప్రచారం చేస్తున్నది మన వాస్తవ సైన్సు గురించి

> "చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు."

కాదు. ఆనాడు పురాణాల్లో రాసిన కథలు, అందులోని ఊహాజనిత కథనాలను నేడు వీరు సైన్సుగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి వీరికి మన ప్రాచీన చరిత్రలో అభివృద్ధి చెందిన సైన్సు పట్ల, అంటే వాడు గణితంలోనూ, వైద్యంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ భారతదేశం సాధించిన వాస్తవ విజయాలపట్ల ఆసక్తి లేదు. అందువల్ల ఆర్‌ఎస్‌ఎస్ వారి "పుక్కిటి పురాణ సైన్సు"ను పూర్వపక్షం చేసి మన ప్రాచీనులు సైన్సులో సాధించిన వాస్తవ విజయాలను ప్రచారం చేయాల్సి ఉంది.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా నేటికీ సమాజంలో కొనసాగుతున్న ఫ్యూడల్ భావాలు, నిరక్షరాస్యత, సామాజిక, ఆర్థిక అసమానతలు ప్రజల్లో హిందూత్వ భావజాలం త్వరగా వ్యాప్తి కావడానికి అనుకూలంగా ఉన్నాయి. సరిగ్గా ఇదే పరిస్థితి శాస్త్ర విజ్ఞానం, హేతుదృక్పథం పెరుగుదలకు పెద్ద అడ్డంకిగా కూడా ఉన్నాయి. వీటికి తోడు మూఢ భావాలు, అశాస్త్రీయ ఆచారాలు ప్రజల్లో బలంగా నాటుకుని ఉండడం అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి. వీటిని అధిగమించి ప్రజల్లో హేతు దృక్పథాన్ని పెంచడానికి ప్రయత్నం జరిగినా సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పు రానందున ఆ వైపు పెద్దగా అడుగులు పడలేదు. అయినప్పటికీ నాటి మన పాలకులు మన సాంఘిక వాతావరణాన్ని శాస్త్రీయ దృక్పథం, తార్కిక ఆలోచనలు, మూఢాచారాల నిర్మూలన, లౌకిక తత్వం, పురోగామి సంస్కరణలవైపుకు మళ్లించడానికి కొంత ప్రయత్నం చేశారు. మీడియా కూడా పెద్ద పాత్ర నిర్వహించింది. న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలు దీనికి ఊతమిచ్చాయి. భావాల ఘర్షణలో శాస్త్రీయ, తార్కిక ఆలోచనా విధానానిదే పైచేయి అయింది.

కానీ నేడు ఆ పరిస్థితి మారిపోయింది. హిందూత్వ భావజాలం కలిగిన మితవాద ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ప్రభుత్వమే రాజ్యాంగ విధులను విస్మరించి శాస్త్రీయ దృక్పథానికి వ్యతిరేకంగా మారింది. మీడియా పూర్తిగా కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోవడం వల్ల దానికి శాస్త్రీయ ఆలోచనా ధోరణుల ప్రచారం పట్ల ఆసక్తి లేకుండా పోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక కార్యకర్తలు, కాస్తో కూస్తో ప్రజాదృక్పథాన్ని అలవరచుకున్న పత్రికలు, ప్రాత్రికేయులు శాస్త్రీయ ఆలోచనా ధోరణిని ప్రచారం చేయబోతే వారికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి.

'మంచి గతమున కొంచెమేనోయ్' అని గురజాడవారు చెప్పినట్లు గత కాలంలో జరిగిన శాస్త్రీయ పరిశోధన చాలా కొంచెం మాత్రమే. సమాజ గమనంలో ఫ్యూడల్ సమాజ గర్భంనుండి పెట్టుబడిదారీ సమాజం తొలుత ముందుకు వచ్చిన యూరప్‌లో ఆధునిక సైన్సు పరిశోధనలు ప్రారంభమైనాయి. అక్కడి నుండి పెట్టుబడిదారీ సమాజం వ్యాపించినంత వరకు ప్రపంచ వ్యాపితంగా సైన్సు విస్తరించింది.

ఈ ఆధునిక సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని అందిపుచ్చుకుని మన సమాజాన్ని అందంగానూ, సౌకర్యవంతంగానూ తీర్చిదిద్దుకోవలసింది పోయి మళ్లీ సమాజాన్ని వెనక్కు నడిపించడానికి చీకటి శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రతి ఆధునిక ఆవిష్కరణా ప్రాచీన గ్రంథాల్లో ఉన్నట్లు, అందువల్ల మన దేశంలో ఏనాడో దాన్ని కని పెట్టేసినట్లు భావిస్తే ఇంక ఆధునిక పరిశోధనల అవసరం ఏముంటుంది? కచ్చితంగా ఈ ధోరణి సమాజాన్ని వెనక్కు మళ్లిస్తుంది.

మితవాద ప్రభుత్వాలూ, వాటి ప్రాపకం పొందిన ప్రచారకర్తలు ఈ విధంగా అశాస్త్రీయ భావాల ప్రచారంలో తరించి పోతుంటే మరో వైపు సమాజంలో మనుషుల స్వయం శక్తిపై నమ్మకాన్ని వమ్ముచేసే కర్మకాండలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. యజ్ఞాలు యాగాలు, స్వాములు బాబాలు, తాయత్తులు అంత్రాలు,


## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా
సెల్: 9490099333 email: venkataraosankarapu@gmail.com

శకునాలు జ్యోతిష్యాలు...ఇవన్నీ రానురాను చదువుకున్న వారిలో కూడా అధికమవుతున్నాయి.

> “చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు.”

మన పత్రికల్లో పేజీలకు పేజీలను రాశిఫలాలు, స్థలపురాణాలు, ఇతర అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాల వ్యాప్తికి కేటాయిస్తారు. కానీ శాస్త్రీయ దృక్పథం, హేతువాద భావాల ప్రచారానికి ఒక్క కాలమ్ కూడా ఉండదు. టీవీల్లో పొద్దున్న లేస్తే అన్ని ఛానళ్లలోనూ అదే ప్రచారం. భక్తి, ఆధ్యాత్మికత పేరుతో ఆయా మతాలు ప్రత్యేక ఛానళ్లనే ఏర్పాటు చేసుకున్నాయి. చివరికి సరుకుల అడ్వర్టైజ్ మెంట్లు చేసుకోడానికి కూడా మూఢనమ్మకాలను ఉపయోగించుకుంటున్నారు. కానీ ఏ ఛానల్‌కూడా ఈ హేతువిరుద్ధ ప్రచారాలను పూర్వపక్షం గావించేందుకు రోజూ కొంత సమయం కూడా కేటాయించదు.

మన రాజ్యాంగం లౌకికతత్వ పునాదిపై నిర్మితమైంది. శాస్త్రీయ దృక్పథం, హేతువాద ఆలోచనా విధానం ప్రజల ప్రాథమిక విధి అని రాజ్యాంగాలో పేర్కొనబడింది. కానీ నేడు ఆ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన భావజాలాన్ని పాలక వర్గాలు పెంచి పోషిస్తున్నాయి. అదే సమయంలో ఇటువంటి హేతువిరుద్ధ ప్రచారాలను ఎదుర్కొనే గొంతులు సమాజంలో రోజురోజుకూ తగ్గిపోతున్నాయి.

## హిందుత్వ సిద్ధాంతం – భారత చరిత్ర

హిందూ మతం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని వాదిస్తూ హిందూ జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి ఆర్ఎస్ఎస్ పరివారం ప్రయత్నిస్తారు. హిందువులకు భారత దేశం మాతృభూమి మాత్రమే కాకుండా పుణ్య భూమి కూడా, అందువల్ల తమ మతం మూలాలు భారత దేశంలో లేని ముస్లింలు, క్రైస్తవులు ఈ దేశంలో ద్వితీయ స్థాయి పౌరులుగా మాత్రమే నివసించాలని ఆర్ఎస్ఎస్ నేత వి.డి సావర్కర్ చెబుతాడు. హిందువులు అంటే వారి ఉద్దేశ్యంలో వేదాలు, పురాణాలు నమ్మేవాళ్లు. వేదాలు ఆర్యుల చేత సంస్కృతంలో చెప్పబడ్డాయి. అందువల్ల వేదాలు, పురాణాలు, సంస్కృత భాష వీటిని హిందూమతానికి ప్రతీకగా చెబుతారు. దీన్ని వైదిక నాగరికత అంటున్నారు. భారత దేశం ఆది నుండీ వైదిక నాగరికతకు నెలవని వారి వాదన. అందుకనే ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష అనే నినాదం కింద ఆర్ఎస్ఎస్-బిజెపిలో దేశంలోని మెజారిటీ హిందువులను సమీకరించడానికి పూనుకున్నాయి. ఇంకోవిధంగా చెప్పాలంటే ఈ నినాదం కింద దేశాన్ని మతాల వారీగా చీల్చడానికి ప్రయత్నిస్తున్నాయి.

అయితే ఆధునిక సైన్సు పరిశోధనలు వారి వాదనను అంగీకరించడం లేదు.

మొదటిది, భారత దేశంలో ఆర్యుల కన్నా పురాతన ప్రజలు నివసించారు. వారు సింధు నదీ తీరంలో నేటికి 5000 ఏళ్ల క్రితమే బాగా అభివృద్ధి చెందిన సమాజాలను నిర్మించుకున్నారు. పురాతత్వ శాస్త్ర పరిశోధకులు సింధునదీ తీరంలో మొదట హరప్ప, మొహంజదారో నగరాలను కనుగొన్నారు. తరువాత అటువంటి అనేక నగరాలు, పట్టణాలను కనుగొన్నారు. అందుకని ఈ నాగరికతను సింధు నాగరికత అంటున్నారు.

ఆర్యుల విషయానికి వస్తే ఇండో యూరోపియన్ భాషను మాట్లాడే వీరు పూర్వం కజకిస్తాన్‌లోని ఉత్తర కజాక్ గడ్డి మైదానాలలో అర్ధ-సంచార తెగల జీవనం సాగించేవారనీ, క్రీస్తు పూర్వం 1800 సం॥ నుండి 1500 సం॥ మధ్యలో వారు మధ్య ఆసియా నుండి భారత ఉపఖండంలో ప్రవేశించి ఇక్కడ స్థిర పడ్డారని శాస్త్ర పరిశోధనలు చెబుతున్నాయి.

ఆర్యుల తొలి గ్రంథమైన రుగ్వేద సూక్తులు క్రీస్తుపూర్వం 1800 సం॥ నుండి క్రీ.పూ 500 సంవత్సరాల మధ్య రూపొందించబడ్డాయి. అంటే ఆర్యులు మధ్య ఆసియాలో ఉండగా ప్రారంభమైన రుగ్వేద రూపకల్పన వారు భారత దేశంలోకి వలస వచ్చిన తరువాత ముగిసింది. ఇతర మూడు వేదాలు తరువాతి కాలంలో రూపొందించబడ్డాయి.

అందువల్ల ఆర్యుల మూలాలు, వైదిక మతంగా చెబుతున్న హిందూమతం మూలాలు విదేశాల్లో ఉన్నాయని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్న కథనం ఆర్ఎస్ఎస్ పరివారం చెబుతున్న 'హిందూ, హిందీ, హిందుస్తాన్' కథనంతో పొసగడం లేదు. అందువల్ల వారు ఏకంగా చరిత్రనే మార్చేయ బూనుకున్నారు. ఆది నుండీ ఆర్యులు భారత దేశలోనే నివసిస్తున్నారనే విధంగా ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలను మార్చేస్తున్నారు. ఈ వాదనను బలపరుచుకునేందుకు విశ్వవిద్యాలయాల్లో తప్పుడు 'పరిశోధనలను' ప్రోత్సహిస్తున్నారు. సంఘ్ పరివార్ నేతలు శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిర్ధారించిన చరిత్రను వక్రీకరించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

## శాస్త్రీయ దృక్పథం – లౌకికవాదం

సైన్స్‌యొక్క ముఖ్యమైన పరిణామం లౌకికభావ అభివృద్ధి.

ప్రపంచంలో ఎక్కడైతే లౌకిక తత్వం రాజ్యమేలుతుందో అక్కడ సైన్సు వికసిస్తుంది. బిజెపి లౌకిక తత్వానికి బద్ధ వ్యతిరేకి. లౌకిక తత్వం అంటే మత నమ్మకాల నుండి రాజ్య పాలనను విడదీయడం. మతం వ్యక్తిగతమైనది, రాజ్యపాలన సామూహికమైనది. అందువల్ల అధికారంలో ఎవరు ఉన్నా గానీ వారికి ఏదోఒక మతం పట్ల నమ్మకం ఉండవచ్చు లేక అసలు ఏ మతం పట్ల నమ్మకం లేకపోవచ్చు అటువంటి వారు పరిపాలనా వ్యవహారాల్లో అంటే అధికార వ్యవహారాల్లో వారి నమ్మకాలతో నిమిత్తం లేకుండా ప్రజలందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించాలి. మత అభిప్రాయాలను బట్టి కాకుండా హేతుబద్ధంగా, సాక్ష్యాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. అంటే వారు తమ మత నమ్మకాలకు అతీతంగా వ్యవహరించాలి. అలా జరగాలంటే రాజ్యం మతానికి అతీతంగా ఉండాలి.

మధ్య యుగాల్లో యూరప్‌లో చర్చి, రాజ్యం కలిసి ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే రాజ్య వ్యవస్థను చర్చి శాసించేది. ఈ చర్చి నమ్మకాలు సమాజంలో హేతుదృక్పథంతో కూడిన కొత్త ఆలోచనలకు అడ్డుపడేవి. సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో యూరప్‌లో అభివృద్ధి చెందుతున్న బూర్జువా వర్గంతోపాటే సైన్సు వికసించడం ప్రారంభించింది. దీనికి ఫ్యూడల్ అధిపతుల సహకారంతో చర్చికూడా అడ్డు పడేది. బూర్జువా విప్లవాలు జయప్రదం అయిన చోట రాజ్యంతో మతాన్ని పూర్తిగా వేరుచేయడం

> "చారిత్రకంగా విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు మతం పేరుతో నిలదొక్కుకుంటున్న మూఢనమ్మకాలను సవాలు చేశాయి. కానీ ఇప్పుడు భారత దేశంలో దీనికి వ్యతిరేక దిశలో జరుగుతోంది. బిజెపి అధికార పగ్గాలు చేపట్టిన తరువాత మతమూఢభావాలు సైన్సును సవాలు చేస్తున్నాయి. పాఠ్యాంశాలలో సైన్సును తొలగించి మూఢనమ్మకాలను ప్రవేశపెడుతున్నారు."

ద్వారా లౌకిక రాజ్యాంగాలను రూపొందించుకున్నారు. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర అభివృద్ధి చెందిన దేశాల రాజ్యాంగాలన్నీ లౌకికతత్వం ప్రాతిపదికగా ఏర్పడినవే. వలస వాదం నుండి విముక్తి చెంది ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకున్న దేశాలు కూడా ఇదే బాటను అనుసరించాయి, ఎందుకంటే ప్రజాస్వామ్యంతో కూడిన ఆధునిక సమాజాలుగా ఎదగాలంటే లౌకికతత్వాన్ని అనుసరించడం మినహా మరో మార్గం లేదు. అందుకే మన రాజ్యాంగ నిర్మాతలు భారత దేశం లౌకికతత్వం పునాది మీద అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాజ్యాంగానికి మూలస్తంభాల్లో ఒకటిగా లౌకిక తత్వాన్ని చేర్చారు.

కానీ సంఘ్ పరివారం ఈ లౌకిక తత్వాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది. భారత దేశం 'హిందూత్వ' రాజ్యంగా మారాలనేది దాని లక్ష్యం. హేతుబద్ధమైన, సాక్ష్యాలు ఆధారంగా గల పౌర పాలన కాకుండా హిందూ మత గ్రంథాల్లో పేర్కొన్న ఆచారాలు, నమ్మకాల ఆధారంగా పాలన సాగించాలని వారు కోరుకుంటారు. వారు ప్రాచీనత గురించి మాట్లాడేప్పటికీ నిజంగా వారు అనుసరించదలచుకున్నది ప్రాచీన భారత దేశంలో అభివృద్ధి చెందిన సైన్సు, హేతుబద్ధ ఆలోచనా విధానాన్ని కాదు, ఆనాడు సమాజంలో ప్రముఖంగా ఆచరించి, మతగ్రంథాల్లో నిక్షిప్తం చేసిన అహేతుకమైన నమ్మకాలు, మూఢాచారాలను.

భారత రాజ్యం లౌకికతత్వాన్ని అనుసరిస్తే దేశంలో సైన్సు-టెక్నాలజీ అభివృద్ధి చెంది, సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది, హిందూత్వను అనుసరిస్తే సైన్సు-టెక్నాలజీ అభివృద్ధి ఆగిపోతుంది. సైన్స్ భావాలు వ్యాప్తి జరిగితే మతభావం దశం వెనుకబడుతుంది. లౌకికవాదం బలపడుతుంది.

## ముగింపు

సైన్సు హేతువుకు వాహకంగా పని చేస్తుంది. వివేకాన్ని వ్యక్తీకరిస్తుంది. అలాంటి సైన్సును హిందూత్వ బలంగా వ్యతిరేకిస్తుంది అది ఒకవైపున తన పురాణాలకు చట్టబద్ధత కోసం సైన్సును ఆశ్రయిస్తూనే మరోవైపు సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ అణచి వేస్తోంది. శాస్త్ర పద్ధతులను నిరంతరం అణచివేస్తూనే మరోవైపు సాంకేతిక పరిజ్ఞానాన్ని కీర్తిస్తుంది. హేతుబద్ధత, విమర్శనాదృష్టి అనేవి ఆధునిక ప్రపంచ దృక్పథంలో కీలకాంశాలు, ఈ రెండింటినీ హిందూత్వ విస్మరిస్తుంది, తిరస్కరిస్తుంది. సనాతన ధర్మం పట్ల గుడ్డి విశ్వాసాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తుంది. మరోవైపు శాస్త్ర విజ్ఞాన ఫలితాలైన సాంకేతిక ఉత్పత్తులను సముపార్జించుకునేందుకు ఆరాటపడుతుంది, అదే సమయంలో ప్రతి భావనను, ప్రతి విశ్వాసాన్ని విమర్శనాయుతంగా ప్రశ్నించే అవకాశాన్ని పూర్తిగా మూసివేస్తుంది. అంటే ఈ వితవాద హిందూత్వ భావజాలం ప్రశ్నపై ఆధారపడే సైన్సుకు దారులు మూసేస్తుందన్నమాట. కాబట్టి సైన్సు ఉద్యమం ముందుకు పోవాలంటే, ప్రజల్లో హేతువాద భావజాలం పెంపొందించాలంటే హిందూత్వ సిద్ధాంతాన్ని ప్రజల మనసుల్లో ఓడించడం అవసరం.

## ఏం చేయాలి?

1. సైన్సు, హేతు దృక్పథానికి వ్యతిరేకంగా హిందూత్వ చేస్తున్న వాదనలను పూర్వపక్షం గావిస్తూ, సాక్ష్యాల ఆధార వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పే సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచురించడం అవసరం. చిన్న చిన్న అంశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చిన్న పుస్తకాలు, కరపత్రాలు ప్రచురిస్తే పెద్ద ప్రభావం ఉంటుంది. కేరళలోని చింతా పబ్లికేషన్స్ వివిధ వయస్సుల పిల్లలకోసం పలు రకాల మ్యాగజైన్లు ప్రచురిస్తున్నారు. తెలుగులో అటువంటి ప్రయత్నం ప్రారంభించవచ్చు.

ముఖ్యంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలంటే ముందుగా సైన్సు ప్రచారం చేసే కార్యకర్తలు శాస్త్ర-సాంకేతిక రంగాల్లో వస్తున్న సరికొత్త మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలి. దీనికిగాను సైన్సు రంగ కార్యకర్తలు, ఇతర సైన్సు ప్రచారకులను ప్రభావితం చేసే సాహిత్యాన్ని ప్రచురించాలి, వర్కుషాపులు నిర్వహించాలి.

2. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, తార్కిక ఆలోచనా విధానాన్ని పెంపొందించే క్యాంపెయిన్స్ నిర్వహించాలి. పాటలు, నాటికలు, కళారూపాలు, మ్యాజిక్ షోలు వంటి రూపాల ద్వారా ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడం సులువు. షార్ట్ ఫిల్ములు, యూ ట్యూబ్ ఛానళ్లను ఎంత వరకు ఉపయోగించుకోగలమో ఆలోచించాలి.

3. భారత దేశ చరిత్రను వక్రీకరిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. పురాణాలనే చరిత్రగా చిత్రీకరిస్తున్నారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి చరిత్రకు సంబంధించిన వాస్తవాలను తెలియజెప్పే సాహిత్యం విరివిగా తీసుకురావాలి. పురాతత్వ పరిశోధన ఆధారంగా భారత దేశ చరిత్రను శాస్త్రీయంగా వివరించే సాహిత్యం ఇప్పటికే విస్తృతంగా వెలువడింది. కార్యకర్తలు వాటిని అధ్యయనం చేయడం అవసరం. ఆయా సందర్భాన్ని బట్టి వాటిని ప్రజలకు సులభంగా అర్థమయ్యేట్లు కరపత్రాలు, చిన్న పుస్తకాలు, వ్యాసాల రూపంలో ప్రచురించవచ్చు. వాటిని కళా రూపాలుగా కూడా మలచవచ్చు.

4. హిందూత్వ శక్తులు తమ ప్రచారానికి సోషల్ మీడియాను పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటున్నారు. సోషల్ మీడియాను ఉపయోగించుకోవడంలో మనం చాలా బలహీనంగా ఉన్నాం. ఈ బలహీనతను అధిగమించాలి.

5. శాస్త్రీయ భావాలను ప్రజల్లో పాదుకొల్పాలంటే చిన్నతనం నుండే వారిలో తార్కిక, హేతు దృక్పథాన్ని పెంపొందించాలి. దీనికి పాఠశాలలు, కళాశాలల్లో సైన్సు క్లబ్బులు, వివిధ అంశాలపై చర్చా గోష్ఠుల నిర్వహణ మంచి మార్గం. ఎక్కడెక్కడ దీనికి అవకాశాలుంటే వాటిని ఉపయోగించుకోడానికి ప్రయత్నించాలి. సైన్సు ఎగ్జిబిషన్ల నిర్వహణకు ఉన్న అవకాశాలు పరిశీలించాలి.

6. బిజెపి-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం పాఠ్యాంశాల్లో అశాస్త్రీయమైన బోధనాంశాలను ప్రవేశపెట్టడం, మిథ్యా సైన్సును సైన్సుగా చెప్పడం ద్వారా భావి తరాలను శాస్త్ర జ్ఞానానికి దూరం చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలి. ❖

# చిప్ యుద్ధం నుండి అరుదైన మూలకాల యుద్ధం వరకు

(2వ పేజీ తరువాయి)

సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. గాలిమర, విద్యుత్ వాహనాల విషయంలో యంత్రాల సామర్థ్యాన్ని వాటి అయస్కాంతాల సామర్థ్యం నిర్ణయిస్తుంది. అందువల్ల ఇది వినియోగదారునికి చాలా ముఖ్యమైన విషయం. అందువల్ల పునరుత్పాదక ఇంధన పరిశ్రమ, దాంతోపాటు మొబైల్‌ఫోన్ మార్కెట్ విస్తరించాలంటే చౌకగా, సమర్థవంతంగా పనిచేసే అయస్కాంతాల లభ్యత చాలా కీలకం. అంతే కాదు. ఇటువంటి సమర్థవంతమైన అయస్కాంతాలు ఏరోస్పేస్ పరిశ్రమకూ, డ్రోన్లు క్షిపణుల ఉత్పత్తికి కూడా కీలకం. చిప్స్ ఈనాడు అన్ని రకాల ఆధునిక పరికరాల్లో ఉపయోగపడుతున్నట్లే, ఈ అరుదైన మూలకాలు కూడా ఉపయోగపడుతున్నాయి.

అరుదైన మూలకాల వనరుల మీద చైనాకు పూర్తి గుత్తాధిపత్యం ఉందా? లేదు, అరుదైన మూలకాల వనరుల మీద చైనాకు పూర్తి గుత్తాధిపత్యం లేదు.ప్రపంచ అరుదైన మూలకాల వనరుల్లో 44 శాతం మాత్రమే చైనా దగ్గర ఉన్నాయి. వియత్నాం వద్ద 22 శాతం, బ్రెజిల్, రష్యాల్లో ఒక్కోదాని వద్ద 21 శాతం చొప్పున, భారత దేశంలో 6.9 శాతం, ఆస్ట్రేలియాలో 5.7 శాతం, మిగిలింది ఇతర దేశాల్లో ఉంది. అయితే చైనా దగ్గర ఇతర పదార్థాల నుండి అరుదైన మూలకాలను వేరుచేసే టెక్నాలజీపై గుత్తాధిపత్యం ఉంది. అరుదైన మూలకాల ఆధారంగా నిర్మితమయ్యే ఇతర పదార్థాల సరఫరా గొలుసుపై దానికి గుత్తాధిపత్యం ఉంది. అనేక పారిశ్రామిక, సైనిక ఉత్పత్తులకు ఇవే కేంద్ర స్థానంలో ఉంటాయి. వీటిని అరుదైన మూలకాలు అని పిలుస్తున్నప్పటికీ మన భూమి క్రస్ట్‌లో ఈ మూలకాలు విరివిగా దొరుకుతాయి. సమస్య ఏమంటే, అవి చాలా తక్కువ సాంద్రతలో దొరుకుతాయి. తరచూ రేడియోధార్మిక మూలకాలతో కలిసి పోయి ఉంటాయి. ఉదాహరణకు భారత దేశంలో మోనజైట్ ఇసుకలో థోరియం వంటి రేడియోధార్మిక మూలకాలతో కలిసి ఉంటాయి. ఈ రంగంలో భారత రేర్ ఎర్త్ లిమిటెడ్ (ఐఆర్ఇఎల్)కు గొప్ప అనుభవంతో కూడిన చరిత్ర ఉంది. అయితే దాని ప్రధాన లక్ష్యం అంతా థోరియం వెలికితీత పైనే కేంద్రీకరించడం జరిగింది. అంటే ఐఆర్ఇఎల్ సంస్థ మోనజైట్ ఇసుకలోని థోరియం మీద కేంద్రీకరించింది గానీ పునరుత్పాదక ఇంధనాలకు కీలకమైన అరుదైన మూలకాలమీద కేంద్రీకరించలేదన్న మాట. అరుదైన మూలకాలకు సంబంధించిన వనరులు విస్తారంగా లభిస్తున్నా, ఇతర దేశాలు, చివరికి అవి ఎక్కువగా లభించే ఆస్ట్రేలియా కూడా చేయనిది చైనా ఎలా అరుదైన మూలకాల రంగాన్ని నిర్మించగలిగింది? వాస్తవానికి ఆస్ట్రేలియా అమెరికా మిత్ర దేశం, రక్షణ రంగంలో ఇండో-పసిఫిక్‌లో అమెరికా కూటమిలో భాగస్వామి కూడా.

1950వ దశకం నుండి 80వ దశకం వరకు అరుదైన మూలకాల ఉత్పత్తిలో అమెరికాదే పైచేయి. అప్పుడు కూడా అరుదైన మూలకాలు అనేక రకాలుగా ఉపయోగపడేవి. కలర్ టెలివిజన్‌ల నుండి కలరింగ్ గ్లాసెస్ వరకు, చమురు క్రాకింగ్ (చమురును తేలికైన ముక్కలుగా విడగొట్టడం) మొదలైన పనులకు వీటిని ఉపయోగించేవారు. ఈరోజు అరుదైన మూలకాలు అనేక రకాల పరిశ్రమల్లో ఉపయోగపడుతున్నాయి. గాలిమరల దగ్గరనుండి, విద్యుత్ వాహనాలు, విమానాలు, రోబోట్లు వగైరా అనేక పరిశ్రమల్లో ఉపయోగపడుతున్నాయి. సైనిక రంగంలో వాటిని క్షిపణుల్లోనూ, లేజర్లు, ట్యాంకులు వంటి సైనిక వాహనాల్లోనూ, సైనిక కమ్యూనికేషన్లలోనూ ఉపయోగిస్తారు. అరుదైన మూలకాల్లో 60 శాతాన్ని చైనా స్వయంగా తయారు చేసుకుంటుండగా, 90 మూలకాలను ప్రాసెస్ చేస్తుంది. ఉదాహరణకు, మయన్మార్, ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలు ఉత్పత్తి చేసే అరుదైన మూలకాలను చైనా ప్రాసెస్ చేస్తుంది. మనం పైన మాట్లాడుకున్న భార అరుదైన మూలకాల విషయంలో చైనాకు ఇంకా ఎక్కువ, అంటే 99 శాతం నుండి 99.9 శాతం గుత్తాధిపత్యం ఉంది.

అమెరికా సైన్యానికి ఈ అరుదైన మూలకాలు ఎంత కీలకం?


"అమెరికాకు చెందిన అనేక రక్షణ ఉత్పత్తులకు, ఎఫ్-35 యుద్ధ విమానాలు, వర్జీనియా కొలంబియా క్లాస్ సబ్‌మెరైన్లు, టొమహాక్ క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, ప్రిడేటర్ మానవరహిత విమానాలు, స్మార్ట్ బాంబులు వంటి అనేక ఉత్పత్తులకు ఈ అరుదైన మూలకాలు అవసరం" అని అమెరికా థింక్‌ట్యాంక్ సంస్థ అయిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ తెలిపింది. "ఉదాహరణకు ఒక ఎఫ్35 యుద్ధ విమానంలో 900 పౌండ్ల అరుదైన మూలకాలు ఉపయోగిస్తారు. ఒక ఆర్లీ బర్క్ క్లాస్ డిస్ట్రాయర్ యుద్ధ నౌక తయారు చేయడానికి 5,200 పౌండ్లు, వర్జీనియా క్లాస్ సబ్‌మెరైన్ తయారు చేయడానికి 9,200 పౌండ్ల అరుదైన మూలకాలు కావాలి" అని అది తెలిపింది.

నౌకలు, జలాంతర్గాములు, విమానాలు వంటి ప్రధాన రవాణా వాహనాలను పక్కన పెట్టి సైనిక పరికరాలను చూసుకున్నా అందులో క్షిపణులు, మానవ రహిత విమానాలు, స్మార్ట్ బాంబులు మొదలైన వాటిని తయారు చేయడానికి కూడా అమెరికా దగ్గరగానీ, దాని మిత్ర దేశాల దగ్గర గానీ తగినంత అరుదైన మూలకాల తయారీ సదుపాయాలు లేవు. అమెరికాలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ 2025లో ఉత్పత్తి ప్రారంభించినా కూడా అది 2018లో చైనా ఉత్పత్తి చేసిన అరుదైన మూలకాల్లో ఒక్క శాతం మాత్రమే ఉత్పత్తి చేయగలదు. చైనా బయట అరుదైన మూలకాలను తయారు చేస్తున్న అతి పెద్ద పరిశ్రమ ఆస్ట్రేలియాలో ఉంది. దానిపేరు లైనాస్ రేర్ ఎర్త్స్. కానీ ఇది కూడా మధ్యంతర ఉత్పత్తులను మాత్రమే తయారు చేస్తూ తుది ఉత్పత్తి కోసం ప్రాసెసింగ్‌కు దాన్ని చైనాకు పంపుతోంది.

చిప్స్ తయారీలో గానీ, అరుదైన మూలకాల తయారీలో గానీ గుత్తాధిపత్యం శాశ్వతంగా ఒక దేశం చేతిలో ఎన్నటికీ ఉండజాలదు. ఖండాలంత వైశాల్యంలో ఉన్న అమెరికా, చైనా, భారత దేశాలు ఏవీ కూడా అరుదైన మూలకాల సాంకేతికపై గుత్తాధిపతులుగా ఎల్లకాలం ఉండడం సాధ్యం కాదు. అయితే, చిప్స్‌పైన గానీ, అరుదైన మూలకాలపైన గానీ నిషేధాల వల్ల కొంతకాలం పాటు ఆయా దేశాల్లో ఉత్పత్తి కొంతకాలం పాటు మందగించవచ్చు. ఏదో ఒకటి, లేక కొద్ది దేశాలకు కొంత కాలంపాటు పై చేయి రావచ్చు. కాని అది ఎక్కువ కాలం సాగదు. ఖచ్చితంగా ఒక ఉత్పత్తి మీద గానీ, ఒక దేశానికి గానీ పైచేయి ఎల్లకాలం సాధ్యం కాదు. గతంలో అమెరికా, దాని మిత్రపక్షాలు భారత దేశం వంటి వాటిపై అణు ఇంధనం, క్షిపణులు తయారు చేసుకోకుండా పెట్టిన నియంత్రణలు నిలవలేదు. అటువంటిదే ఈ నియంత్రణలు సమీప భవిష్యత్తు వరకు పనిచేస్తాయనుకోవడం భ్రమ మాత్రమే. కానీ, ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక దృష్టి గురించి కీన్స్ చెప్పినట్లు: "ఈ దీర్ఘకాలం అనేది నేటి వ్యవహారాలను తప్పుతోవపట్టిస్తుంది. దీర్ఘకాలంలో మనందరం చనిపోతాం."

ఈ రోజున మనముందున్న వ్యూహాత్మక సమస్య మన భవిష్యత్తును ఎవరు నియంత్రిస్తారు అన్నది కాదు, ఇప్పుడు మనల్ని ఎవరు నియంత్రిస్తున్నారు అన్నది. ఈ రోజు చిప్స్, ఇంధన యుద్ధాల్లోని వ్యూహాత్మకం అంశం ఇదే.

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 5 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



"పెట్టుబడిదారీ సమాజంలో స్వేచ్ఛ ప్రాచీన గ్రీకు రిపబ్లిక్కుల్లోని స్వేచ్ఛ మాదిరిగానే ఉంటుంది : అది బానిస యజమానుల స్వేచ్ఛ."

– విఐ లెనిన్
(తొలి సోషలిస్టు విప్లవ సారధి)



"విప్లవం నాకు కళలను పరిచయం చేసింది, కళలు నన్ను విప్లవానికి పరిచయం చేశాయి!"

– ఆల్బర్ట్ ఐన్‌స్టీన్
(ప్రఖ్యాత శాస్త్రవేత్త)



"నేను పేదలకు ఆహారం ఇస్తే వాళ్లు నన్ను సెయింట్ అన్నారు. పేదలకు ఆహారం ఎందుకు లేదు అని నేను అడిగితే, వాళ్లు నన్ను కమ్యూనిస్టు అన్నారు"

– హెల్డర్ పెస్సోవా కమారా
(బ్రెజిల్‌కు చెందిన రోమన్ కాథలిక్ ఆర్చిబిషప్)



"మనకు ప్రజల మీద నమ్మకం ఉండాలి, మనకు (కమ్యూనిస్టు) పార్టీ మీద నమ్మకం ఉండాలి. ఈ రెండూ ప్రాథమిక సూత్రాలు. ఈ రెండు సూత్రాలపట్ల నమ్మకం లేకుంటే మనం ఏమీ సాధించలేం."

– మావో జెడాంగ్
(చైనా విప్లవ నేత)



"తుపాను వస్తే పైన్, సైప్రస్ వృక్షాలకు మంచే జరుగుతుందని గుర్తుంచుకోండి. ఎందుకంటే అది వాటి బలాన్నీ, స్థిరత్వాన్నీ చాటి చెబుతుంది."

– హో చి మిన్
(వియత్నాం విప్లవ నేత)

**చిరునామా**
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501,
గుంటూరు జిల్లా సెల్: 94900 99422

**చందా వివరాలు**
విడిప్రతి: రూ.15, సంవత్సర చందా:రూ.150, పోస్టు ద్వారా రూ. 180
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

పోస్టుస్టాంపు

ఇంటి నెంబరు ..............................
వీధి ..............................
గ్రామం ..............................
మండలం లేదా పట్టణం ..............................
జిల్లా..............................

e m a i l | marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.